

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

కరీంనగర్

: fb.com/vaartha Digital

Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

29-10-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 269 పేజీలు: 8+16 వెల: 6.50

కాంగ్రెస్ బలం ఏమిటో తెలిసింది: ప్రధాని 3

28 ఎమ్మెల్సీ స్థానాల్లో కాంగ్రెస్ జీరో 5




స్పెయిన్‌లో రెండు
హైస్పీడ్ రైళ్లు ఢీ 5
64 మంది మృత్యువాత,
150 మందికి పైగా గాయాలు



సూడాన్‌లో అంతర్యుద్ధం..
నైలా మార్కెట్‌పై డ్రోన్ దాడి..
100 మందికిపైగా మృతి



అపార నష్టం



తాగునీటిపై అప్రమత్తం

రిజర్వాయర్లలో నీటి నిల్వలు నిరంతరం పర్యవేక్షించాలి

క్యూర్ ఏరియాలో ఎస్టీపీలు 100% పనిచేయాలి

భవన నిర్మాణాల్లో శుద్ధిచేసిన నీటినే వాడాలి

ట్రీటెడ్ వాటర్ వినియోగంపై సమీక్షలో సిఎం రేవంత్

ట్రీటెడ్ వాట్‌వినియోగంపై బుధవారం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సిఎం రేవంత్. చిత్రంలో సిఎస్

ప్రభాతవార్త ప్రధానప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 28: రాజధాని నగరం హైదరాబాద్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తాగు నీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. క్యూర్ ఏరియాలో మంచినీటి సరఫరా, ఎస్టీపీల నిర్మాణం, ట్రీటెడ్ వాటర్ వినియోగంపై ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్యూర్ ఏరియాలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) వంద శాతం సామర్థంతో పని చేసేలా చూడాలని సీఎం ఆదేశించారు. శుద్ధి చేసిన నీటిని సెక్రటేరియట్‌తో పాటు సీఎంవో, అవుటర్ రింగ్, మైట్రో రైల్, ఇతర శాఖల కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణ, ఇతర అవసరాలకు వినియోగించేలా చూడాలని సీఎం తెలిపారు. పబ్లిక్ పార్క్‌లు, రోడ్ల శుభ్రతకు కూడా ట్రీటెడ్ వాటర్‌నే వాడాలన్నారు. భవన నిర్మాణంలో శుద్ధి చేసిన నీటినే వాడాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ప్రైవేట్ ఎస్టీపీల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా సెంటర్లకూ శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. ఎస్టీపీల నిర్వహణకు సోలార్ విద్యుత్‌ను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి రెడ్కో ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎస్టీపీల్లో నీటి శుద్ధికి అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలు పాటించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నీటి నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీ పడొదన్నారు. ప్రతి శుద్ధి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని, అన్ని ప్లాంట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించి నిరంతరం పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. ఈ కేంద్రాల పనితీరును ఎప్పటికిప్పుడు హైడ్రా పర్యవేక్షించాలన్నారు. ట్రీటెడ్ వాటర్ సరఫరా చేసే ట్యాంకర్లను ట్రాక్ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఈ నీటి వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. ట్రీటెడ్ వాటర్ కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్టీపీల నిర్వహణ, ట్రీటెడ్ వాటర్ వినియోగానికి సంబంధించి నవంబర్1 నుంచి ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రస్తుతం 26 ఎస్టీపీల్లో ట్రీటెడ్ వాటర్‌ను గ్రీన్ ట్యాంకర్స్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు

>>2

కోస్తాంధ్రకు భారీ వర్షాలు

యానాం - నరసాపురం మధ్య తీరం దాటిన 'అర్ణబ్' తుఫాన్

మరో రెండు రోజులు భారీ వర్షాలు, ఈదురుగాలులు

చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడి ఏడుగురి మృతి

స్తంభించిన రవాణా.. తక్షణసాయం చేపట్టిన ప్రభుత్వం

అమరావతి,అక్టోబరు 28,ప్రభాతవార్తప్రతినిధి: అర్ణబ్ తుపాను తీరం దాటింది. యానాంకు నైరుతి దిశలో నరసాపురానికి దగ్గరగా తీరం దాటినట్లు వాతావరణశాఖ వెల్లడించింది. ఇప్పుడు క్రమంగా బలహీనపడుతున్నట్లు అధికారులు తెలిపారు. తుపాను తీరం దాటిన క్రమంలో ఉభయ గోదావరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మధ్యాహ్నం వరకు

>>2





ఓటర్ల వాక్కులు హరించవద్దు

గడువులోగా ఫారాలు
ఇవ్వకపోయినా ఓటరు
జాబితాలో చేరే వాక్కుండాలి..

ఫారం 6పై సందిగ్ధత తొలగాలి

ఇసికి సూచించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, అక్టోబరు 28: ఢిల్లీలో ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు బుధవారం విచారించింది. ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి లక్షలాది మంది పేర్లను తొలగించే విషయంలో ఎన్నికల సంఘం తగిన విచక్షణతో వ్యవహరించిందా అని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారాలు 6, 7,

>>2



బస్సుమార్గం పట్టిన కాంగ్రెస్ నాయకులు

నేడు, రేపు విడుతల వారీగా
బస్సు, కార్లలో వెళ్తున్న నేతలు

హైదరాబాద్, అక్టోబరు 28,ప్రభాతవార్త: భారతీయ జనతాపార్టీ నేతృత్వంలోని నరేంద్రమోడీ సర్కార్ ప్రజాస్వామ్య ప్రక్రియను అపహాస్యంచేస్తూ నియంతృత్వపోకడలకు దారులు వేస్తోందని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న నిరసనను పతాకస్థాయికి తీసుకెళ్ళడానికి నవంబర్1న తలపెట్టిన "ఓట్ బచావో దేశ్ బాచావో" మెగా ర్యాలీకి పాల్గొనేందుకు బస్సుల్లో తెలంగాణ నుంచి అత్యధిక సంఖ్యలోకాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు వెళ్ళడానికి ఉత్సాహం చూపుతున్నారు. నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి

>>2

కరవుపై ముందస్తు చర్యలు

నిధుల కోసం ఢిల్లీకి అఖిలపక్షం

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమష్టి కార్యాచరణ

కరవు కమిటీ సూచనల మేరకు
సహాయ కార్యక్రమాలు


అఖిలపక్ష భేటీలో డి.సిఎం భట్టి



అఖిలపక్ష భేటీలో డి.సిఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, తుమ్మల, సీతక్క, వాకిటి తదితరులు

హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త: ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఏర్పడిన వర్షాభావ, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని ముందస్తు జాగ్రత్తలు, చర్యలను తీసుకుంటోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం సచివాలయంలో మంత్రులు ఉత్తమ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరావు, వాకిటి శ్రీహరి, ధనసరి అనసూయతో కలసి అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని రాజకీయ పార్టీల సూచనలను పరిగణనలోకి తీసుకొని సమష్టి కార్యాచరణతో ముందుకు వెళ్తామని చెప్పారు. విపత్తు పరిస్థితులను ఎదుర్కొనే సమయంలో రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వకుండా, ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా అన్ని పార్టీలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. అఖిలపక్షం సూచించిన అంశాలను సాధ్యమైన మేరకు అమలు చేసేందుకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. కరువు పరిస్థితలపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసి,

>>2



విఆర్ఎస్‌కు సిద్ధమైన జయేశ్ రంజన్‌పై బదలీ వేటు

నవీన్ మిట్టల్‌కు విద్యుత్ తొలగించి
పంచాయతీరాజ్ అప్పగింత

వికాస్ రాజ్‌కు ఆర్ అండ్ బి
తొలగించి విద్యుత్ అప్పగింత

తెలంగాణలో 12 మంది ఐఎఎస్
అధికారుల బదలీలు

హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త: పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం వేటు వేసింది. తాజాగా కాంట్రవర్సీలు జరిగిన శాఖల నుంచి సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. తీవ్ర అసంతృప్తి ఉన్న స్పెషల్ సిఎస్ జయేశ్ రంజన్ ఇటీవల విఆర్ఎస్ తీసుకునేందుకు సిద్ధమైనట్లు సమాచారం అందడంతో ఆయనను మున్సిపల్ శాఖ నుంచి తప్పించింది. విద్యుత్ శాఖ నుంచి సీనియర్ ఐఏఎస్

>>2



ఉద్యోగులకు 3 శాతం డిఎ పెంపు

కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం

రూ.10వేల కోట్లతో కంటైనర్ తయారీ ప్రోత్సాహక పథకం

రూ.1,856 కోట్లతో 'ఖేలో ఇండియా స్పోర్ట్స్ గూడ్స్' తయారీ

కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, అక్టోబరు 28: దీపావళి పండుగ వేళ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కరవు భత్యం(డిఎ), కరవు సహాయం (డిఆర్)ను 3శాతం మేర పెంచింది. ఈ మేరకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో 48.54 లక్షల మంది ఉద్యోగులు, 68.71 లక్షల మంది పెన్షనర్లు మొత్తం 1.17 కోట్లకు పైగా ప్రయోజనం కల్గనుంది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డిఎ, పెన్షనర్లకు డిఆర్ చెల్లిస్తారు. తాజాగా 3 శాతం పెంపునకు కేబినెట్ ఆమోదం తెలపడంతో ఉద్యోగుల వేతనాలు,

>>2

102 ఉద్యోగాలకు టిజిపిఎస్సీ నోటిఫికేషన్

హైదరాబాద్,అక్టోబరు28,ప్రభాతవార్త: నిరుద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మండల ప్లానింగ్ అండ్ స్టాటిస్టికల్ ఆఫీసర్లు, డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. 102 ఉద్యోగాల భర్తీకి అక్టోబర్ 30 నుంచి నవంబర్ 27 వరకు దరఖాస్తులు స్వీకరించనుంది. పరీక్ష జనవరిలో జరిగే

>>2

ఎల్‌నినోపై సమన్వయ కమిటీలు

గ్రామీణ ఉపాధి, పశుగ్రాసం,
తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం

జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వ ఆదేశాలు



హైదరాబాద్,అక్టోబరు28,ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు మండల స్థాయి సమన్వయ కమిటీలను నియమించింది. రాష్ట్రంలో ఈ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు మండల సమన్వయ కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఓ) అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో కమిటీలను ఏర్పాటు చేసింది. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పన, తాగునీటి భద్రత, పశుగ్రాసం అందుబాటుపై కమిటీలు ప్రత్యేక దృష్టిసారించనున్నాయి. 35,959 చిన్న నీటిపారుదల చెరువుల పరిధిలో పశుగ్రాసం సాగుకు అనువైన ప్రాంతాలను ఈ కమిటీలు గుర్తించనుంది. మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో పశుగ్రాసం సాగును ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టనుంది. పశువులకు తాగునీటి కోసం కొత్త నీటి తొట్టెల నిర్మాణం, ఇప్పటికే ఉన్న తొట్టెల మరమ్మతులను చేయనుంది. వ్యవసాయ కుంటలు, చెక్‌డ్యామ్‌లు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాల ద్వారా నీటి సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వనుంది. గ్రామీణ రహదారులు, కల్వర్టులు, అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ భవనాలు, పశువుల షెడ్ల అభివృద్ధికిచర్యలు చేపట్టనుంది. ప్రతి గ్రామపంచాయతీలో

>>2

102 ఉద్యోగాలకు టిజిపిఎస్సీ నోటిఫికేషన్

>> అవకాశం ఉందని.. ఏడు రోజుల ముందుగానే హాల్టికెట్లను డౌన్లోడ్ కోసం అందుబాటులో ఉంచుతామని ఓ ప్రకటనలో తెలిపింది. ఆఖరి తేదీ వరకు వేచి ఉండకుండా అభ్యర్థులు ముందుగానే దరఖాస్తులు సమర్పించాలని ఈ సందర్భంగా సూచించింది. స్టాటిస్టిక్స్ ప్రధాన సబ్జెక్టుగా డిగ్రీ అభ్యసించిన వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని టీజీపీఎస్సీ తెలిపింది. దరఖాస్తు రుసుము ఓసీ, బీసీ అభ్యర్థులకు రూ.1000 కాగా, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.500గా నిర్ణయించింది. అభ్యర్థుల వయసు 2026 జులై 1 నాటికి 18 నుంచి 44 ఏళ్లు మించరాదని పేర్కొంది. ఆయా వర్గాలకు రిజర్వేషన్ల ఆధారంగా వయోపరిమితిలో సడలింపు. ఉంటుంది. ఉద్యోగాలకు ఎంపికైన వారికి వేతన స్కేలు రూ.36,750 1,06,990గా ఉంటుందని తెలిపింది.

ఎల్‌నినోపై సమన్వయ కమిటీలు

>> అవసరమైన పనులను గుర్తించి వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలను రూపకల్పన చేయనుంది. మండల సమన్వయ కమిటీలు వారానికి కనీసం ఒకసారి సమావేశమై పనుల పురోగతిపై సమీక్షి ంచనుంది. వారంతపు నివేదికలను జిల్లా కలెక్టర్లకు సమర్పించాలని ఆదేశించనుంది. ఆయా కమిటీల ఏర్పాటు, పనుల అమలుపై పర్యవేక్షణ బాధ్యత జిల్లా కలెక్టర్లకు తెలంగాణ ప్రభుత్వం అప్పగించనుంది. పశువులకు అవసరమైన పశుగ్రాసం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలకు ప్రాధాన్యం ఇచ్చింది. గ్రామపంచాయతీలు, గ్రామీణ ఆవాసాల పరిధిలో ఉన్న 35,959 చిన్న నీటిపారుదల చెరువులను గుర్తించి, నీరు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో పశుగ్రాసం సాగుకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేయాలని ఆదేశించింది. మహిళా స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ), గ్రామ సంఘాల ద్వారా పశుగ్రాసం సాగు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటారు. వ్యవసాయ బోర్లు లేదా ఇతర నిర్ధారిత నీటి వనరులు కలిగిన రైతులను గుర్తించి వ్యక్తిగత స్థాయిలోనూ పశుగ్రాసం సాగును ప్రోత్సహిస్తారు. పశువుల మేత కొరతను ముందుగానే అంచనా వేసి, అవసరమైన ప్రాంతాల్లో పశుగ్రాసం అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తారు. పశువులు, మేకలు, గొర్రెలకు తగినంత తాగునీరు అందించేందుకు అవసరమైన ప్రాంతాల్లో కొత్త పశువుల నీటి తొట్టెలను నిర్మించడంతో పాటు ఇప్పటికే ఉన్న తొట్టెలను పరిశీలించి మరమ్మతులు చేపడతారు.

తాగునీటిపై అప్రమత్తం

>> జలమండలి అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలిపారు. వినియోగదారుల నుంచి కేవలం రవాణా రుసుం మాత్రమే వసూలు చేస్తున్నామని, నీళ్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, టీజీఎస్‌పీడీసీఎల్ ఎండీ జితేష్ వి. పాటిల్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి, సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన జన్మదినోత్సవాన్ని నిరాడంబరంగా జరుపుకున్నారు. ఈమేరకు బుధవారం ఉదయం ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఎం ఆయనకు జన్మదిన శుభాకాంక్షలుత తెలిపారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న మంత్రి వాకిటి శ్రీహరి కూడా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

దీపావళిలోగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పరిష్కారం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన సందర్భంలో పాత్రికేయుల ఇళ్ల స్థలాల అంశం చర్చకు వచ్చిందని మంత్రి పొంగులేటి తెలిపారు. రానున్న దీపావళిలోగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారిం చేందుకు ముఖ్యమంత్రి గారు సమ్మతించారని తెలిపారు. దీనివలన దీర్ఘ కాలిక సమస్య తీరుతుందన్నారు.దీనిపై పాత్రికేయుల స్పందిస్తూ మంత్రి పుట్టినరోజున శుభవార్త వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు.

కరవుపైముందస్తుచర్యలు

>>ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. రానున్న నెలల్లో ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, అవసరమైన సన్నద్ధతతో ఉన్నామని పేర్కొన్నారు. రాష్ట్రంతోపాటు దేశ వ్యాప్తంగా ఇతర రాష్ట్రాల్లోనూ వర్షపాతం లోటు ఏర్పడటం ఆందోళన కలిగించే అంశమన్నారు. ప్రత్యామ్నాయ ప్రాంతాల నుంచి నీటి లభ్యత తగ్గిన పరిస్థితుల్లో జలవనరుల నిర్వహణ మరింత కీలకంగా మారిందని వివరించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం సహకారాన్ని కూడా సమర్థవంతంగా వినియోగించుకుంటామని చెప్పారు. ఇప్పటికే కేంద్రానికి నివేదిక పంపించామని, అవసరమైన ఆర్థిక సహాయం పొందేందుకు అవసరమైతే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై వత్తిడి తెస్తామన్నారు. కరువును ఎదుర్కొనేందుకు రాజకీయాలకు అతీతంగా ప్రజల ప్రయోజనాల కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఎదురయ్యే సవాళ్లపై ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించి రాష్ట్రాన్ని కరువు ముప్పు నుంచి కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, నోడల్ అధికారి రామకృష్ణారావుతో పాటు, కాంగ్రెస్ నేత అంజన్ కుమార్ యాదవ్, రైతు కమీషన్ చైర్మన్ కోదండ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు వినోద్ కుమార్, ఎల్. రమణ, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, బిజెపి ప్రతిపక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ కొమురయ్య, ఎంఐఎం అధ్యక్షులు అసదుద్దీన్ ఓవైసీ, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, తెలంగాణ జన సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ కోదండరాం, సమాజ్‌వాది పార్టీ నాయకులు ప్రొఫెసర్ సింహాద్రి, వెంకటేశ్వర్లు, ఆర్జెడి నాయకులు శోభ యాదవ్, బిఎస్పీ రాష్ట్ర నాయకులు శ్రీరామ్ కృష్ణ,ఆమ్‌ఆద్మీ అధ్యక్షులు హేమసుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుమార్గం పట్టిన కాంగ్రెస్ నాయకులు

>> తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లేందుకు వీలుగా హైదరాబాద్ నుంచి ఢిల్లీకి ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ఎంపిలు మల్లు రవి, అనిల్‌యాదవ్ రైల్వే శాఖను ఆరు రోజుల క్రితం కోరారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్‌మేనేజర్ ఆరురోజుల పాటు కాలయాపన చేసి మంగళవారం ఎంపిల విన్నపాలను తిరస్కరించారు. దీనితో బస్సుల్లో వెళ్లడానికి కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసుకొంటున్నది. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో భారీగా జన సమీకరణకు కాంగ్రెస్ నేతల సన్నాహాలు చేస్తుండటంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాలతో దక్షిణమధ్యరైల్వే జనరల్‌మేనేజర్ ఉద్దేశపూర్వకంగానే ప్రత్యేక రైళ్లను నిరాకరించారని కాంగ్రెస్ శ్రేణుల్లో ఆగ్రహం వ్యక్తం అవుతోన్నది. మోదీ, అమిత్ షా సూచనల మేరకే రైళ్లు కేటాయించడం లేదుదక్షిణాది నేతలు ఢిల్లీ ర్యాలీకి వెళ్లకుండా అడ్డుకునే కు ఎన్ని అవాంతరాలు ఎదురైనా ర్యాలీలో పాల్గొంటామనీ కాంగ్రెస్ శ్రేణులు మరింత ఉత్సాహంతో ఢిల్లీలో నిరసన గళం వినిపించడానికి దృఢ సంకల్పంతో వెళ్ళడానికి ఏర్పాటు చేసుకొంటున్నారు.

ఓటర్ల హక్కులు హరించవద్దు

>> 8లను ఎన్నికల సంఘం తన ఇష్టానుసారం మార్చలేదని పేర్కొంది. ఇప్పటికే ఓటర్ జాబితాలో పేర్లు ఉన్న వారు నివాసం మారిన సందర్భంతో కొత్త ఓటర్లుగా మళ్లీ ఫామ్ 6 ఎందుకు సమర్పించాల్సి వస్తోందో వివరించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఎన్యూమరేషన్ ఫారాలు అందని వారు, నివాసం మార్చుకున్న వారు తమ పేర్లను తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చుకునేందుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేసే అవకాశం కల్పించాలని ధర్మాసనం సూచించింది. చిరునామా మార్పు కోసం వినియోగించే ఫామ్8 కూడా ఉపయోగించుకునేలా చూడాలని పేర్కొంది. అక్టోబర్ 30తో ముగియనున్న అభ్యంతరాలు, క్లెయిమ్ గడువును పొడగిస్తామని ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది. ఆగస్టు 31న విడుదలైన ఢిల్లీలో మొత్తం 1.45 కోట్ల మంది ఓటర్లు ఉంటే, ముసాయిదా జాబితాలో 47.57 లక్షల మంది పేర్లను తొలగించారు. వీరిని అందుబాటులో లేని వారిగా, నివాసం మార్చుకున్న వారిగా, మరణించిన వారిగా, ఒకటి లేదా ఎక్కువ సార్లు నమోదైన వారిగా వర్గీకరించారు. మొదట సెప్టెంబర్ 30తో ముగియాల్సిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ గడువును తర్వాత ఈనెల 30 వరకు పొడిగించారు. అక్టోబర్ 26 నాటికి, మ్యాపింగ్ సమస్యలు, ఇతర వ్యత్యాసాలకు సంబంధించి జారీ చేసిన 33.14 లక్షల నోటీసుల్లో 31.26 లక్షల కేసులను ఎన్నికల సంఘం పరిష్కరించింది. ఇదే సమయంలో తార్కిక వ్యత్యాసాలు ఉన్నాయని గుర్తించిన 19.34 లక్షల కేసుల్లో 18.97 లక్షల కేసులపై చర్యలు పూర్తి చేసినట్లు తెలిపింది. ఇదే సమయంలో ఫారం6 కింద 2.67 లక్షల దరఖాస్తులు, ఫారం7 కింద 20,074 అభ్యంతరాలు, ఫారం8 కింద 1.01 లక్షల దరఖాస్తులు అందాయి. తుది ఓటర్ల జాబితాను డిసెంబర్ 4న విడుదల చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఎన్నికలసంఘాన్ని కీలక ప్రశ్నలు అడిగింది. బూత్ లెవల్ అధికారులు ఎన్యూమరేషన్ ఫారాలు అందించే సమయంలో ఇంట్లో లేని ఓటర్ల పరిస్థితిపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. నిర్ణీత గడువులో ఫామ్ సమర్పించకపోయినంత మాత్రాన ఒక వ్యక్తిని ఓటర్ల జాబితాలో తిరిగి పేరు నమోదు చేసుకునే హక్కును నిరాకరించవచ్చా అని ప్రశ్నించింది. గడువులోగా ఎన్యూమరేషన్ ఫారం తిరిగి ఇవ్వపోయిన ఓటర్లకు ఎన్నికల జాబితాలో మళ్లీ చేరే అవకాశం నిరాకరించడం సమంజసం కాదని సుప్రీం వ్యాఖ్యానించింది.

వారం - వర్జ్యం

29-10-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆశ్వీయుజ మాసం, దక్షిణాయణం,
శరదృతువు, కృష్ణపక్షం, స్వాతి కార్తె
తి.చవితి రా.10.12
న. రోహిణి ఉ.11.12
వ.సా.4.18-సా.5.46
దు.1.ఉ.9.55-ఉ.10.41
దు.2.మ.2.33-మ.3.19
రాహు. మ.1.30-మ.3.00 శుభ లేదు

వార్తాఫలం

మేషం : కళలు, రాజకీయ, పారిశ్రామిక రంగాలలో వారికి సన్మాన యోగం. చర్చా గోష్ఠులలో చురుకుగా పాల్గొంటారు.

వృషభం : సోదరుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. వాహనాల విషయంలో మెలుకువ చాలా అవసరం.

మిథునం : సహచరుల యొక్క అనుచరుల గణముల యొక్క కార్యకలాపములను గమనించుటలో జాగ్రత్త వహించండి.

కర్కాటకం : దీర్ఘాలోచనలు చేయక పరిష్కారంలేని సమస్యలను కాలానికి వదిలివేయండి. ఖర్చులు పెరుగుతాయి.

సింహం : ఆర్థిక విషయ వ్యవహారాలకు సంబంధించిన పత్రాల సంతకాల విషయాలలో చాలా జాగ్రత్తలు అవసరం.

కన్య : వ్యాపార విషయములలో, భాగస్వాముల నీతినిజాయితి మీద అతినమ్మకం, నిర్లక్ష్యం వద్దు. శ్రమ పెరుగుతుంది.

తుల : సంకుచిత మనస్తత్వం కలిగిన వ్యక్తులతో ఇబ్బందులు, చికాకులు తెప్పిస్తాయి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరము.

వృశ్చికం : వృత్తిలో మీ పై అధికారుల వత్తిడి అధికమవుతుంది. ఆత్మీయులతో కలసి పుణ్య క్షేత్రాలను సందర్శిస్తారు.

ధనుస్సు : మీకు అనుకూలంగా వ్రాయబడిన దస్తావేజుల్లో ముఖ్యమైన పత్రాలలో కొన్ని లోపాలను గమనిస్తారు.

మకరం : మన పని మనం చేసుకుపోతే ఏనాటికైనా ఫలితం అందుతుందని అనుకుంటారు. ఆ విధంగా ప్రవర్తిస్తారు.

కుంభం : ఒకరికి అప్పు ఇవ్వడం, అప్పు తీసుకోవడం రెండూ చేయకండి. సొంత ఆలోచనలు మేలు చేస్తాయి.

మీనం : ఎంత సహాయం చేసినా తృప్తి చెందని వర్గాన్ని చూసి అసహనానికి లోనవుతారు. ఉద్యోగులకు ఆర్థిక లాభం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



కూకటివేళ్లతో కూలిన చెట్టు



కోస్తాలో రోడ్డుపై పడిన విద్యుత్ స్తంభాలను తొలగిస్తున్న దృశ్యం



ఈస్ట్‌గోదావరిలో నేలకొరిగిన అరటిపంట

అపార నష్టం

>>వర్షాలు కొనసాగనున్నాయని వాతావరణ అధికారులు తెలిపారు. తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు, వర్షాలు కొనసాగుతున్నాయి. ఇవాళ కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

తీవ్ర తుపాను దృష్ట్యా ఇవాళ భారీ, అతి భారీ, అత్యంత భారీ వర్షాలు కురస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. విశాఖ, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, గుంటూరు, పల్నాడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇవాళ అల్లూరి, అనకాపల్లి, విశాఖ, శ్రీకాకుళం, కోనసీమ, కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాలకు ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది. అర్నబ్ తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం వర్షం దంచి కొట్టింది. గోదావరి జిల్లాలు భారీ వర్షాలకు చిగురుటాకులా వణికాయి. భారీ ఈదురుగాలుల ధాటికి పలు చోట్లు చెట్లు, విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. ఇళ్లలోకి నీరు చేరి జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాకినాడలోని జగన్నాథపురం, గోలీలపేట, ఇందిరా నగర్, ముత్తా నగర్ ప్రాంతాలు నీట మునిగాయి. చాలా ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో స్థానికులు ఇళ్లకు తాళాలు వేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. జగన్నాథపురం రాజీవ్ గృహకల్ప ఆపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్ నీట మునిగింది. దీంతో నివాసితులు రెండో అంతస్థులోకి వెళ్లారు. సముద్రం శాంతించాలని కోరుతూ స్థానికులు గ్రామ దేవత మహాలక్ష్మీ అమ్మవారికి పూజలు చేశారు. ఈదురుగాలుల ధాటికి కోనసీమ జిల్లా అయినవిల్లి మండలంలో చింతనలంకలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలోని ధ్వజస్తంభం నేలకొరిగింది. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం, పాలకొల్లు, అచంట నియోజకవర్గాల్లో భారీ ఈదురుగాలులు వీస్తున్నాయి. పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నంలో తుపాను ప్రభావం

కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నంలో తుపాను ప్రభావం తీవ్రంగా ఉంది. కలెక్టరేట్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాల ప్రభావంతో రోడ్లపైకి నీరు చేరి పలు ప్రాంతాలు జలమయంగా మారాయి. నగరంలోని ఎస్పీ కార్యాలయం పరిసరాలు, ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్, కలెక్టర్ బంగ్లా సమీప ప్రాంతాలు, లక్ష్మీ టాకీస్ సెంటర్‌తో పాటు పలు ప్రధాన రహదారులపై భారీ వృక్షాలు కూలిపడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. కొన్ని చోట్ల రహదారులపై చెట్లు అడ్డంగా పడటంతో ప్రజలు ప్రయాణించేందుకు ఇబ్బందులు పడ్డారు. ప్రచార హోర్డింగులు, తోపుడు బళ్లు గాలి వేగానికి కొట్టుకుపోయాయి. బలమైన ఈదురుగాలులు, వర్షంతో జనజీవనం స్తంభించిపోయింది. ఒక్కసారిగా మారిన వాతావరణ పరిస్థితులు నగర ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. రోడ్లపై పడిపోయిన చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అర్నబ్ తుపాను చల్లపల్లిలో బీభత్సం సృష్టించింది. రాత్రి నుంచి ఇప్పటివరకు ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. హోరుగాలి కారణంగా చల్లపల్లి విజయవాడ రోడ్డులో వక్కలగడ్డ సమీపంలో చెట్లు విరిగి ప్రధాన రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ డీ.ఆర్.కే.ప్రసాద్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ వాలంటీర్లు, సుందర చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ తరిగోపుల పద్మావతి ఆధ్వర్యంలో స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు, స్థానికులు రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేశారు.

గోదావరి జిల్లాల్లో తుపాను బీభత్సం సృష్టించింది. నర్సాపురం వద్ద తీరం దాటే సమయంలో పెనుగాలులు వీయడంతో అనేక ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఆచంట, పెనుగొండ మండలాల్లో పలు ఇళ్లపై చెట్లు కూలాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కోనసీమ, కాకినాడ, అల్లూరి జిల్లాల్లోనూ పలు రహదారులు జలమయమయ్యాయి.

కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట నీట మునగడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. భూపతిపాలెం, వట్టిగెడ్డ వంటి జలాశయాలు నిండుకుండలా మారాయి.

కృష్ణా, గుంటూరు జిల్లాలను భారీ వర్షాలు

కృష్ణా, గుంటూరు జిల్లాలను భారీ వర్షాలు ముంచెత్తాయి. గుంటూరు నగరంలోని గుజ్జనగుండ్ల కొరిటపాడు రహదారి మోకాళ్ల లోతు నీటిలో మునిగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలోని బీఆర్ స్టేడియం చెరువును తలపించగా, ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం, పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్ నీటిలో చిక్కుకున్నాయి. బాపట్లలో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వేమూరు నియోజకవర్గంలో పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. కృష్ణా జిల్లాలోని మచిలీపట్నంతో సహా పలు లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నాగాయలంక వద్ద కృష్ణా నదిలో అలల ఉధృతి పెరిగింది.

తుపాను పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉత్తరాంధ్రలో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైన నేపథ్యంలో అధికార యంత్రాంగం మొత్తం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరిస్థితి చక్కబడే వరకు సహాయక చర్యలను కొనసాగించాలని స్పష్టం చేశారు. విరిగిన చెట్లను తొలగించడం, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం వంటి పనులను అధికారులు ముమ్మరం చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఈదురుగాలులకు గుడిసె కూలి వృద్ధురాలు మృతి

కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదికర ప్రకాష్‌పురంలో వృద్ధురాలు మృతి చెందారు. ఈదురుగాలుల వర్షానికి గుడిసె కూలి కొల్లు వెంకాయమ్మ అనే వృద్ధురాలు మృతి చెందారు. విజయనగరంలో పెద్దచెరువుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. భారీ వరద నీటితో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెద్దచెరువు దిగువ కాలనీల్లోకి వర్షపు నీరు భారీగా చేరింది. వినాయకనగర్, నాయుడు కాలనీల్లో వర్షపు నీటి ప్రవాహం అధికంగా ఉంది.



కర్ణాటకలో 4 ఎమ్మెల్సీలు గెలుచుకున్న అనంతరం బుధవారం హుబ్బళ్లిలో బిజెపి నాయకుల ఆనందోత్సాహాలు

ఉద్యోగులకు 3% డిఏ పెంపు

>> పెన్షనర్లకు అందే మొత్తం పెరగనుంది.2026 జులై1 నుంచే ఈ పెంపు వర్తించనుంది. ఇందుకోసం రూ.10,016 కోట్లు కేటాయించాలన్న ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన నిర్వహించిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కేబినెట్ నిర్ణయాలను సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో వెల్లడించారు. రూ.29,267 కోట్లతో నాలుగు ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు వివరించారు. రూ.10 వేల కోట్లతో 'కంటైనర్ తయారీ ప్రోత్సాహక్ష పథకం, రూ.7,395 కోట్లతో 'ప్రధానమంత్రి వికసిత్ గ్రామ్ స్వరాజ్ యోజన్న, రూ.1,856 కోట్లతో 'ఖేలో ఇండియా స్పోర్ట్స్ గూడ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్ ఉన్నాయి. గ్లోబల్ సప్లయ్ చైన్‌లో భారతదేశాన్ని కీలక శక్తిగా మార్చేందుకు కంటైనర్ తయారీ పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న కంటైనర్ల తయారీలో 95 శాతం భాగస్వామ్యం కేవలం ఒకే ఒక్క దేశం చేతిలోనే ఉందని, ఈ రంగంలో భారత్ బలమైన ప్రత్యామ్నాయంగా ఎదగాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని తీసుకొచ్చామని మంత్రి అశ్వినీవైష్ణవ్ తెలిపారు. కంటైనర్ స్కీమ్‌కు 13యేళ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చు చేయాలి కేబినెట్ నిర్ణయించిందని వెల్లడిచారు. ఇది 13 యేళ్ల సుదీర్ఘ కాలపరిమితి కలిగిన దీర్ఘకాలిక పథకమని, స్థిరమైన ప్రణాళికతో భారత్‌ను గ్లోబల్ కంటైనర్ హాబ్‌గా మారుస్తామని పేర్కొన్నారు.

దేశంలో తయారీ రంగాన్ని రంగాలవారీగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంలో భాగంగా క్రీడా వస్తువుల తయారీ పథకానికి కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆయా రంగాల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయాలన్నదే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశమని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. 'ఖేలో ఇండియా స్కీమ్లకు 8యేళ్లలో రూ.1856 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించింది.

గ్రామీణ ప్రాంతాల్లో సామర్థ్య పెంపుదల, స్థానిక ప్రాధాన్యతలు, వనరుల ఆధారంగా అభివృద్ధిని ప్రోత్సహించేందుకు గాను రూ.7,395 కోట్ల బడ్జెట్ కేటాయింపుతో 'పిఎం వికసిత్ గ్రామ్ స్వరాజ్ యోజన్నకు ఆమోదం తెలిపారు. ఇది గ్రామీణ భారతాన్ని బలోపేతం చేయడంలో మైలురాయిగా నిలవనుంది. "ఇకపై గ్రామ పంచాయితీలే తమ గ్రామాల్లో ఉన్న వనరులను, అక్కడి సమస్యలను, లోపాలను స్వయంగా గుర్తించి, అక్కడి అవసరాలకు అనుగుణంగా సొంతంగా అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసుకునేలా ఈ పథకం వీలు కల్పిస్తుంది. వీటితోపాటు గ్రామ పంచాయితీలు తమ సొంత వనరుల ద్వారా ఆదాయాన్ని ఎలా పెంచుకోవాలో మార్గనిర్దేశం చేస్తారు. దీని వల్ల గ్రామపంచాయితీలు స్వయంసమృద్ధిని సాధించడానికి వీలవుతుంది" అని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

నేడు సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి పయనం

ఇన్వెస్ట్ గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ప్రసంగం

హైదరాబాద్,అక్టోబరు28,ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగిస్తారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించి ఈ నెల 29న ఢిల్లీలో నిర్వహించే కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై ఒక రోజు ముందు రాత్రి సిఎం ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షి ంచారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ఔత్సాహిక పారిశ్రామిక పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలతో సమావేశాలు, రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్ ఈవెంట్లపై ఈ సందర్భంగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణతో తెలంగాణ ప్రతిష్ఠ ప్రపంచస్థాయిలో మరింతగా పెరిగే అవకాశం ఉంటుందని, నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. నవంబర్ మొదటి వారంలోగా ప్రణాళికలను ఖరారు చేసుకుని పలు దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చే సీఈఓలు, ప్రతినిధులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

విఆర్ఎస్‌కు సిద్ధమైన జయేశ్

రంజన్‌పై బదలీ వేటు

>> అధికారి నవీన్ మిట్టల్‌ను తప్పించింది. సీనియర్ ఐఏఎస్ అధికారి సభ్యసాచి ఘోష్ నుంచి ట్రైబల్ వెల్ఫేర్ శాఖ తొలగించింది. ఈ క్రమంలో తెలంగాణలో 12 మంది ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. పలువురు అధికారులకు కీలక బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది, అంతేకాకుండా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారుల బాధ్యతల్లో మార్పులు చేసింది. ఈ మేరకు దీనికి సంబంధించి ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దానకిశోర్‌ను తప్పించింది.

ఆ స్థానంలో నవీన్ మిట్టల్‌కు బాధ్యతలను అప్పగించారు. ఇక గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా మాత్రం దానకిశోర్ కొనసాగుతారని స్పష్టం చేశారు. ఆయన రిటైర్‌మెంట్ తేదీ ఈ నెల 31 వరకు ఆ బాధ్యతల్లో కొనసాగుతారని తెలిపారు. రవాణా, రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న వికాస్ రాజ్‌ను విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఆయన స్థానంలో ఇలంబర్తికి రవాణా, రహదారులు, భవనాల శాఖ కార్యదర్శిగా నియమించారు. అలాగే ఏహెచ్, డీడీ అండ్ ఎఫ్ శాఖ కార్యదర్శి బాధ్యతలు కొనసాగనున్నాయి. హెచ్ఎండీఏ పరిధిలోని మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న జయేష్ రంజన్‌ను ఈఎఫ్ఎస్ అండ్ టీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేశారు. ఇఫ్‌టీఆర్ఐ డైరెక్టర్ జనరల్ బాధ్యతలను కూడా అదనంగా అప్పగించారు. హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా ఉన్న సర్ఫరాజ్ అహ్మద్‌కు హెచ్ఎండీఏ పరిధిలోని మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగంతో పాటు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. శైలజా రామయ్యర్‌ను రెవెన్యూ శాఖ (ఎండోమెంట్స్) ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమించారు. జయేష్ రంజన్ నిర్వహిస్తున్న స్పోర్ట్స్, హెరిటేజ్ తెలంగాణ డైరెక్టర్ బాధ్యతలను ఎ. వాణీ ప్రసాద్‌కు అదనంగా అప్పగించారు. రెవెన్యూ (డీఎం) శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బాధ్యతలను అదనంగా అప్పగించారు. ఆయన బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా కూడా కొనసాగనున్నారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి బాధ్యతలను అదనంగా నిర్వహిస్తున్న జితేష్ వి. పాటిల్‌కు టీజీఆర్ఈడీసీఓ ఎండి బాధ్యతలను కూడా అదనంగా అప్పగించారు. రాష్ట్ర సంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ ఎండి ముషారఫ్ అలీ ఫారూఖీని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. అదే సమయంలో ఎండి బాధ్యతలను కూడా అదనంగా కొనసాగించనున్నారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ స్థానంలో ముషారఫ్ అలీ ఫారూఖీ బాధ్యతలు స్వీకరించనున్నారు. మహిళా, శిశు సంక్షేమం, ఎస్సీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా శృతి ఓజాను నియమించారు. ఆ శాఖ డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణను శృతి ఓజా స్థానంలో ప్రత్యేక కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ సంగీత సత్యనారాయణకు మహిళా, శిశు సంక్షేమం, ఎస్సీ సంక్షేమ శాఖ డైరెక్టర్ బాధ్యతలు అప్పగించారు.

కాంగ్రెస్ బలం ఏమిటో తెలిసింది..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీకి జీరో

బ్యాలట్‌తోనే జరిగాయి కదా! : ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, అక్టోబరు 28: నాలుగు రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ఫలితాలు సంచలనంగా మారాయి. కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానాన్ని కూడా గెలువలేకపోయింది. బీహార్, మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. చివరకు కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ, నాలుగు ఎమ్మెల్సీ స్థానాలను బీజేపీజేడీయూ కూటమి కైవసం చేసుకుంది. మిగతా రాష్ట్రాల్లో కూడా కాంగ్రెస్‌కు ఒక్క స్థానం దక్కలేదు. దీనిపై ప్రధాని నరేంద్రమోడీ కాంగ్రెస్‌ను ఉద్దేశిస్తూ సోషల్ మీడియాలో సెటైరికల్ పోస్ట్ చేశారు. కాంగ్రెస్ ఫలితాలను ప్రస్తావిస్తూ, "కాంగ్రెస్ ఎన్ని సీట్లు గెలిచిందో ఊహించండి?" అనే ప్రశ్నతో పాటు ఎమోజీని జోడించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇదే సమయంలో ఈ ఎన్నికలు బ్యాలెట్ పేపర్ల ద్వారా జరిగిన విషయాన్ని ప్రధాని ఎత్తిచూపారు. నాలుగు రాష్ట్రాల్లోని 28 స్థానాలకు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ 12 స్థానాల్లో పోటీ చేసింది. ఒక్క స్థానాన్ని కూడా గెలవలేకపోయింది. గతంలో ఆ పార్టీకి 4 ఎమ్మెల్సీ స్థానాలు ఉండేవి. ఓడిపోయిన సందర్భంలో కాంగ్రెస్ ఈవీఎంలపై నిందలు వేసేది. ఈ నేపథ్యంలోనే మోడీ బ్యాలెట్ పేపర్ ద్వారా ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయని, అయినా కూడా కాంగ్రెస్ గెలవలేదని తన పోస్ట్ ద్వారా చెప్పారు. ఈ ఎన్నికలలో ఉత్తర ప్రదేశ్‌లో 11, బీహార్‌లో 8, మహారాష్ట్ర లో 5, కర్ణాటకలో 4 శాసన మండలి స్థానాలకు పోటీ జరిగింది.



న్యూఢిల్లీకి ప్రత్యేక రైలు కోసం కాంగ్రెస్ ధర్నా

పాల్గొన్న మంత్రి పొన్నం, పిసిసి చీఫ్ మహేశ్‌గౌడ్, వేం నరేందర్‌రెడ్డి ప్రభృతులు

పలువురు నేతల అరెస్టు, విడుదల

హైదరాబాద్ (అడ్డగుట్ట), అక్టోబరు 28, ప్రభాతవార్త: ఎస్.ఐ.ఆర్.కు, కేంద్ర ఎన్నికల సంఘం విధానాలకు ఏఐసీసీ పిలుపు మేరకు వచ్చే నెల 1వ తేదీన న్యూ ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి న్యూ ఢిల్లీకి వెళ్లేందుకు ప్రత్యేక రైల్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన అభ్యర్థుల మేరకు దక్షిణ మధ్య రైల్వే తిరస్కరించడంతో బుధవారం సికింద్రాబాద్ రైల్ నిలయం వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు వేమ్ నరేందర్ రెడ్డి, కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, రాస్యసభ సభ్యుడు అనీల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు దీపక్ జాన్, మోతె రోహిత్, సికింద్రాబాద్ అసెంబ్లీ ఇన్‌ఛార్జి ఆదం సంతోష్‌కుమార్, సనత్ నగర్ ఇన్‌ఛార్జి కోట నీలిమతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రైల్ నిలయం వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి తరలివచ్చి సంఘీ భావం తెలిపారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకరక్, ఎమ్మెల్యే శ్రీగణేష్ లు మాట్లా డుతూ ప్రజా స్వామ్య పద్ధతిలో నిరసన తెలియజేయడం ప్రతి ఒక్కరికి రాజ్యాంగం కల్పిం చిన హక్కు అన్నారు. అటువంటి కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు వెళ్లేందుకు అవసరమైన రైళ్లను ఏర్పాటు చేయాల్సింది పోయి నిరాకరిం చడం సరైంది కాదన్నారు. ఢిల్లీలో ప్రజల గొంతుకను వినిపించేందుకు, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు ముందుం టుందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండ గట్టేందుకు కాంగ్రెస్ పార్టీ నిర్వహించే నిరసన కార్యక్రమాలను శాంతి యుతంగా నిర్వహిస్తున్నామన్నారు.

కాంగ్రెస్ నేతల తాకిడితో దద్దరిల్లిన రైల్‌నిలయం

న్యూ ఢిల్లీలో చేపట్టనున్న కాంగ్రెస్ పార్టీ చేపట్ట నున్న ధర్నా కార్యక్రమానికి ప్రత్యేక రైల్‌ను ఏర్పాటు చేసేందుకు రైల్వే జిఎం నిరాకరించినందుకు బుధవారం కాంగ్రెస్ రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో రైల్ నిలయం వద్దకు తరలి వచ్చారు. వారిని అడ్డుకునేందుకు రైల్వే ఆర్.పి.ఎఫ్, జి.ఆర్.పి, పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులను లెక్క చేయకుండా రైల్ నిలయం ప్రధాన గేట్, రైల్వే జిఎం ర్పధాన ద్వారం వద్ద పోలీసులు అడ్డుకున్నప్పటికి వారికి లెక్క చేయకుండా రైల్ నిలయం లోపలికి ప్రవేశించి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో తోపులాటలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. రైల్ నిలయం ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన పూల తొట్లు ధ్వంశం అయ్యావి. ఆందోళన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్, ఎంపీ అనీల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు శ్రీగణేష్, నవీన్ యాదవ్‌లను అడ్డుకొని పోలీస్ వ్యాన్‌లో బలవంతంగా ఎక్కిస్తుండగా కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులు వారిని చెదరగొట్టి మార్కెట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. దక్షిణ మధ్య రైల్వే ఆర్.పిఎఫ్. పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అందోళనకారులపై కేసు నమోదు చేసినట్లు తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ బషీర్ అహ్మద్ తెలిపారు.



సికిందరాబాద్ రైల్ నిలయంలో ధర్నా చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు శ్రీగణేష్, నవీన్ యాదవ్ తదితరులు

గీతం వర్సిటీలో గంజాయి సేవించి పట్టుబడిన ఇద్దరు విద్యార్థులు

వర్సిటీ అధికారులతో ఈగల్ బృందం భేటీ

హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త: దేశంలో పేరెన్నిక కలిగిన గీతం యూనివర్సిటీలో ఇద్దరు విద్యార్థులు గంజాయి సేవించిన పరిస్థితుల్లో ఈగల్ పోలీసులకు దొరికిపోయారు. ఈ నేపథ్యంలో గీతం వర్సిటీలో అనుమానిత విద్యార్థులను విచారించేందుకు ఈగల్ బృందం వెళ్లగా వారంతా అజ్ఞాతంలో వెళ్లిపోయారు. మరికొందరు వర్సిటీ నుంచి చెప్పా పెట్టకుండా ఖాళీ చేసేశారు. ఈ నేపథ్యంలో ఈగల్ అధికారులు గీతం యూనివర్సిటీ యాంటీ డ్రగ్స్ కమిటీ నిర్వాహకులతో భేటీ అయి విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై సూచనలు చేశారు. రాష్ట్రంలోని వర్సిటీల్లో డ్రగ్స్‌ను పూర్తిగా రూపుమాపేందుకు ఈగల్ బృందం చేస్తున్న ప్రయత్నం కొనసాగుతూనే వుంది. ఈగల్ పోలీసులకు పట్టుబడ్డ డ్రగ్స్ స్మగ్లర్లను విచారిస్తున్న క్రమంలో వారి కస్టమర్ల జాబితాలో గీతం యూనివర్సిటీ విద్యార్థులు కూడా వున్నట్లు తేలింది. దీంతో ఈగల్ పోలీసులు గీతం యూనివర్సిటీలో చదువుతున్న 22 ఏళ్ల ఇంజినీరింగ్ విద్యార్థిని అదుపులోకి తీసుకుని విచారించి డ్రగ్స్ పరీక్ష చేయగా గంజాయి పాజిటివ్‌గా వచ్చింది. దీంతో ఈగల్ పోలీసులు వెంటనే పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి సదరు విద్యార్థిని పునరావాస కేంద్రానికి తరలించి అతడి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈగల్ పోలీసుల పరీక్షలకు భయపడి గీతం వర్సిటీ నుంచి పలువురు కనిపించకుండా పోగా కొందరు ఖాళీ చేశారు. ఈ నేపథ్యంలో ఈగల్ అధికారులు గీతం వర్సిటీ యాంటి డ్రగ్స్ కమిటీ నిర్వాహకులతో భేటీ అయ్యారు.



సిఐడిలో డిజిటల్ సేవలు ప్రారంభిస్తున్న డిజిపి ఆనంద్. చిత్రంలో శాంతి భద్రతల డిజి మహేష్‌భగవత్, సిఐడి డిజి చారుసిన్హా తదితరులు

పోలీసు శాఖలో మరో సాంకేతిక విప్లవం

సిఐడిలో ఏడు డిజిటల్ సేవలు ప్రారంభించిన డిజిపి ఆనంద్

హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త: రాష్ట్ర పోలీసు శాఖలో మరో సాంకేతిక విప్లవం ఆవిష్కృత మయ్యింది. పౌరులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకుగానూ సిఐడి విభాగంలో ఏక కాలంలో ఏడు డిజిటల్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. వీటిని డిజిపి సి.వి ఆనంద్ బుధవారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సేవలను మరింత పారదర్శకంగా, వేగంగా, సమర్థంగా అందించేందుకు వీటిని ప్రారంభించినట్లు తెలిపారు. పౌరుల అభిప్రాయాల సేకరణకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్ వుండగా దీని ద్వారా ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు తెలుసుకునేందుకు అవకాశం వుంటుందని ఆయన వెల్లడించారు. ప్రజల నుంచి అందే పిటిషన్లు, నేర గాళ్లపైన మోదయ్యే ఎఫ్ఐఆర్‌లు, వాహనాలపై వుండే ఈ చలాన్లు, పాస్‌పోర్టు వెరిఫికేషన్ సేవలపై ప్రజల స్పందనను సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్ పరి శీలిస్తుందని డిజిపి తెలిపారు. కొత్తగా భరోసా కేంద్రాలకు డిజిటల్ సేవలు అందుబాటులోకి తెచ్చామని, మహిళా భద్రతా విభాగం రూపొందిం చిన భరోసా సాఫ్ట్‌వేర్ ద్వారా రాష్ట్రంలోని 35 భరోసా కేంద్రాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చామని ఆయన తెలిపారు. దీనివల్ల బాధి తులకు అందించే కౌన్సె లింగ్, వైద్య, న్యాయ, పునరావాస సేవల వివ రాలను నమోదు చేసి, కేసు ప్రారంభం నుంచి ముగింపు వరకు పర్య వేక్షి ంచేందుకు వీ లుంటుందని ఆయన తెలిపారు. కాగితపు రిజిస్టర్లకు బదులుగా రాష్ట్రస్థాయి డ్యాష్ బోర్డులు, 23 రకాల నివేదికలు అందు బాటులో ఉంటాయని డిజిపి తెలిపారు. దీంతో పాటు సిఐడికి అధునాతనంగా మరో వెబ్‌సైట్‌ను డిజిపి ప్రారంభించారు. ఖైదీల విడుదల వివరాలను సంబంధిత పోలీస్‌స్టేషన్లు, అధికారు లకు ఎస్ఎంఎస్ ద్వారా తెలియ జేయడంతో పాటు రాష్ట్రస్థాయి డ్యాష్‌బోర్డులు, కృత్రిమ మేధ ఆధారిత విశ్లేషణ, ఖైదీల వివ రాల సేకరణకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుంది. కార్యక్రమంలో శాంతి భద్రతల డిజి మహేష్ భగవత్, సిఐడి డిజి చారు సిన్హా, అదనపు డిజి అకున్ సబర్వాల్ పిఅండ్‌ఎల్ ఐజి గజారావు భూపాల్, డిఐజిలు నారాయణ నాయక్, పరిమళ హన్నా నూతన్, ఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

31న గాంధీభవన్‌లో సేవాదల్ రక్తదాన శిబిరం

హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త: ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, అక్టోబరు 31 ఇందిరా గాంధీ బలిదానం దినోత్సం పురస్కరించుకొని రక్తదాన శిబిరం బుధవారం గాంధీభవన్‌లో పిసిసి సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ నిర్వహించారు.

ఇందిర వర్ధంతిని పురస్కరించుకొని 'ఓట్ బచావో - దేశ్ బచావో' కార్యక్రమానికి విజయవంతం చేడానికి ఎఐసిసి తెలంగాణ పరిశీలకులు మోహన్ కుమార్ మంగళం ప్రారంభించారు.

తెలంగాణ ప్రభుత్వం

రెవెన్యూ శాఖ

జిల్లా కలెక్టర్ కార్యాలయము, ఆదిలాబాద్

(ఫారం-సి)

(ప్రాథమిక నోటిఫికేషన్)

(చట్టములోని సెక్షన్ 11 అనుసరించి 10-ఎ రూల్ మినహాయింపు ఇవ్వబడినది

(రూల్ 6/12 చూడుము)

కలెక్టర్ ఫైల్ నెం. జి1/2521/2017 తేది: 17.10.2026

ఆర్డీఓ ఫైల్ నెం. బి/1956/2026 తేది: 15.10.2026

గెజిట్ నంబర్. తేది: .10.2026

తెలంగాణ ప్రభుత్వము/జిల్లా కలెక్టరు ఆదిలాబాద్ గారి ఆదేశానుసారం ఆదిలాబాద్ జిల్లా/భోరజ్ మండలములోని గిమ్మ-(కె)/ఆకోలి & రాంపూర్-(టి) గ్రామములోని మొత్తము విస్తీర్ణము ఎ.2.10 గుంటలు భూమి ప్రజా ప్రయోజనార్థం ఇంటర్ స్టేట్ లోయర్ పెన్ గంగా ప్రాజెక్టు పిప్పల్ కోటి బ్యాలెన్సింగ్-లింక్ కాలువలు నిర్మాణము నిమిత్తం సదరు భూసేకరణ ప్రకటన జారీ చేయనైనది. ఇట్టి ప్రాజెక్ట్ ప్రభుత్వ ఉత్తర్వులు నెం. 58 ఐ అండ్ సి ఎ డి (ఎల్ ఏ ఆర్ & ఆర్ ఏ/2) ఇట్టి ప్రాజెక్ట్ ప్రభుత్వం ఉత్తర్వుల శాఖ తేది: 25.07.2017ననుసరించి భూసేకరణ పునరావాస పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 చాప్టర్-II మరియు-III పరిధి నుండి మినహాయింపు ఇవ్వబడినది.

కావున పైన తెలిపిన ప్రాజెక్ట్ నిర్మాణమునకు ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలములోని గిమ్మ-(కె)/ఆకోలి & రాంపూర్-(టి) గ్రామములోని మొత్తము విస్తీర్ణము ఎ.2.10 గుంటలు నిర్దిష్ట కొలతలు, దిగువ వివరాలతో యున్న భూములు, భూసేకరణ చేయుటకు ప్రతిపాదించనైనది.

షెడ్యూలు

గ్రామములు : గిమ్మ-(కె)/ఆకోలి/రాంపూర్-(టి) మండలం : భోరజ్ జిల్లా : ఆదిలాబాద్

క్రమ సంఖ్య	సర్వే నెం.	బీట్ నెం	సర్వే నెం.	పట్టా/మెట్ట/తరి	ఎంజాయ్‌మెంట్ విస్తీర్ణం	పట్టేదార్ పేరు	భూస్వదారు/హక్కుదారు	చెట్లు/బోర్ వెల్/ఇతరములు
1	2	3	4	5	6	7	8	9
1 గిమ్మ-కె-గ్రామము-భోరజ్ మండలము								
1	45/2	45/4	0.10	పట్టా మెట్ట	0.03	ఎల్లుల ఆశమ్మ భర్త రాములు	స్వంతం	లేవు
2		45/5		పట్టా మెట్ట	0.04	గోటి ముక్కుల కాంతా బాయి భర్త రాజారం	"	"
3		45/31/1		పట్టా మెట్ట	0.03	మల్లెల దత్తు తండ్రి సంబెన్న	"	"
4	46/2	46/1	0.24	పట్టా మెట్ట	0.06	చిత్తరి దేవు బాయి భర్త రాజలింగు	"	"
5		46/2		పట్టా మెట్ట	0.06	చితురి రామ్ బాయి భర్త మల్లన్న	"	"
6		46/3		పట్టా మెట్ట	0.06	పరిపెల్లి భాగర్త భర్త ఊశన్న	"	"
7		46/4		పట్టా మెట్ట	0.06	పరిపెల్లి లక్ష్మి భర్త సాంబన్న	"	"
8	47/1/2	47/1	0.18	పట్టా మెట్ట	0.18	గోపిడి చంద్రకాంత్‌రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి	"	"
9	47/1/4	47/1	0.05	పట్టా మెట్ట	0.05	నిమ్మల రమేష్ రెడ్డి తండ్రి లచ్చిరామ్	"	"
మొత్తం			1.17		1.17			
2. ఆకోలి-గ్రామము-భోరజ్ మండలము								
10	31/2	31/	0.03	పట్టా మెట్ట	0.03	బాలురి రేణుక భర్త తిరుపతి రెడ్డి	స్వంతం	లేవు
3. రాంపూర్-గ్రామము-భోరజ్ మండలము								
11	11/3	11/3	0.30	లావుని పట్టా	0.30	కోడిమెలా రుకుమ్ బాయి భర్త గంగన్న	స్వంతం	లేవు
మొత్తం విస్తీర్ణం			2.10		2.10			

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరావాస, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 సెక్షన్ 11(1) అనుసరించి సంబంధిత వ్యక్తులందరికి తెలియజేయు నిమిత్తం జారీ చేయనైనది.

ఇంటర్ స్టేట్ లోయర్ పెంగస్ గాంగ ప్రాజెక్టు నిర్మాణమునకు అధ్యాయము-II మరియు III సామాజిక ప్రభావము ఈ నిబంధనలు ప్రతిపాదనకు వర్తింపబడవు.

భూమి యొక్క ప్లాన్, ఏదైన పని దినము మరియు పని వేళలలో జిల్లా కలెక్టరు (భూసేకరణ), రాజస్వమండల అధికారి గారి కార్యాలయములో తనిఖీ చేసుకోవచ్చును. తదుపరి తెలంగాణ ప్రభుత్వం/కలెక్టర్ మరియు సంబంధిత ప్రభుత్వం ఎంత భూమిని స్వాధీనము చేసుకోవాలో నిర్ణయించుకొనే క్రమములో సెక్షన్ 12 ప్రకారం అధికారులు, ఉద్యోగులు వారి వద్ద పని చేసే కార్మికులకు పైన చూపిన భూములలో గల ఏదైన ప్రదేశంలోని ప్రవేశించి, సర్వే జరిపి భూకమతాన్ని కొలిచే అధికారం, భూమిని త్రవ్వటానికి లేదా భూస్వరూపం తెలుపు బోర్ వెయ్యటానికి మరియు అవసరమైన ఇతర చర్యలు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం ప్రత్యేక కలెక్టర్ అనుమతి లేకుండా ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుండి ఆ నోటిఫికేషన్‌లో ఉదహరింపబడిన భూములకు సంబంధించిన ఎవరూ ఎటువంటి లావాదేవీలు/తాకట్లు మొదలగు చర్యలు చేపట్టరాదు.

సెక్షన్ (15) ప్రకారం, ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ తరువాత పైన చూపిన భూములలో ఎలాంటి సంబంధమున్న వ్యక్తులైన భూసేకరణపై అభ్యంతరములున్నచో అట్టి వ్యక్తులు, ఇట్టి నోటిఫికేషన్ జారీ చేసిన (60) దినములలోపు భూసేకరణ అధికారి ముందు వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/-. రాజస్వ మండలాధికారి మరియు భూసేకరణ అధికారి, ఆదిలాబాద్ | సం/- అదనపు కలెక్టర్ ఆదిలాబాద్ | సం/-. జిల్లా కలెక్టర్, ఆదిలాబాద్

DIPR RO.NO: 1090 /LA/PP/Advt/Pub/2026-27

అర్నబ్ ఎఫెక్ట్

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 33 విమానాలు రద్దు

హైదరాబాద్ (శంషాబాద్) అక్టోబరు 28, ప్రభాతవార్త : అర్నబ్ తుపాన్ ప్రభావంతో శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పలు విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా మొత్తం 33 విమానాలను రద్దు చేసినట్లు విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తుపాన్ ప్రభావం ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, జగదల్పూర్, రాయగడ మార్గాలపై పడింది. దీంతో ఆయా ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే, హైదరాబాద్ నుంచి బయలుదేరే పలు విమానాలను రద్దు చేశారు. విశాఖపట్నం-హైదరాబాద్ మధ్య 13 విమానాలు, విజయవాడ-హైదరాబాద్ మధ్య 5 విమానాలు, రాజమండ్రి- హైదరాబాద్ మధ్య 12 విమానాలు, జగదల్పూర్-హైదరాబాద్ మధ్య 2 విమానాలు, హైదరాబాద్-రాయగడ మార్గంలో ఒక విమానం రద్దయ్యాయి. మొత్తంగా 33 విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు తమ విమానాల తాజా స్థితిని సంబంధిత విమానయాన సంస్థల వెబ్‌సైట్లు లేదా కస్టమర్ కేర్ ద్వారా ముందుగానే తెలుసుకున్న తర్వాతే విమానాశ్రయానికి రావాలని అధికారులు సూచించారు.

నవంబరు 1 ర్యాలీకి షరతులతో అనుమతి


న్యూఢిల్లీ, అక్టోబరు 28: కేంద్ర ఎన్నికల సంఘం వైఖరి, విధానాలను వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష ఇండియా కూటమి నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో తలపెట్టిన భారీ నిరసన ర్యాలీకి ఢిల్లీ పోలీసులు షరతులతో కూడిన అను మతిని మంజూరు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా కఠిన నిబంధనలను విధించిన పోలీసులు సభను ఉదయం 10:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటలలోపే ఎట్టిపరిస్థితుల్లోనూ ముగించాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు. నిర్దేశిత సమయం ముగిసిన వెంటనే మైదానాన్ని ఖాళీ చేయాలని, రాత్రి వేళల్లో రాంలీలా మైదానంలో ఎవరూ బస చేయడానికి అనుమతి లేదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే ర్యాలీ ముగిసిన అనంతరం నాయకులు గానీ, కార్యకర్తలు గానీ ఢిల్లీలోని ఇతర ప్రాంతాలు, సున్నితమైన వీధుల్లో ఎలాంటి పాదయాత్రలు, ప్రదర్శనలు నిర్వహించకూడదని గట్టి ఆంక్షలు విధించారు. కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిఘా కోసం మైదానం పరిసర ప్రాంతాల్లో తగినన్ని సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, పర్యవేక్షణ బాధ్యతలను సమన్వయం చేసుకోవాలని పోలీసు శాఖ నిర్వాహక కమిటీని ఆదేశించింది. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వేలాది మంది ప్రతిపక్ష శ్రేణులు తరలివచ్చే అవకాశమున్నందున మైదానంలో తాగునీటి సౌకర్యం, మొబైల్ మరుగుదొడ్లు, ప్రాథమిక వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రజా రద్దీని నియంత్రించేందుకు, శాంతియుతంగా సభ ముగిసేందుకు తగినసంఖ్యలో స్వచ్ఛంద సేవకులను రంగంలోకి దించాలని పేర్కొంటూ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.



ఇ-సిగరెట్ల దుకాణాలపై కొనసాగుతున్న ఈగల్ దాడులు

నాంపల్లిలో ముగ్గురి అరెస్టు

ఆన్‌లైన్‌లో ఆర్డర్ సేకరణ, పలు మార్గాల్లో హోం డెలివరీ



ఇ-సిగరెట్ల దుకాణంపై దాడుల సందర్భంగా పట్టుబడ్డ వ్యక్తులు, ఇ-సిగరెట్లు.

హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త: టీనేజర్లను, యువతకు ధూమపానం ముసుగులో నికోటిన్ సహా ప్రమాదకర రసాయనాలతో నింపి వున్న ఈ సిగరెట్లు విక్రయిస్తూ వారి జీవితాలను నాశనం చేస్తున్న ఇ-సిగరెట్ల దుకాణాలపై ఈగల్ పోలీసుల దాడులు కొనసాగుతున్నాయి. మంగళవారం సైనిక్ పురిలో ది స్మోక్ పేరిట రహా స్యం గా కొనసాగుతున్న ఈ సిగరెట్ల అడ్డాపై దాడిచేసి ఇద్దరిని అరెస్టు చేసిన ఈగల్ పోలీసులు బుధవారం నాంపల్లిలో నీలోఫర్ ఆసుపత్రి వద్ద నడుస్తున్న ఫ్యూజో స్మోక్ షాప్‌పై దాడులు చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో మేనేజర్‌గా పనిచేస్తున్న మహమ్మద్ అష్ఫాక్ ఇబ్రహీం (24) కార్మికులుగా వున్న షాబుద్దీన్ (22), మహమ్మద్ ముస్తాక్ (36)లను అరెస్టు చేశారు. వీరి వద్ద పలు బ్రాండ్లకు చెందిన ఆరు ఈ సిగరెట్లను నాలుగు సెల్‌ఫోన్లను, నాలుగు స్కానర్లను లక్షా ఐదు వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ దుకాణం గత ఫిబ్రవరి నెలలో ప్రారంభం కాగా దీని యజమాని జాహెద్ అలియాస్ అబ్దుల్ ఖాదర్‌గా తేలింది. ఇతను పరారీలో వున్నాడు. నెలకు రూ. 35 వేల అద్దె ఇస్తున్నట్లు తేలింది. ఈ దుకాణంలో నిత్యం మూడు లేదా నాలుగు ఈ సిగరెట్లు అ మ్ముతున్నట్లు ఈగల్ పోలీసులు గుర్తించారు. ఈ దుకాణంలో అమ్ముతున్న ఈ సిగరెట్లు ఉత్తరాది రాష్ట్రాల నుంచి అందుతున్నట్లు ఈగల్ పోలీ సులు భావిస్తున్నారు. ఈ దుకాణం యజయాని నౌకర్ల చేత వ్యాపారం నిర్వహిస్తూ ఎవరికి అనుమానం రాకుండా జాగ్రత్త పడుతున్నాడని తేలి ంది. నమ్మకమైన కస్టమర్ల నుంచి ఫోన్ ద్వారా ఆర్డర్లు తీసుకుని, దీనికి సంబంధించిన డబ్బులు ఆన్‌లైన్‌లో సేకరించే వాడని తేలింది. దీని త రువాత ఈ సిగరెట్లను పలు రకాలుగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫారాల ద్వారా పంపించే వాడని తేలింది. పట్టుబడ్డ నిందితులపై నాంపల్లి పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. వీరిని రి మాండుకు తరలించారు. దుకాణం యజమాని జాహెద్ కోసం గాలిస్తున్నారు. కాగా రెండు నెలల వ్యవ ధిలో ఈగల్ పోలీసులు 8 ఇ-సిగరెట్ల దుకాణాలపై దాడులుచేసి పెద్దసంఖ్యలో ఇ-సిగరెట్లను జప్తు చేశారు.

క్యూర్ పరిధిలో స్వీట్ షాపులపై టిజి సేఫ్ మళ్లీ దాడులు

లైసెన్స్‌లేని ఐదు దుకాణాల మూసివేత

11 షాపులకు నోటీసులు

హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త: రాష్ట్రంలో కల్తీ ఆహార వస్తువులతో పాటు నకిలీ మందుల విక్రయాలపై ఉక్కుపాదం మోపేందుకు స ర్కారు ఏర్పాటు చేసిన రాష్ట్ర స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజి సేఫ్) బుధవారం నాడు క్యూర్ పరిధిలో 16 స్వీట్ షాపులపై దాడులు నిర్వహించింది. మొత్తం 13 బృందాలతో అధికారులు ఈ దాడులు నిర్వహించారు. దాడుల సందర్భంగా అనేక దుకాణాల్లో అపరిశుభ్ర పరిస్థితుల్లో మిఠాయిలు తయారు చేస్తుండగా, దోమలు, పురుగులు ముసురుతుండడాన్ని అధికారులు గుర్తించారు. దీంతో పాటు దుకాణాలలో ఫ్లోరింగ్ సరిగ్గా లేక పోవడం, రికార్డులు సరిగ్గా లేక పోవడం, మిఠాయిల తయారీకి వాడే పాత్రలు అపరిశుభ్రంగా వుండడం, వస్తు వులు సరిగ్గా లేకపోవడం వెలుగు చూసింది. ఈ సందర్భంగా ఎలాంటి లైసెన్స్ లేకుండా కొనసాగుతున్న చంపాపేట్‌లోని బాలాజీ స్వీట్స్ దుకా ణం, సికిందరాబాద్‌లోని పిజి రోడ్‌లో గల మమత స్వీట్స్ షాప్, లక్ష్మీగూడలోని ఎస్‌కె ఫుడ్స్, మొజం జాహీ మార్కెట్‌లోని హమీదీ కన్‌ఫెక్షనరీ, చూడీబజార్‌లోని అన్నపూర్ణ క్యాటర్స్ షాపులను మూసివేశారు. దీంతో పాటు మరో 11 దుకాణాలకు నోటీసులు జారీ చేయగా ఏడింటికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఒకదానికి ఇంప్రూవ్‌మెంట్ నోటీసు ఇచ్చారు.

నవంబరు 1న ఇండియా కూటమి ర్యాలీకి సిజెపి మద్దతు

న్యూఢిల్లీ, అక్టోబరు 28: ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియను నిరసిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 1న ఇండియా కూటమి నిర్వహించనున్న ర్యాలీకి కాక్రోచ్ జనతా పార్టీ బుధవారం మద్దతు ప్రకటించింది. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా అర్హులైన ఓటర్లు ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలు తమ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి కానీ, ప్రభుత్వం తనకు అనుకూలమైన ఓటర్లను ఎంపిక చేసుకునే పరిస్థితి ఉండకూడదని పేర్కొంది. ఈ ప్రజా స్వామ్య సూత్రాన్ని ఎస్ఐఆర్ ద్వారా బలహీనపరుస్తున్నారని ఆరోపించింది. స్వచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలను పర్యవేక్షించేందుకు అవసరమైన విశ్వాసాన్ని జ్ఞానేశ్ కుమార్ కోల్పోయారని సీజేపీ తన ప్రకటనలో పేర్కొంది. ఎన్నికల సంఘం విశ్వసనీయత, స్వతంత్రతను పునరుద్ధరిం చేందుకు ఆయన రాజీనామా చేయడం అవసరమని తెలిపింది. రాజ్యాంగ పరిషత్ సార్వత్రిక వయోజన ఓటు హక్కుకు ఇచ్చిన ప్రాధాన్యాన్ని ఈ సందర్భంగా పార్టీ గుర్తుచేసింది.

నెలాఖరున దానకిశోర్ పదవీవిరమణ

గవర్నర్ స్పెషల్ సిఎస్‌గా పునర్నియామకం

హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీనియర్ ఐఏఎస్ అధికారి దాన కిశోర్‌ను గవర్నర్‌కు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర ప్రభుత్వం పునర్నియమించింది. పదవీ విరమణ తర్వాత కూడా ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. 1996 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దాన కిశోర్ ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో, ఆయన సేవలను పదవీ విర మణ అనంతరం కూడా వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాల మేరకు జీఏడీ జీఓ ఆర్టీ నంబర్ 1554ను విడుదల చేసింది. ప్రస్తుతం గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న దాన కిశోర్‌ను అదే పదవిలో పునర్నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన నియామకానికి సంబంధించిన నిబంధనలు, షరతులను ప్రత్యేకంగా జారీ చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

'అర్నబ్' తుఫానుతో రైతులకు తీవ్ర నష్టం

కేంద్రం ఆదుకోవాలి

● శివరాజ్‌సింగ్ చౌహాన్‌కి మంత్రి అచ్చెన్నాయుడు లేఖ



అమరావతి, అక్టోబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: 'అర్నబ్' అత్యంత తీవ్ర తుఫాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు భారీ నష్టం వాటిల్లే పరిస్థితులు ఏర్పడ్డాయని, కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించా లని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు బుధవారం లేఖ రాశారు. తుఫాను ప్రభావంతో రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 2,24,489 హెక్టార్లలో పంటలు నీటమునగడం లేదా దెబ్బతినడంతో సుమారు 3.45 లక్షల మంది రైతులు ప్రభావితమైనట్లు ప్రాథమిక నివేదికల ద్వారా వెల్లడైందని తెలిపారు. పంటలు చేతికందే కీలక సమయంలో ప్రకృతి విపత్తు సంభవించడం రైతాంగానికి తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు.

కేంద్రం తక్షణమే స్పందించాలి.. ముందస్తు నిధులు విడుదల చేయాలి:

తుఫాను కారణంగా రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (ఎన్‌డిఆర్ఎఫ్), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డిఆర్ఎఫ్) నిబంధనల మేరకు నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీ అందించేందుకు కేంద్ర సహాయం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమగ్ర నష్ట నివేదిక సమర్పణకు ముందే అత్యవసర సహాయక చర్యల కోసం ముందస్తుగా నిధులు విడుదల చేయాలని అభ్యర్థించారు. సకాలంలో ఆర్థిక సహాయం అందితే రైతుల కష్టాలను కొంతవరకు తగ్గించడంతో పాటు వారి జీవనోపాధిని పరిరక్షించేందుకు, రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన సహాయక, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేసేందుకు వీలవుతుందని వివరించారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వ్యక్తిగతంగా చొరవ తీసుకుని ఆంధ్రప్రదేశ్ రైతాంగానికి అండగా నిలవాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తన లేఖలో కోరారు.

నేవీ రహస్యాల లీక్ కేసులో కీలక పురోగతి

విజయవాడ, అక్టోబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడలో నమోదైన నేవీ రహస్యాల లీకేజీ వ్యవహారంలో కీలక పురోగతి లభించింది. ఈ కేసుకు సంబంధించి బిహార్‌లో అరెస్టయిన ఇద్దరు నిందితులను ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్ (సీఐ) సెల్ అధికారులు విజయవాడ న్యాయస్థానంలో హాజరుపరిచారు. విచారించిన న్యాయస్థానం నిందితులకు నవంబర్ 10వ తేదీ వరకు రిమాండ్ విధించింది. ఈ సందర్భంగా ఆపరేషన్ ఫైర్‌వాల్ రెండో దశకు సంబంధించిన పలు కీలక వివరాలను ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ అధికారులు వెల్లడించారు.

తెలంగాణ ప్రభుత్వం

కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం వరంగల్

ఓపెన్ బహిరంగ వేలం టెండర్ ప్రకటన

టెండర్ ప్రకటన నెం. డి/1726/2026 తేది: 27.10.2026

క్రింది పని నిమిత్తం టెండర్ ఆహ్వానించబడుతోంది. పనిపేరు: 1 కాకతీయ మ్యూజికల్ గార్డెన్ ప్రాంగణంలో వున్న క్యాంటీన్/ఫుడ్ కోర్ట్ యొక్క లీజింగ్ అవుట్. 2. వరంగల్ గుండు చెరువు ఫోర్ట్ వద్ద ఓపెన్ యాంఫిథియేటర్/రెస్టారెంట్ యొక్క లీజింగ్ అవుట్. E.M.D. టెండర్ యొక్క సమయం వద్ద అంచనా ధర యొక్క 1%. బిడ్ దాఖలు ప్రారంభ తేది & సమయం: 28.10.2026 ఉ.10.30గం. బిడ్ దాఖలు ముగింపు తేది & సమయం: 4.11.2026 మ.3.00గం. టెక్నికల్ బిడ్ తెరచు తేది & సమయం: 4.11.2026 మ.3.15గం. ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేది & సమయం: 4.11.2026 మ.3.30గం. పూర్తి వివరాలు www.kuda.in సైట్ వద్ద వీక్షించవచ్చును. లేదా శ్రీ ఎస్.భీమ్‌రావు EE KUDA సెల్ నం: 9866514553 సంప్రదించవచ్చును.

సం/-. వైస్ ఛైర్మన్ KUDA, వరంగల్.

DIPR.NO. 12613-PP/CL/ADVT/1/2026-27 తేది: 28.10.2026

వార్త

ప్రపంచాన్ని జయించిన వాడికంటే తన మనస్సును జయించినవాడు వీరుడు, ధైర్యవంతుడు.

న- థామస్ ఫుల్లర్

అర్నబ్ గాయబ్!

ఆకసాన్నుంచి కురిసిన వర్షం అన్నదాతను ఆదుకోక పోగా 'అర్నబ్' తుఫాన్ రూపంలో కూడి రాని విపత్తుతో గాఢాలింగనం చేసుకోవడం శోచనీయం. గత రెండు రోజులుగా అర్నబ్ తుఫాన్ నెమ్మదిగా అక్కడక్కడే గింగిరాలు కొడుతూ తీర ప్రాంతవాసుల్ని భయపెడుతూ తీరం దాటి కదిలి వెళ్లింది. వెళ్తూ వెళ్తూ తీరాన్ని వణికించింది. తీరం దాటే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా ప్రజానీకం నిద్రలేని రాత్రుళ్లు గడిపారు. ప్రధానంగా నెల్లూరునుంచి శ్రీకాకుళం వరకు గల కోస్తా జిల్లాలు ఏ నిమిషానికి ఏమి జరుగునో అన్న భయాందోళనల్లో చిక్కుకున్నారు. తుపాను లంటే 'కోస్తా' జిల్లాలకు కొత్తేమీకాదు. గత నెలలోనే తుఫాన్‌ను చవిచూశారు.అయినా ఎందుకో ఈసారి వాతావరణ సంస్థలు మునుపెన్నడూ లేని తీవ్రతతో అర్నబ్ తుఫాన్ దూసుకువస్తోందని హెచ్చరించడంతో ఈ ప్రాంత రైతాంగంలో ఆందోళన బయలుదేరింది. రైతు నిస్త్రాణగా మారాడు. చేతికందిన పంట నోటికందలేని పరిస్థితుల్ని ఎలా ఎదుర్కోవాలో తెలియక సతమతమయ్యాడు. సరిగ్గా తెల్లవారుజామున 3 గంటలకు తుఫాన్ ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెలువరించిన హెచ్చరికల్లో తుపాను 'ల్యాండ్ ఫాల్' ప్రక్రియ కొనసాగుతోందని,నర్సాపురంకు 30.కి.మీ యానాంకు 55కి.మీ, కాకినాడకు 70కి.మీ, మచిలీ పట్నంకు 90కి.మీ దూరంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉందని పేర్కొన్నారు. అదేసమయం నుంచి మరో మూడు గంటలు కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాలో గంటకు 125-135 కి.మీ వేగంతో ఈదురుగాలులు, చెలరేగిపోతాయని అంచనా వేసింది. అంతే బుధవారం ఉదయానికల్లా తుఫాన్ శాంతిస్తుందనే అభిప్రాయంతో ఉన్నా పోలవరం, కాకినాడ, ఎన్టీఆర్ జిల్లా, కృష్ణాజిల్లా, కోనసీమ, తూ.గో జిల్లాలో ఈదురుగాలులు, భారీ వర్షాలను ఎదుర్కోక తప్ప లేదు.తీరందాటిన అనంతరం బుధవారం తీవ్ర తుఫానుగా బలహీనపడింది.అటువైపు వెళ్లే రైళ్లను రద్దు చేయడం, రవాణా వ్యవస్థను కంట్రోల్‌లోకే తీసుకోవడం వంటి చర్యలు సత్ఫలితాలనే ఇచ్చింది. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ స్తంభాలు కూలి 7గురు బలయ్యారు. భారీ వృక్షాలు నేల కూలాయి. మచిలీపట్నంలోనైతే భయంకర ఈదురుగాలులు కారణంగా రోడ్లమీద బడ్డీకొట్లు కూడా దూరంగా జరిగాయి. ఎవరూ ఇళ్లల్లోంచి బయటకు రాలేని పరిస్థితి తలెత్తింది. గాలి ఉధృతమై భారీ వృక్షాలను సైతం నేలకూల్చాయి. మంగళవారానికే అర్నబ్ తన ప్రతాపాన్ని చూపెట్టింది. తుఫాను ప్రభావంతో శ్రీకాకుళం నుంచి కృష్ణాజిల్లా వరకు తీర ప్రాంతమంతా గందరగోళం సృష్టించింది. తుపాను సముద్రాన్ని వదిలి నీటి మీదకు రాగానే భారీ విధ్వంసాన్ని సృష్టిస్తుందని తుపానుల గురించి తెలిసిన వారె వరన్నా చెబుతారు. తీరం దాటేటప్పుడు అసలు సిసలైన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రకృతి బీభత్సాలవలన ఎక్కడ నష్టపోతారో, ఎక్కడ గట్టెక్కుతారో చెప్పలేం. వాతావరణ సంస్థలు పసికట్టిన మేరకు జరగవచ్చు. జరుగకపోవచ్చు. సింగపూర్ వాతావరణ సంస్థ ఈసారి సరిగ్గానే పసికట్టింది. కోనసీమలో తుఫాను తీరం దాటుతుందని చెప్పినట్లే అయింది. యానాం దగ్గర తీరం దాటుతుందనుకున్న 'అర్నబ్' నరసాపురం తీరానికి దగ్గరలో తీరం దాటింది. మంగళవారం నాటి భారీ వర్షాలకు కిరండల్ రైల్వేలైన్ దెబ్బతింది. అర్నబ్‌ను అతి తీవ్రతుఫానుగా ప్రకటించినప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కనీస ప్రాణ నష్టమేమీ లేకుండా చూసుకోవడంలో ఆ రాష్ట్ర ప్రభుత్వ పాలకుల అనుభవం కలిసొచ్చింది. ప్రధానంగా అల్లూరి, కోనసీమ, గోదావరి జిల్లాలకు బాగా పంట, ఆస్థి నష్టం వాటిల్లింది. తుపాను చండప్రచండ గాలులకు మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో వృక్షాలు నేలకూలాయి. విశాఖపట్నం నుంచి సింగపూర్‌కు బయలుదేరిన 'నౌక' ఒకటి వెనక్కి కొట్టుకొచ్చి నర్సాపురం వద్ద అంతర్వేది తీరానికి చేరింది. ఎలా దారి మళ్లిందో పెరుమాళ్లకే ఎరుక. ఉప్పాడ తీరం వణికిపోయింది. రాకాసి అలల తాకిడికి ఉప్పాడ,కాకినాడ బీచ్ రోడ్ కొట్టుకుపోగా, సముద్రపునీరు అక్కడి గృహాల మీదకు చొచ్చుకువచ్చింది. సుబ్బంపేట, ఉప్పాడ, సూరడపేట జగ్గరాజుపేట, పల్లిపేట, రంగంపేట, మాయపట్నం గ్రామాల్లోకి వచ్చి చేరిననీరు 30ఇళ్లను పూర్తిగా నేలమట్టమయ్యాయి. సుబ్బంపేట వద్ద తీరప్రాంతాన్ని కాపాడేందుకు నిర్మించిన రక్షణ గోడసైతం ధ్వంసమైంది. రక్షణగా అడ్డుకట్టగా నిలిచి ఉంచిన భారీబండరాళ్లు సైతం స్థానభ్రంశమయ్యాయి. లక్షల విలువచేసే మత్స్యకార్ల బోట్లన్నీ తీరానికి కొట్టుకొచ్చాయి. తమ బోట్లు ధ్వంసమవడంతో మత్స్యకార కుటుంబాలు విలవిల్లాడుతున్నాయి. అల్లూరి జిల్లాలో మత్స్యగుండం ఆలయం మునిగిపోయింది. ఒక్క కోనసీమలో వేలాది కొబ్బరి చెట్లు విరిగిపడ్డాయి. 6వేలపైనవిద్యుత్ స్తంభాలు, నేలకొరిగాయి. అరటి, బొప్పాయి చెట్లు నేలనంటాయి. వాటి నుంచి ఫలసాయం ఆశించే పరిస్థితి లేదు. ఉద్యానపంటలు బాగా దెబ్బతిన్నాయి. కోస్తాతీరం రహదారి పొడవునా విద్యుత్‌స్తంభాలు కూలిపోవడంతో మంగళవారం రాత్రి నుంచి విద్యుత్‌కు అంతరాయం కలిగింది. రహదారి పొడవునా అడ్డంకులు తొలగించాలన్నా కుండపోతవర్షాలకు పనులు వేగవంతం కావడంలేదు. దాదాపు 30వేలమందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. ప్రాథమిక అంచనాల మేరకు 11వేల ఎకరాల్లో ఉద్యానపంటలు 75వేలహెక్టార్ల వరిపంట నేలమట్టమయ్యింది. రైళ్లు, బస్సులు, విమానాల వంటి రవాణాను ఆపివేయడం వలన వానల ఉధృతికి జనం ప్రభావితం కాలేదు. ముందుచూపుతో చేపట్టిన అన్ని జాగ్రత్త చర్యలు ఫలితాలనిచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో అధికంగా, తెలంగాణలో కొన్ని ప్రాంతాలపై ఆర్నబ్ ప్రభావం పడింది. ముందు జాగ్రత్తగా హైదరాబాద్, విజయవాడ, విశాఖల మధ్య ప్రధానంగా నడిచే రైళ్లను రద్దు చేశారు. ఏంచేసినా ప్రకృతి ప్రకోపాన్ని ఎదుర్కోవడం అసాధ్యమే!

సాంకేతిక విప్లవానికి భద్రతే పునాది

డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకురావడం మాత్రమే అభివృద్ధికి కొలమానం కాదు. ఆ సేవలను ప్రజలు భయం లేకుండా,తమ సమాచారం దుర్వినియోగం కాకుండా వినియోగించగలగడం కూడా అంతే ముఖ్యం. అంతిమంగా సాంకేతికతను పూర్తిగా నిరోధించడం పరిష్కారం కాదు, దానిని బాధ్యతాయుతంగా వినియోగించడం, దాని లోపాలను ముందుగానే గుర్తించడం, ప్రమాదాలను తగ్గించే వ్యవస్థలను నిర్మించడం అవసరం. పి. హెచ్. పీ.వంటి సాఫ్ట్‌వేర్ సాంకేతికతల్లో భద్రతా లోపాలను సరిదిద్దడం నుంచి ఏఐ దుర్వినియోగాన్ని నియంత్రించ డంవరకు ప్రతిచర్య డిజిటల్ భద్రతను బలోపేతంచేయాలి. వేగవంతమైన సాంకేతిక అభివృద్ధి వెనుకభద్రత వెనుక బడి పోతే, దానిమూల్యం వ్యక్తులు, సంస్థలు,సమాజం చెల్లించాల్సి వస్తుంది. డిజిటల్ ప్రపంచంలో భద్రత అనేది అదనపు సౌకర్యం కాదు, అది ప్రాథమిక అవసరం. సాంకేతికతపై నమ్మకం పెరగాలంటే భద్రతపై భరోసా కలగాలి.

తిప్పర్తి శ్రీనివాస్

ప్రపంచం వేగంగా డిజిటల్ యుగంలోకి అడుగు పెడుతున్నకొద్దీ సాంకేతికత మనిషి జీవితంలో విడదీయలేని భాగంగా మారుతోంది. బ్యాంకింగ్ లావాదేవీల నుంచి ప్రభుత్వ సేవల వరకు, విద్యనుంచి వైద్యంవరకు, వ్యాపారం నుంచి వ్యక్తిగత సమాచార నిర్వహణ వరకు ప్రతి రంగంలోనూ డిజిటల్ వ్యవస్థల వినియోగం విస్తరిస్తోంది. ఈ పరిణామం మన జీవితాలను సులభతరం చేస్తున్నప్పటికీ, అదే స్థాయిలో సైబర్ ముప్పులనూ పెంచుతోంది. సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాలు, వ్యక్తిగత సమాచార చోరీలు, ఆన్‌లైన్ మోసాలు, కృత్రిమ మేధస్సును దుర్వినియోగం చేసే ప్రయత్నాలు డిజిటల్ భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. సాంకేతిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, దానికి తగిన భద్రత కల్పించడం కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని ప్రస్తుత పరిణామాలు గుర్తుచేస్తున్నాయి. వెబ్‌సైట్ల రూపకల్పనలో విస్తృతంగా ఉపయోగించే ప్రోగ్రామింగ్ భాషల్లో పి.హెచ్.పీ. ఒకటి. అనేక వెబ్ అప్లికేషన్లు, వ్యాపార వేదికలు, సమాచార వ్యవస్థలు ఈ సాంకేతికతపై ఆధారపడుతున్నాయి. అయితే ఏ సాఫ్ట్‌వేర్ సాంకేతికత అయినాసరైన పద్ధతుల్లో అభివృద్ధి చేయకపోతే,అవసరమైన భద్రతా చర్యలు తీసుకోకపోతే ప్రమాదాలకు దారితీయవచ్చు. పి.హెచ్.పీ.తో రూపొందించిన వెబ్‌సైట్లలోనూ భద్రతా లోపాలు తలెత్తే అవకాశం ఉంది. వినియోగదారుల సమాచారాన్ని సురక్షితంగా నిల్వచేయకపోవడం, అనుమానాస్పద సమాచారాన్ని సరైన విధంగా పరిశీలించకపోవడం, పాత సాఫ్ట్‌వేర్ సంచికలను కొనసాగించడం, భద్రతా నవీకరణలను నిర్లక్ష్యం చేయడం వంటి అంశాలు సైబర్ దాడులకు అవకాశమిస్తాయి.అయితే పి.హెచ్.పీ.భాషలోనే లోపం ఉందని భావించడం సరైనది కాదు. ఏ సాంకేతికతలోనైనా భద్రత అనేది దాని రూపకల్పన,అమలు, నిర్వహణ, నవీకరణలపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల సాఫ్ట్‌వేర్ అభివృద్ధి సంస్థలు తమ వ్యవస్థలను నిరంతరం పరీక్షించాలి. భద్రతా లోపాలను గుర్తించినప్పుడు వాటిని ఆలస్యం చేయకుండా సరిచేయాలి. వినియోగదారుల సమాచారాన్ని అనధికార వ్యక్తులు పొందకుండా తగిననియంత్రణలు ఏర్పాటు చేయాలి. సాంకేతిక సౌలభ్యాల వెనుక దాగి ఉన్న ప్రమాదాలను గుర్తించకపోతే, చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద నష్టానికి కారణమవుతుంది. ఇక కృత్రిమ మేధస్సు (ఏఐ) విస్తరణ డిజిటల్ భద్రతకు కొత్త కోణాలను జోడిస్తోంది. సమాచార విశ్లేషణ, వైద్యసేవలు, విద్య, పరిశ్రమలు, వ్యవసాయం, ప్రభుత్వ పాలన వంటి రంగాల్లో ఏఐ అనేక అవకాశాలను అందిస్తోంది. అయితే ఇదే సాంకేతికతను నేరగాళ్లు దుర్వినియోగం చేసే ప్రమాదమూఉంది. గతంలో నకిలీ సందేశాలు, మోసపూరిత ఫోన్‌కాల్స్ ద్వారా ప్రజలను మోసం చేసేవారు. ఇప్పుడు ఏఐ సాయంతో మరింత సహజంగా కనిపించే సందేశాలు, నకిలీ స్వరాలు, మార్పులు చేసిన వీడియోలు రూపొందించి ప్రజలను నమ్మించే ప్రయత్నాలు చేయవచ్చు. దీనివల్ల నిజమైన సమాచారానికి, నకిలీ సమాచారానికిమధ్య తేడాను గుర్తించడం సామాన్యులకు కష్టతరమవుతోంది. ముఖ్యంగా డిజిటల్‌చెల్లింపులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. బ్యాంకు అధికారులమని చెప్పడం,ఖాతా నిలిచిపోతుందని భయపెట్టడం, బహుమతులు వచ్చాయని ఆశ చూపడం, అత్యవసర పరిస్థితి పేరుతో డబ్బులు పంపాలని కోరడం వంటి మోసాలకు కొత్త సాంకేతిక పద్ధతులు తోడవుతున్నాయి. కొన్నిసార్లు పరిచయస్తుల గొంతును పోలిన కృత్రిమ స్వరంతో ఫోన్ చేసి డబ్బులు అడిగే అవకాశం కూడా ఉంది. ఇలాంటి




సందర్భాల్లో కేవలం స్వరం విని నమ్మడం కాకుండా, తెలిసిన మరో ఫోన్ నంబర్ ద్వారా సంబంధిత వ్యక్తిని సంప్రదించి నిర్ధారించుకోవాలి. అనుమానాస్పద లింకులను తెరవకూడదు. పాస్‌వర్డ్‌లు, ఒకసారి వినియోగించే ధ్రువీకరణ సంకేతాలు (ఓటీపీలు), బ్యాంకు వివరాలను ఇతరులకు తెలియజేయకూడదు. డిజిటల్ భద్రత అనేది వ్యక్తిగత జాగ్రత్తలకే పరిమితమైన అంశం కాదు. ప్రభుత్వాలు, సాంకేతిక సంస్థలు, బ్యాంకులు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు సమన్వయంతో వ్యవహరించాల్సిన బాధ్యతాయుతమైన రంగం. ప్రభుత్వ విభాగాలు ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించే సమయంలో దాని అవసరాన్ని స్పష్టంగా నిర్ధారించుకోవాలి. అవసరానికి మించి సమాచారాన్ని సేకరించకుండా ఉండాలి. సేకరించిన వివరాలను సురక్షి తంగా నిల్వ చేయాలి. సమాచారాన్ని ఎవరు, ఏ ప్రయోజనం కోసం వినియోగిస్తున్నారో పర్యవేక్షించే వ్యవస్థలు ఉండాలి. ఏదైనా సమాచార చోరీ జరిగినప్పుడు బాధితులకు సకాలంలో తెలియజేసి, నష్టాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి. అదే విధంగా సాంకేతిక సంస్థలు తమ ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకోకుండా, వాటి భద్రతను కూడా ప్రధాన ప్రాధాన్యంగా పరిగణించాలి. సాఫ్ట్‌వేర్‌లోని లోపాలను గుర్తించేందుకు స్వతంత్ర భద్రతా పరీక్షలు నిర్వహించాలి. లోపాలను బాధ్యతాయుతంగా తెలియజేసే పరిశోధకులను ప్రోత్సహించాలి. ఏఐ ఆధారిత వ్యవస్థలు ఎలా పనిచేస్తున్నాయి, వాటి వల్ల ఎలాంటి ప్రమాదాలు తలెత్తవచ్చు అనే అంశాలపై నిరంతర అధ్యయనం అవసరం. ముఖ్యంగా వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని ఏఐ వ్యవస్థలు ఎలా సేకరిస్తున్నాయి, ఎలా ఉపయోగిస్తున్నాయి, ఎంతకాలం నిల్వ చేస్తున్నాయి అనే విషయాల్లో పారదర్శకత ఉండాలి. సైబర్ భద్రత విషయంలో విద్యకు కూడా విశేష ప్రాధాన్యం ఉంది. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సురక్షితమైన ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన కల్పించాలి. ఉద్యోగులకు కార్యాలయాల్లో సైబర్ భద్రతా శిక్షణ ఇవ్వాలి. వృద్ధులు, గ్రామీణ ప్రాంత ప్రజలు, డిజిటల్ సేవలను కొత్తగా వినియోగిస్తున్నవారికి స్థానికభాషల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్నవారు మోసగాళ్లకు సులభంగా లక్ష్యంగా మారే అవకాశం ఉంది. అందువల్ల డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించడం కూడా సైబర్ నేరాల నివారణలో కీలక పాత్ర పోషిస్తుంది. మరో ముఖ్యమైన అంశం చట్టపరమైన బాధ్యత. సైబర్‌నేరాలు సరిహద్దులతో సంబంధం లేకుండా జరుగుతున్నందున, వాటిని అరికట్టేందుకు దేశాల మధ్య సహకారం అవసరం. నేరాలను గుర్తించే సంస్థలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ, నిపుణుల సహకారం అందించాలి. బాధితులు ఫిర్యాదు చేయడానికి సులభమైన మార్గాలు ఉండాలి. ఫిర్యాదు చేసిన తర్వాత వేగంగా స్పందించే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. అదే సమయంలో సైబర్ భద్రత పేరుతో పౌరుల గోప్యతకు భంగం కలగకుండా, వ్యక్తిగత స్వేచ్ఛను కాపాడుతూ చట్టాలను అమలు చేయడం కూడా అవసరం.భారతదేశంలో డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ ప్రభుత్వ సేవలు, డిజిటల్ వాణిజ్యం విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ అంశానికి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. డిజిటల్ వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం ఉంటేనే వాటి వినియోగం మరింత పెరుగుతుంది. ఆ నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత ప్రభుత్వానికీ, సాంకేతిక సంస్థలకూ, వినియోగదారులకూ సమానంగా ఉంది. డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకురావడం మాత్రమే అభివృద్ధికి కొలమానం కాదు. ఆ సేవలను ప్రజలు భయం లేకుండా,తమ సమాచారం దుర్వినియోగం కాకుండా వినియోగించగలగడం కూడా అంతే ముఖ్యం. అంతిమంగా సాంకేతికతను పూర్తిగా నిరోధించడం పరిష్కారం కాదు, దానిని బాధ్యతాయుతంగా వినియోగించడం, దాని లోపాలను ముందుగానేగుర్తించడం, ప్రమాదాలను తగ్గించే వ్యవస్థలను నిర్మించడం అవసరం. పి.హెచ్.పీ.వంటి సాఫ్ట్‌వేర్ సాంకేతికతల్లో భద్రతా లోపాలను సరిదిద్దడం నుంచి ఏఐ దుర్వినియోగాన్ని నియంత్రించడంవరకు ప్రతిచర్య డిజిటల్ భద్రతను బలోపేతంచేయాలి. వేగవంతమైన సాంకేతిక అభివృద్ధి వెనుకభద్రత వెనుక బడిపోతే, దానిమూల్యం వ్యక్తులు, సంస్థలు,సమాజం చెల్లించాల్సి వస్తుంది. డిజిటల్ ప్రపంచంలో భద్రత అనేది అదనపు సౌకర్యం కాదు,అది ప్రాథమిక అవసరం. సాంకే తికతపై నమ్మకం పెరగాలంటే భద్రతపై భరోసా కలగాలి.

చేయగలిగే శక్తి ఉన్నవాడికంటే, చేయాలనే కోరిక ఉన్నవాడు ఎక్కువ చేయగలుగుతాడు.



జి.ముర్రే

పుస్తకాలు చదవాలనే అభిలాష ఉన్నవారు ఎక్కడ ఉన్నా సుఖంగా ఉంటారు.



ఆస్కార్‌వైల్డ్

ద్రవ్యోల్బణం సంక్షోభం నుంచి బయటపడలేమా?

కిరణ్‌శ్రీ

ద్రవ్యోల్బణం అనేది కాలక్రమేణా వస్తువులు, సేవల సాధారణ ధరలు నిరంతరం పెరగడం. దీనివల్ల డబ్బు కొనుగోలు శక్తి తగ్గుతుంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం ఒక ముఖ్యమైన ఆందోళనగా కొనసాగుతోంది. అయితే, దాని తీవ్రత ఒక్కో దేశంలో ఒక్కో విధంగా ఉంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) అంచనాల ప్రకారం, ప్రపంచ ద్రవ్యోల్బణం 2025లో 4.1 నుంచి 2026లో సుమారు 4.7 కిపెరిగి, 2027లో మళ్లీ తగ్గే అవకాశం ఉంది. భౌగోళికరాజకీయ ఉద్రిక్తతలతో పాటు, అనేక పరస్పర సంబంధిత కారణాలు కూడా అధిక ద్రవ్యోల్బణానికి దారితీస్తున్నాయి. వీటిలో పెరుగుతున్న ఇంధన, ఆహార ధరలు, సరఫరా గొలుసులో అంతరాయాలు, అవసరమైన ముడి పదార్థాల కొరత ముఖ్యమైనవి. వడగాలులు, కరవులు, వరదలు వంటి తీవ్రమైన వాతావరణ పరిస్థితులు వ్యవసాయ ఉత్పత్తినిదెబ్బతీస్తుండటంతో ఆహార ధరలు కూడా పెరుగుతున్నాయి. అలాగే, వినియోగదారుల బలమైన డిమాండ్, కార్మికుల కొరతతో కూడిన కార్మిక మార్కెట్లు, పెరుగుతున్న వేతనాలు ఉత్పత్తి వ్యయాలను, వినియోగదారులపై పడే ధరలను పెంచవచ్చు. కొన్ని దేశాల్లో ప్రభుత్వ వ్యయం పెరగడం, అధిక ప్రభుత్వ రుణభారం కూడా డిమాండ్‌ను పెంచి ద్రవ్యోల్బణ ఒత్తిడిని తీవ్రతరం చేయవచ్చు.అదేవిధంగా, దేశీయ కరెన్సీ విలువ తగ్గడం వల్ల దిగుమతి చేసుకునే ఇంధనం, ఆహారం, యంత్రాలు, ఇతర వస్తువులు మరింతఖరీదవుతాయి. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు దీనివల్ల ఎక్కువగా ప్రభావితమవుతాయి.అంతర్జాతీయ ద్రవ్య నిధి ఏప్రిల్ 2026లో విడుదల చేసి నప్రపంచ ఆర్థిక దృక్పథం ప్రకారం, కొన్ని దేశాల్లో ద్రవ్యోల్బణం అత్యంత తీవ్రంగా కొనసాగుతోంది. ఆహారం, ఇంధనం, కరెన్సీ విలువల్లో మార్పులు, సరఫరా సమస్యలు అక్కడ ద్రవ్యోల్బణానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. యూరప్‌లో సాధారణంగా ద్రవ్యోల్బణం తక్కువగానే ఉన్నప్పటికీ, ఇటీవలి ఇంధన ధరల షాక్ ప్రభావంతో యూరోజోన్‌లో ద్రవ్యోల్బణం 2026 ఆగస్టులో 3.3శాతానికి పెరిగింది. ఇది జూలైలో నమోదైన2.9 కంటే ఎక్కువ. ప్రస్తుత గణాంకాలు చూస్తే ఆర్థికంగా బలహీనమైన దేశాల్లో ద్రవ్యోల్బణం అత్యంత తీవ్రంగా ఉంది. మరోవైపు, అభివృద్ధి చెందినదేశాల్లో ద్రవ్యోల్బణం తులనాత్మకంగా మితంగా ఉన్నప్పటికీ, ధరలపై మళ్లీ ఒత్తిడి పెరుగుతోంది. వాణిజ్య కూటములు, వాణిజ్య ఒప్పందాలు టారిఫ్‌లను తగ్గించడం, కస్టమ్స్ ప్రక్రియలను సులభతరం చేయడం, సరఫరాదారులను విభిన్నంగా ఎంపిక చేసుకునే అవకాశం కల్పించడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. వీటివల్ల ఆహారం, ఇంధనం పారిశ్రామిక ముడి పదార్థాలరవాణా చౌకగా, వేగంగా, జరుగుతుంది. దక్షిణ అమెరికా దేశాల ఉమ్మడి మార్కెట్ వంటి ప్రాంతీయ వాణిజ్య కూటములు పెద్ద మార్కెట్లను, బలమైన సరఫరా గొలుసులను ఏర్పరచగలవు. దీనివల్ల వస్తువుల కొరత ఏర్పడే ప్రమాదం తగ్గుతుంది. వస్తువుల కొరత తగ్గితే ధరలు అకస్మాత్తుగా పెరిగే అవకాశాలు కూడా తగ్గుతాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) ఒప్పందాలు పూర్తిగా అమలు చేస్తే ప్రపంచ వాణిజ్య వ్యయాలు సగటున 14.3 వరకు తగ్గే అవకాశం ఉందని అంచనా. అదే సమయంలో ప్రపంచ వాణిజ్యం సంవత్సరానికి 1 ట్రిలియన్ డాలర్ల వరకు పెరగవచ్చు. వాణిజ్య ఒప్పందాలు దేశాలకు అవసరమైన వస్తువులను ఒకే దేశం లేదా సరఫరాదారుపై ఆధారపడకుండా అనేక దేశాల నుంచి దిగుమతి చేసుకునే అవకాశం కల్పిస్తాయి. యుద్ధాలు, ఆంక్షలు లేదా ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఉమ్మడి ప్రమాణాలు వేగవంతమైన కస్టమ్స్ క్లియరెన్స్ వల్ల రవాణాలో ఆలస్యం, రవాణా ఖర్చులు వస్తువుల వృథా తగ్గుతాయి.

ప్రజావాక్కు

కల్తీలను అరికట్టాలి

హైదరాబాదు నగరంలో దీపావళి సందర్భంగా వ్యాపారస్తులు, కార్పొరేట్ సంస్థలు ఇంకా సామాన్యులు ఒకరికొకరు మిఠాయిలు పంచుకోవటంరివాజు.ఇటీవల కాలంలో అన్నీ కల్తీమయం అవుతున్న తరుణంలో అందరూ జాగరుకతతో ఉండటం మంచిది. నాసిరకం ముడిసరుకు, నెయ్యి కాని నెయ్యి, వాడిన నూనెలనే మళ్లీ వాడటం వంటివి జరుగుతుండటం మనంచూస్తూనేఉన్నాం. దీనికి తోడు అపరిశుభ్ర వాతావరణంలో మిఠాయిలు తయారు చేయటం వంటివి ఆందోళన కలిగిస్తున్నాయి. కేవలం లాభార్జన కోసమేఅన్నట్లు మానవత్వంలేకుండా కల్తీ సరుకులు వాడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. తెలంగాణా ఆహార అత్యవసరఔషధాలప్రమాణాల సంస్థ (టిజిసేఫ్) ఇంకా పటిష్టంగా తనిఖీలు నిర్వహించి అక్రమాలకు, కల్తీలకు పాల్పడుతున్న వారిని గుర్తించి దుకాణాలను శాశ్వతంగా మూసివేయాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

నిత్యావసర వస్తువులపై ఎల్‌నినో ప్రభావం

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవక, భూగర్భ జలాశయాలునిండక,సాగునీరు తాగునీరుకు సంకట పరిస్థితిఏర్పడింది. దీనిని అవకాశంగా తీసుకుని వ్యాపారులు నిత్యావస ధరలను సామాన్యునికి అందనంత ఎత్తుకు పెంచేసారు.వీటిని ఇంకా దాచిపెట్టి రేట్లను మరింత పెంచగలరనిఅంటున్నారు.ముఖ్యంగా మూడునాలుగు నెలల క్రితం సన్నబియ్యం కేజీ అరవై రూపాయలకు అమ్మితే గత వారం నుండి 85-95కి అమ్ముతున్నారు. పప్పులు, నూనెలు, కూరగాయల ధరలను కూడా పెంచడం జరిగింది. ఈపరిస్థితి ఇంకా తీవ్రమయ్యే ప్రమాదముందని హెచ్చరికలు కూడా వస్తున్నాయి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

ప్రమాద ఘంటికలు మోగిస్తున్న కాలుష్యం

లక్షలాదిసంఖ్యలోపెరిగిపోతున్న వాహనాలు,వాటి నుంచి వెలువడుతున్న కాలుష్యం దేశాన్ని కలవరపెడుతున్న సమస్య. పెరుగుతున్న కాలుష్యంతో జీవన విధానం గతి తప్పుతోంది. నగరాలలో పరిశ్రమలు విడిచి పెడుతున్న పొగ జీవరాసులకు సెగగా మారింది. భూమి,నీరు, గాలి అన్నీ కలుషితమైపోతున్నాయి. దీనికితోడు ప్లాస్టిక్ వినియోగం.ప్లాస్టిక్ లేని రోజుల్లో మన జీవన విధానం ఎలా ఉండేది. ఆ రోజులు మళ్లీ రావాలి.

-కాయల నాగేంద్ర, హైదరాబాద్

వైద్యవిద్యలో నాణ్యత అవసరం

వైద్యవిద్యలో నాణ్యత నేరుగా రోగుల భద్రతతో ముడిపడి ఉంటుంది. విద్యార్థికి తగిన బోధన, ప్రత్యక్ష వైద్యశిక్షణ అందకపోతే ఆలోటు భవిష్యత్తులో వ్యాధి నిర్ధారణలో, చికిత్సలో బయటపడవచ్చు. అందుకే వైద్య కళాశాలలు, సీట్ల పెంపుతో పాటుశిక్షణ ప్రమాణాలను నిరంతరం పరిశీలించడం అవసరం. పర్యవేక్షణలో ప్రధానంగా చూడాల్సింది బోధన, వైద్య శిక్షణ వాస్తవంగా జరుగుతున్న తీరును. నివేదికలో అధ్యాపకుల పేర్లు ఉన్నంత మాత్రానసరిపోదు.వారు విధులకు హాజరవుతూ విద్యార్థులకు బోధించాలి. ఆసుపత్రిలో పడకలతో పాటు వివిధ వ్యాధులతో వచ్చే రోగులు, వారి చికిత్సను పరిశీలించేఅవకాశాలుండాలి.అనుభవజ్ఞుల పర్యవేక్షణలో విద్యార్థులు నేర్చుకున్నప్పుడే పుస్తకజ్ఞానం వైద్యనైపుణ్యంగా మారుతుంది. వైద్య సంస్థల మదింపు, రేటింగ్ బోర్డు తనిఖీల్లో ఈ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అధ్యాపకుల హాజరు, తరగతులనిర్వహణ, రోగులనమోదు,శిక్షణ వివరాలను సరిపోల్చాలి. అవసరమైనచోట ఆకస్మిక పరిశీలనలు చేపట్టాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

శబ్ద కాలుష్యాన్ని నియంత్రిద్దాం

పండుగలు, వేడుకలు మన జీవితాల్లో ఆనందాన్ని నింపుతాయి. ఆ ఆనందం అందరితో పంచుకున్నప్పుడే వేడుకలకు మరింత అందం చేకూరుతుంది. అయితే, అవసరానికి మించి పెద్ద శబ్దాలతో పాటలు, డీజేలు, మైకులు వినిపించడం వల్ల శబ్దకాలుష్యం పెరుగుతుంది.ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఈ శబ్దాల వల్ల ఎంతో ఇబ్బంది పడతారు. అధిక శబ్దం ఎక్కువసేపు కొనసాగితే తలనొప్పి,నిద్రలేమి,మానసిక ఒత్తిడి వంటిసమస్యలు కలగవచ్చు. పక్షులు, ఇతర జీవులు కూడా పెద్ద శబ్దాల వల్ల ఇబ్బందులకు గురవుతాయి.మన ఆనందంతో పాటు ఇతరుల ఆరోగ్యం, సౌకర్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

రాష్ట్రంలో ఉన్న 12యూనివర్సిటీలలో ఉన్న అన్ని ఖాళీలను ఒకేసారి భర్తీచేస్తే బాగుంటుంది.కేవలం 7 యూనివర్సిటీలలోని429 పోస్టులతో పాటుగా బ్యాక్‌లాగ్ పోస్టులను కూడా భర్తీ చేయాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వికలాంగులు, ఉమెన్, జనరల్,రిజర్వేషన్ రోస్టర్‌విధానం తప్పకుండా అమలుచేయాలి.ఆలస్యం చేయకుండా నోటిఫికేషన్ నుండి అభ్యర్థుల ఎంపికవరకునియామకం ప్రక్రియ వేగవంతం చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్

యువతకు సరైన దిశానిర్దేశం అవసరం

డాక్టర్ సమర్ స్నేహ ఎనుగొండ

దేశ భవిష్యత్తు యువశక్తి పై ఆధారపడి ఉంటుందని తెలిసిందే. జనాభాలో పనిచేసే వయసులో ఉన్న వారి శాతం పెరగడం యువ శక్తి పెరుగుదలకు చిహ్నం. ఆర్థిక అభివృద్ధిలో క్రియాశీలకంగా పాలుపంచుకునేది దేశాన్ని మునుముందుకు నడిపించేది వాళ్లే. అటువంటి వారే నిరాశ నిస్పృహలతో పని పాట లేకుండా ఉంటే ఇక దేశానికి దిక్కెవరు. మన చదువులు వర్తమాన అవసరాలకు తగ్గట్లు ఉండటం లేదని చాన్నాళ్లుగా నిపుణులు తెలియజేస్తున్నారు.నీతి ఆయోగ్ ప్రకారం కేవలం 8.25 శాతం మందికి మాత్రమే విద్యార్హతకు తగిన ఉద్యోగం లభిస్తోంది. 2014-15 నుంచి ఇంతవరకూ రూ.34,000 కోట్లు వెచ్చించి 7.67 కోట్ల మందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణనిచ్చినా ఫలితం అంతంత మాత్రమేనని నివేదిక చెబుతోంది. 15-29యేళ్ల మధ్య వయస్కులైన 8.7 కోట్లమందికి చదువు, పని, శిక్షణల్లో అన్నింటికీ దూరంగా ఉండిపోయారంటున్నది. వీరు నిరుపేద వర్గాలవారు. ప్రపంచ దేశాల్లో యువజనం అధికంగా గల దేశాల్లో భారత్ ఒకటి. మన జనాభాలో 65 శాతం మంది 35యేళ్ల లోపువారు. సక్రమంగా వినియోగించుకోగలిగితే వీరు దేశానికి అపురూపమైన సంపద. ప్రపంచంలో చాలా దేశాలు వృద్ధ జనాభా ఎక్కువై దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. కానీ మనకు దండిగా యువత ఉన్నా వారికి ఉపాధి కల్పనలో విఫల మవుతున్నాం. ఈ సమస్యలపై లోతైన అధ్యయనం చేసి, సకాలంలో తగిన పరిష్కారాలు వెదకనట్లయితే అపరిమిత సంపదగా ఉండాల్సిన మన యువశక్తే కాస్తా ఆర్థిక, సామాజిక ఒత్తిళ్లకు మూలకారణమయ్యే ప్రమాదం ఉంటుంది. ఇన్ని లక్షలమంది ఉన్నత విద్యనెదిగారని అనుకోవటంవల్ల ఏ ప్రయోజనం ఉండదు. వారికుండాల్సిన మౌలిక అభ్యసనాలు, నైపుణ్యాలు, ఉత్పాదకతకు తోడ్పడే ఉపాధి, నిరంతర నైపుణ్యాభివృద్ధి ఉంటేనే మానవ వనరుల అభివృద్ధి జరుగుతుంది. ప్రభుత్వాలు అధికారంలోకి రావటం కోసం కోట్ల కొలది ఉద్యోగాలు ఇస్తామని ప్రచారం చేసుకుంటారు. ప్రస్తుత అధికారిక లెక్కల ప్రకారం 10 లక్షల ఉద్యోగాలు కేంద్ర ప్రభుత్వంలో ఖాళీలు ఉండగా, 60 లక్షల ఉద్యోగాలు దేశవ్యాప్తంగా కూడా వివిధ డిపార్ట్మెంట్లలో ఖాళీగా ఉన్నాయి. మేక్ ఇన్ ఇండియా, వికసిత్ భారత్ వంటివి నిరుద్యోగులను వెక్కిరిస్తున్నాయి.ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో పెట్టుబడులు కార్పొరేట్లకే లాభిస్తున్నాయి. ఉన్న ఖాళీలు భర్తీ చేయలేదు. డిజిటల్ పేరిట ఉద్యోగాలు రద్దు అవుతున్నాయి. అవినీతి నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వంటివి సరే సరే. నీతిఆయోగ్ ప్రకారం రోజుకు 25 ప్రభుత్వ స్కూల్లో చొప్పున మూసి వేస్తూ 2014 2024 మధ్యకాలంలో 94000 ప్రభుత్వ స్కూళ్లను దేశంలో మూసేసినారు. ఇదే కాలంలో ప్రైవేట్ స్కూల్స్ 3.5 లక్షలు పెరిగినాయి. అంతా ప్రైవేట్ పరం. ఈ విధానాలపై



యువతలో నిరుద్యోగుల్లో విద్యార్థుల్లో అసహనం తీవ్రమౌతుంది. మన పాలకులు అభివృద్ధి ముసుగులో పెట్టుబడిదారులకు ఉమ్మడి ప్రజా వనరులు ప్రభుత్వ ఆస్తులు సహజ వనరులు సముద్ర తీరాలను ధారాదత్తం చేస్తూ, పన్ను రాయితీ ఇస్తూ ఉద్యోగ కల్పన జరిగిపోతుందని ప్రజలకు చెబుతున్నారు. దేశంలో సుమారు 65 శాతం జనాభా 35 ఏళ్ల లోపు వారే. వీరికి నిరుద్యోగం చదువుకు తగ్గ ఉద్యోగం లేకపోవడం ప్రధాన సమస్యలు. దేశ జనాభాలో పనిచేసే వయస్సు వారి జనాభా శాతం ఎక్కువగా ఉంటేదాన్ని జనాభా నిధిగా వర్ణిస్తారు. దీన్నే డెమోగ్రాఫిక్ డివిడెండ్ అని అంటారు. మనదేశంలో ప్రతి సంవత్సరం 20 సంవత్సరాలు దాటిన వారు 2.5 కోట్లుగా ఉంటారు. కేంద్రప్రభుత్వం ప్రకారం 13-35 ఏళ్ల మధ్య వయస్సు వారిని యువత అంటారు. వీరు మన దేశ జనాభాలో 65శాతంగాఉన్నారు. మన దేశంలో 14 సంవత్సరాలలోపు పిల్లలు 24శాతంగానూ 15నుంచి 24 సంవత్సరాల మధ్య వయస్సు వారు 67శాతం గానూ 60 సంవత్సరాల పైబడిన వారు 6.2 శాతంగా ఉన్నారు. సగటు భారతీయుని వయస్సు 25 సంవత్సరాలు. అందుకే మన దేశాన్ని యంగ్ ఇండియా అని అంటారు. ఇదే జనాభా నిధి. ఈ నిధిని అభిలషణీయ స్థాయిలో ఉపయోగంలో తెచ్చుకుంటే శ్రామిక శక్తి అధికంగా ఉత్పత్తి కార్యక్రమాలలో పనిచేయడం వలన ఆర్థిక అభివృద్ధి జరుగుతుంది. నిరంతర వృద్ధి సంతులిత వృద్ధి అభివృద్ధి వ్యూహాలుగా ఉన్నప్పుడు యువశక్తి దేశంలో ఉండి దేశ ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుంది. అయితే మన యువత నిరుద్యోగం అనే నిస్పృహతో వలస పక్షుల్లాగా విదేశాలకు వెళ్లిపోతున్నారు. మన దేశంలో 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసున్న సుమారు 8.7 కోట్ల మంది యువత 'నో ఎడ్యుకేషన్, ఎర్నింగ్, ట్రైనింగ్ (నీట్)' (చదువుకోవడం, ఉద్యోగం చేయడం లేదా శిక్షణ పొందడం) లేరని నీతి ఆయోగ్ ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకటించింది. వీరు కాక మరో 2 కోట్ల మంది యువతకు ఏ ఉద్యోగం లేదని కూడా ఈ నివేదిక పేర్కొంది. సుమారు 11 కోట్ల యువశక్తి ఇలా ఉండడం తీవ్ర ఆందోళనకరం. మారుతున్న సాంకేతికత, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కార్మికులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడమే ఈ నివేదిక లక్ష్యంగా నీతి ఆయోగ్ పేర్కొంది. 'శ్రామికులు, యువత నైపుణ్యాలను తిరిగి నేర్చుకోవడం, స్వయం ఉపాధి మార్గాలు పొందడం, స్థానిక డిమాండ్, అభివృద్ధి చెందుతున్న రంగాలకు అనుగుణంగా ఉండే శిక్షణల ఎంపికల అవసరం చాలా వుంది. పాఠశాల స్థాయిలోనే 'నైపుణ్య శిక్షణ ప్రారంభమై, విద్యార్థులలో పాతుకుపోవాలి' అని ఈసిఫారసు చేసింది. 2014-15 నుండి 7.67 కోట్లకు పైగా యువతకు నైపుణ్య ఆధారిత శిక్షణ ఇచ్చినట్లు చెప్పిన ఈ నివేదిక 'ఇలా ఎక్కువ మందికి శిక్షణ ఇవ్వడంపై కాకుండా, నైపుణ్యాలు ఉద్యోగాలకు, అధిక వేతనాలకు, కెరీర్ పురోగతికి దారితీసేలా చూడటంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నివేదిక తెలియజేసింది. ఆరవ తరగతి నుంచే ఉపాధి, వ్యవస్థాపక నైపుణ్యాల కోర్సులను ప్రవేశపెట్టడం, అప్రెంటిస్ షిప్‌లను (పనిలో శిక్షణ) ఉపాధికి ప్రాథమిక మార్గంగా మార్చడం, అధికారిక డిగ్రీ అవసరం లేని విధంగా నైపుణ్యాలకు ప్రాధాన్యతనివ్వాలని చేసిన సిఫార్సులు సామాజిక అంతరాలను మరింతగా పెంచేలా ఉన్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా యువత ఆకాంక్షలను పట్టించుకోవాలి.

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

నేను అనుకొన్నప్పుడే 'వార్'కు ముగింపు

ఇరాన్ యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టీకరణ

ఒప్పందానికి వెనుకంజ వేస్తున్నది వారే అని వ్యాఖ్య

వాషింగ్టన్, అక్టోబరు 28: అమెరికాతో ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇరాన్ ఆసక్తిగా ఉందని, అయితే చర్చలను కావాలనే ఆలస్యం చేస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇరాన్‌తో కొనసాగుతున్న ఈ ఘర్షణను ఎప్పుడు ముగించాలనేది తానే నిర్ణయిస్తానని ఆయన స్పష్టం చేశారు. టెక్సాస్‌లో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొని తిరిగి వస్తూ ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. 'ఈ యుద్ధాన్ని నేను ఎప్పుడు ముగించాలనుకుంటున్నాను అనేది ప్రశ్న. వారు ఒక ఒప్పందం చేసుకోవాలని అనుకుంటున్నారు. కానీ దాన్ని కావాలనే ఆలస్యం చేస్తున్నారు. బహుశా వారు అమెరికా మధ్యంతర ఎన్నికల కోసమో లేదా మరేదైనా దాని కోసమో ఎదురుచూస్తున్నారు! కానీ అది వారికి ఏమాత్రం సహాయపడదు' అని అన్నారు.

'నేను ఎప్పుడు అనుకుంటే అప్పుడే ముగుస్తుంది'

అంతకుముందు టెక్సాస్‌లోని లుబ్బాక్‌లో జరిగిన ఒక ర్యాలీలో ప్రసంగించిన ట్రంప్, ఇరాన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరాన్‌తో యుద్ధాన్ని అమెరికా ప్రారంభించలేదని, 1979 నుంచి ఇరానే అమెరికాపై పోరాటం చేస్తూ వేలాది మంది సైనికులను పొట్టన బెట్టుకుందని ఆరోపించారు. గత నాయకులు ఈ సమస్యను ఎప్పుడో పరిష్కరించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. కానీ అలా చేయడానికి వారికి ధైర్యం గానీ, తెలివితేటలు గానీ లేవని విమర్శించారు. 'ఇరాన్ యుద్ధం ఎప్పుడు ముగుస్తుంది?' అని తనను ఎవరో అడిగారని, 'నేను ఎప్పుడు అనుకుంటే అప్పుడే ముగుస్తుంది' అని సమాధానమిచ్చానని ట్రంప్ గుర్తు చేశారు.

ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం


మరోవైపు ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఎస్మాయిల్ బఘేయ్ తీవ్రంగా మండిపడ్డారు. దౌత్యం పట్ల అమెరికాకు ఉన్న చిన్నచూపు మరోసారి బయటపడిందని విమర్శించారు. అంతర్జాతీయ ఒప్పందాలను



తమకు అనుకూలంగా లేనప్పుడు తుంగలో తొక్కడం అమెరికాకు అలవాటేనని దుయ్యబట్టారు. 'దౌత్యం పట్ల అమెరికాకు ఉన్న చిన్నచూపు మరోసారి బయటపడింది. పాకిస్థాన్ అవగాహన ఒప్పందాన్ని తాను ఎప్పుడూ నమ్మలేదని, అది సమయం వృథా అని భావించానని అధ్యక్షుడు ట్రంప్ అనడం వారి దౌత్యంలోని డొల్లతనాన్ని బయటపెడుతుంది. ఇరాన్‌కు ఇది కొత్తేమీ కాదు. అమెరికాకు నిబంధనలను ఉల్లంఘించడం, అనుకూలంగా లేనప్పుడు అంతర్జాతీయ బాధ్యతలను తేలికగా తీసుకునే సుదీర్ఘ చరిత్ర ఉంది' అని ఆయన అన్నారు.

రష్యా-ఉక్రెయిన్ సంక్షోభంపై ట్రంప్ కీలక ప్రకటన

ఇరాన్ అంశంతోపాటు రష్యా-ఉక్రెయిన్ వివాదంపై కూడా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఈ సంక్షోభాన్ని పరిష్కరించే దిశగా తమ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని, త్వరలోనే ఇరు దేశాల మధ్య ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు. అటు అక్టోబరు 27 నుంచే రష్యా-ఉక్రెయిన్ సరిహద్దుల్లోని ఖేర్సన్ రీజియన్ లోని ఒలెష్కీలో కాల్పుల విరమణ అమలులోకి వచ్చినట్లు ఇప్పటికే అమెరికా ఫస్ట్ లేడీ మెలానియా ట్రంప్ కూడా ప్రకటించారు. కాగా, ఇక్కడ గత కొన్ని రోజులుగా ఆహారం, నీళ్లు, విద్యుత్‌లేని పరిస్థితుల్లో అల్లాడుదుతున్నారు.



స్పెయిన్‌లో రెండు హైస్పీడ్ రైళ్లు ఢీ!

64 మంది మృత్యువాత, 150 మందికి పైగా గాయాలు

మృతుల సంఖ్య పెరిగే అవకాశం

మాడ్రిడ్, అక్టోబరు 28: స్పెయిన్‌లో ఘోర రైలుప్రమాదం జరిగింది. రెండు హైస్పీడ్ రైళ్లు ఢీకొన్న ఘటనలో 64 మందికిపైగా మరణించారు. మరో 150 మందికిపైగా గాయాలపాలయ్యారు. బుధవారం ఉదయం రాజధాని మాడ్రిడ్ సమీపంలోని టోలెడో ప్రావిన్స్‌లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మాడ్రిడ్ నుంచి సియుడాల్ రియల్, అండలూసియా ప్రాంతాలకు వెళ్లే రైళ్లను నిలిపేశారు. స్పెయిన్ రైల్వే వ్యవస్థ నిర్వహణ సంస్థ ఎడిఐఎఫ్ తెలిపిన వివరాలు ప్రకారం.. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 9 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మాడ్రిడ్-అండలూసియా హైస్పీడ్ రైల్వే మార్గంలో రెండు రైళ్లు ఢీకొనడంతో రాకపోకల్ని తాత్కాలికంగా నిలిసేసినట్లు సంస్థ ప్రకటించింది. రెన్ఫె ఎవి రైలు, అప్పటికే ట్రాక్‌పై నిలిచి ఉన్న ఇరియో రైలును వెనక నుంచి ఢీకొన్నట్లు తెలుస్తోంది. ఢీకొన్న వేగానికి రైలు బోగీలు పట్టాలపై చెలాచెదురుగా పడిపోయాయి. ప్రమాదం జరిగిన వెంటనే రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టింది. గాయపడిన ప్రయాణికులను వైద్య సహాయం కోసం సమీప ఆస్పత్రులకు తరలించారు. మరణాల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. ప్రమాదానికి గల కారణాలపై ఇంకా స్పష్టత లేదు. ప్రమాద సమయంలో రెన్ఫే రైలులో 397 ప్రయాణికులు ఉండగా, ఇరియో రైలులో 147 మంది ప్రయాణిస్తున్నారు. దీంతో రెండు రైళ్లలో కలిసి మొత్తం 544 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది.

కర్ణాటకలో కాంగ్రెస్‌కు షాక్

బెంగళూరు, అక్టోబరు 28: కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి శాసనమండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో నాలుగు స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్ష బీజేపీజేడీఎస్ (ఎన్డీయే) కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. ఈ ఫలితాల్లో బీజేపీ మూడు స్థానాల్లో విజయం సాధించగా, దాని మిత్రపక్షమైన జేడీఎస్ ఒక స్థానాన్ని కైవసం చేసుకుంది. అధికార కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానంలో కూడా గెలవలేకపోయింది. రాష్ట్రంలోని రెండు పట్టభద్రుల, రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాలకు ఈనెల 23న పోలింగ్ జరిగింది. 27న వెలువడిన తుది ఫలితాల్లో ఎన్డీయే కూటమి మొత్తం నాలుగు స్థానాలనూ గెలుచుకున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ నియోజకవర్గాల్లో 74 శాతం నుంచి 87 శాతం మధ్య మెరుగైన పోలింగ్ శాతం నమోదైంది. అందరి దృష్టిని ఆకర్షించిన బెంగళూరు టీచర్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్సీ పుట్టన్న ఓటమి పాలయ్యారు. బీజేపీ మద్దతుతో బరిలోకి దిగిన జేడీఎస్ అభ్యర్థి ఏపీ రంగనాథ్, పుట్టన్నపై 908 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. రంగనాథ్‌కు 10,810 ఓట్లు రాగా, పుట్టన్నకు 9,902 ఓట్లు పోలయ్యాయి. మిగిలిన మూడు స్థానాలను బీజేపీ అభ్యర్థులు గెలుచుకున్నారు. నార్త్‌ఈస్ట్ టీచర్స్ స్థానం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ శశిల్ జి.నమోషి తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. సౌత్‌ఈస్ట్ గ్రాడ్యుయేట్స్ నుంచి కేఎం సురేశ్, వెస్ట్ గ్రాడ్యుయేట్స్ స్థానం నుంచి ఎస్‌వీ సంకనూర్ విజయం సాధించారు.

ఈ ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకతకు నిదర్శనమని ఎన్డీయే కూటమి నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

ఈ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వ మెజారిటీపై ఎలాంటి ప్రభావం చూపవని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.






పిల్లల ఎదుగుదలను చూసి ముఖేష్ అంబాని కంట ఆనందబాష్పాలు

ముంబయి, అక్టోబరు 28: జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ ఇప్పుడు స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖేశ్ అంబానీ ముగ్గురు పిల్లలు ఇవాళ పాల్గొన్నారు. ఆ సమయంలో ముఖేశ్ అంబానీ భావోద్వేగానికి లోనయ్యారు. జియో మార్కెట్ లిస్టింగ్ సమయంలో కన్నీళ్లతో పోరాడారు. ధీరూభాయ్ అంబానీకి పిల్లలు ఆకాశ్, ఇషా, అనంత్ అంబానీ నివాళి అర్పిస్తున్న వేళ ముఖేశ్ అంబానీ తన కన్నీళ్లను ఆపుకోలేకపోయారు. ఆ సందర్భంలో పదేపదే తన కన్నీటిని తుడుచుకున్నారు. అతిపెద్ద కార్పొరేట్ సంస్థను తన తర్వాత తరం ముందుకు తీసుకెళ్తోందన్న భావోద్వేగాన్ని ఆయన తన కన్నీళ్లతో వ్యక్తం చేశారు. త్యాగాలు,ఆశలు, ఆశయాల గురించి పిల్లలు మాట్లాడుతున్న సందర్భంలో ముఖేశ్ కంట నీరు ఆగలేదు.

సూడాన్‌లో అంతర్యుద్ధం..

నైలా మార్కెట్‌పై డ్రోన్ దాడి.. 100 మందికిపైగా మృతి



ఖర్టౌమ్, అక్టోబరు 28: ఆఫ్రికా దేశమైన సూడాన్‌లో అధికార మార్పిడి, సైనిక విలీనంపై సైన్యం (ఎస్ఎఎఫ్), పారామిలిటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్ఎస్ఎఫ్) మధ్య కొనసాగుతున్న భీకర అంతర్యుద్ధంలో సామాన్య ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. సౌత్ దార్ఫుర్ ప్రాంతంలోని కీలక నగరమైన నైలాలో ఉన్న రద్దీ మార్కెట్‌పై సూడాన్ ఆర్మీ సోమవారం సాయంత్రం అత్యంత శక్తిమంతమైన పేలుడు పదార్థాలతో కూడిన డ్రోన్ దాడికి పాల్పడింది. ఈ ఆకస్మిక దాడిలో 100 మందికిపైగా పౌరులు అక్కడికక్కడే మృతి చెందారని, మరో 113 మంది తీవ్రంగా గాయపడ్డారని స్థానిక వర్గాలు, సహాయక బృందాలు వెల్లడించాయి. నిత్యం వేలాది మంది వ్యాపారులు కొనుగోలుదారులతో రద్దీగా ఉండే మార్కెట్‌పై బాంబుల వర్షం కురవడంతో మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయి ఈ ప్రాంతమంతా రక్తసిక్తమైంది.దాడుల పేరిట జనావాసాలు, మార్కెట్లను టార్గెట్ చేస్తూ ఎక్స్‌ప్లోజివ్ డ్రోన్లను ప్రయోగిస్తుండట పెను విధ్వంసానికి దారితీస్తోంది.

టాటాగ్రూప్‌ను నాశనంచేస్తున్నారు: రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, అక్టోబరు 28: లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ టాటా గ్రూప్‌పై సంచలన ఆరోపణలు చేశారు. టాటా సంస్థను నేరపూరితంగా నాశనం చేస్తున్నారని, అయినా దేశంలోని వ్యాపారవేత్తలు భయంతో నోరు మెదపడం లేదని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన ఒక పోస్ట్ చేశారు. భారతీయ వ్యాపార రంగం మోడీ, అమిత్ షాల ఆటవస్తువు కాదు. మీకు ధైర్యం లేదు, మాకుంది. ఈ నేరాలకు న్యాయం జరిగేలా చూస్తామని రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు. టాటా గ్రూప్‌లో కొంతకాలంగా నడుస్తున్న అంతర్గత వివాదం నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పునర్‌నియామకాన్ని టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా సవాలు చేశారు. సెప్టెంబర్ 17న జరిగిన బోర్డు తీర్మానం చెల్లదని, నియామక ప్రక్రియలో నిబంధనలు పాటించలేదని ఆయన అక్టోబర్ 26న రాసిన లేఖలో ఆరోపించారు. ఈ వివాదం కార్పొరేట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, రాహుల్ ఆరోపణలపై బీజేపీ నేత సీఆర్ కేశవన్ స్పందించారు.

యుపి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే క్లీన్ స్వీప్



లక్నో, అక్టోబరు 28: ఉత్తరప్రదేశ్‌లో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సెమీఫైనల్స్‌గా భావిస్తున్న 11 శాసనమండలి స్థానాల ఎన్నికల ఫలితాల్లో అధికార బీజేపీ, ప్రధాన ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇప్పటివరకు వెలువడిన 8 స్థానాల ఫలితాల్లో బీజేపీ 5 చోట్ల విజయం సాధించగా సమాజ్‌వాదీ పార్టీ 3 కీలక స్థానాలను కైవసం చేసుకుంది. మిగిలిన 3 స్థానాల్లో కౌంటింగ్ కొనసాగుతుండగా అందులో ఎస్పీ 2 స్థానాల్లో, బీజేపీ ఒక స్థానంలో ముందంజలో ఉన్నాయి. ఈ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోడీ లోక్‌సభ నియోజకవర్గమైన వారణాసిలో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వారణాసి ఉపాధ్యాయ (టీచర్స్) నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్సీ, ఎస్పీ అభ్యర్థి లాల్ బిహారీ యాదవ్ తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఆయన బీజేపీ అభ్యర్థి ప్రమోద్ మిశ్రాపై దాదాపు 4,900 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అంతేకాకుండా.. వారణాసి గ్రాడ్యుయేట్ స్థానంలోనూ ఎస్పీ ముందంజలో కొనసాగుతోంది. మరోవైపు, ఆగ్రా ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఎస్పీ అభ్యర్థి డాక్టర్ ఆకాశ్ అగర్వాల్.. బీజేపీ అభ్యర్థి హరి కిషోర్ తివారీపై గెలుపొందారు. ఝాన్సీ గ్రాడ్యుయేట్ స్థానాన్ని కూడా ఎస్పీ దక్కించుకుంది. ప్రస్తుతం లక్నో గ్రాడ్యుయేట్ స్థానంలో సైతం ఎస్పీ ఆధిక్యంలో ఉంది. బీజేపీ ఇప్పటివరకు మీరట్ గ్రాడ్యుయేట్, మీరట్ టీచర్స్, లక్నో టీచర్స్, బరేలీమొరాదాబాద్ టీచర్స్ మరియు ఆగ్రా గ్రాడ్యుయేట్ స్థానాలను కైవసం చేసుకుంది. మీరట్‌లో రెండు స్థానాలనూ (టీచర్స్, గ్రాడ్యుయేట్స్) బీజేపీయే గెలుచుకుంది. అక్కడ దినేష్ కుమార్ గోయల్ (గ్రాడ్యుయేట్), శ్రీచంద్ శర్మ (టీచర్స్) విజేతలుగా నిలిచారు. బరేలీమొరాదాబాద్ టీచర్స్ స్థానంలో బీజేపీ అభ్యర్థి హరి సింగ్ ధిల్లాన్ భారీ మెజారిటీతో గెలుపొందారు. ఆయన ఎస్పీ అభ్యర్థి దానిష్ అక్తర్‌పై 17,676 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. మొత్తం ఐదు రౌండ్ల లెక్కింపు ముగిసే సమయానికి ధిల్లాన్‌కు 21,672 ఓట్లు రాగా, అక్తర్‌కు 3,996 ఓట్లు మాత్రమే వచ్చాయి. సీఎం యోగి ఆదిత్యనాథ్ నియోజికవర్గం గోరఖ్‌పూర్ ఉపాధ్యాయ కోటా స్థానంలో తొలుత వెనుకంజలో ఉన్నప్పటికీ ప్రస్తుతం బీజేపీ ఆధిక్యంలోకి దూసుకొచ్చింది. ఆగ్రాలో ఎస్పీ అభ్యర్థి డాక్టర్ ఆకాశ్ అగర్వాల్ గెలుపొందిన తర్వాత ఆయనపై దాడి జరిగిందన్న ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఆకాశ్ అగర్వాల్ చిరిగిన కుర్తాతో ఉన్న వీడియోను ఎస్పీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. గెలుపొందిన తమ అభ్యర్థికి అధికారులు తక్షణమే ఎన్నికల ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. ఆగ్రాలో విజయం సాధిస్తున్న తమ ఎమ్మెల్సీ అభ్యర్థిపై బీజేపీ శ్రేణులు చేసిన ఈ దాడికి బీజేపీ సమాధానం చెప్పాలని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు.


ఎమ్మెల్సీ ఎన్నికల్లో జన్‌సురాజ్ బోణీ



పాట్నా, అక్టోబరు 28: రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ స్థాపించిన జన సురాజ్ పార్టీ, బిహార్ రాజకీయాల్లో మరో ముందడుగు వేసింది. తొలిసారిగా ఆ పార్టీ బిహార్ శాసనమండలిలో (ఎగువ సభ) అడుగుపెట్టింది. దర్భంగా ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి జన సురాజ్ అభ్యర్థి సురేశ్ ప్రసాద్ రాయ్ విజయం సాధించారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ, బిహార్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మదన్ మోహన్ ఝాపై 324 ఓట్ల తేడాతో ఆయన గెలుపొందారు. ఈనెల 27న జరిగిన ఓట్ల లెక్కింపులో సురేశ్ ప్రసాద్ రాయ్‌కు 2,574 ఓట్లు రాగా, మదన్ మోహన్ ఝాకు 2,187 ఓట్లు పోలయ్యాయి. సీపీఎం అభ్యర్థి రామ్‌దేవ్ రాయ్ 1,498 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఈ విజయంతో జన సురాజ్ పార్టీ శాసనమండలిలో తన ఖాతా తెరిచింది. బిహార్‌లో అక్టోబర్ 23న మొత్తం 8 ఎమ్మెల్సీ స్థానాలకు (4 గ్రాడ్యుయేట్, 4 ఉపాధ్యాయ) ఎన్నికలు జరిగాయి. ఫలితాల్లో అధికార ఎన్డీయే కూటమి 5 స్థానాలను గెలుచుకోనుండగా, రెండు చోట్ల స్వతంత్ర అభ్యర్థులు గెలిచారు. జన సురాజ్ పార్టీ ఒక స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ ఎన్నికల్లో జన సురాజ్ మొత్తం 8 స్థానాల్లోనూ పోటీ చేయడం గమనార్హం. ఇటీవలే బంకీపూర్ అసెంబ్లీ ఉప ఎన్నికలోగెలిచి శాసనసభలో ప్రవేశించిన జనసురాజ్, ఇప్పుడు శాసనమండలిలోనూ ప్రాతినిధ్యం.

సుదూర శ్రేణి క్షిపణుల ఛేదనకు

భారత్ శిక్షణాకేంద్రాలను వినియోగించుకోవాలన్న జపాన్



న్యూఢిల్లీ, అక్టోబరు 28: భారత్, జపాన్ మధ్య రక్షణ సంబంధాలు మరింత బలపడుతున్నాయి. తమ సైన్యానికి అత్యాధునిక క్షిపణుల వినియోగంపై శిక్షణ ఇచ్చేందుకు భారత్‌లోని శిక్షణా కేంద్రాలను వినియోగించుకోవాలని జపాన్ భావిస్తోంది. ఈ మేరకు తమ సిబ్బందిని చర్చల కోసం భారత్‌కు పంపినట్లు జపాన్ గ్రౌండ్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ (జీఎస్‌డీఎఫ్) చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ మసయోషి అరాయ్ స్వయంగా వెల్లడించారు. సుమారు 1,000 కిలోమీటర్ల పరిధి కలిగిన ఉపరితలం నుంచి నౌకలను ఛేదించే క్షిపణులపై సమర్థవంతమైన శిక్షణ ఇవ్వడం తమకు పెద్ద సవాలుగా మారిందని జనరల్ అరాయ్ తెలిపారు. ఈ నేపథ్యంలో దేశీయంగా, విదేశాల్లో శిక్షణా అవకాశాలను పరిశీలిస్తున్నామని, ఇందులో భాగంగానే భారత్‌తో సంప్రదింపులు జరుపుతున్నామని వివరించారు. కేవలం క్షిపణులే కాకుండా, చిన్న తరహా అటాక్ డ్రోన్ల ప్రయోగానికి గల అవకాశాలపై కూడా చర్చిస్తున్నట్లు ఆయన ధ్రువీకరించారు. సంక్లిష్టంగా మారిన భద్రతా వాతావరణంలో ఇండోపసిఫిక్‌లో భారత్‌ను జపాన్ ఒక ముఖ్యమైన భాగస్వామిగా చూస్తోందని, రక్షణ సహకారాన్ని మరింత పటిష్ఠం చేసుకోవాలని కోరుకుంటోందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, భారత్‌తో ఉన్న సంబంధాల సున్నితత్వం దృష్ట్యా పూర్తి వివరాలను వెల్లడించలేనని జనరల్ అరాయ్ పేర్కొన్నారు. ఈ నెల 6 నుంచి 9 వరకు జపాన్ జీఎస్‌డీఎఫ్ కమాండ్ నుంచి 34 మంది సభ్యుల ప్రతినిధి బృందం భారత్‌లో పర్యటించింది. ఈ బృందం భారత సైన్యం, డీఆర్‌డీవో అధికారులతో సమావేశమైంది.

28 ఎమ్మెల్సీ స్థానాల్లో కాంగ్రెస్‌కు జీరో!

న్యూఢిల్లీ,అక్టోబరు 28: నాలుగు రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఉత్తర్ ప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, కర్ణాటకలో ఒక్క స్థానాన్ని కూడా దక్కించుకోలేకపోయింది. అధికారంలో ఉన్న కర్ణాటకలో దారుణంగా దెబ్బతింది. సిట్టింగ్ ఎమ్మెల్యే స్థానాన్ని కూడా కోల్పోవడం ఆ పార్టీ పరిస్థితికి అద్దం పడుతోంది. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ బీజేపీజేడీఎస్ కూటమి 4 ఎమ్మెల్సీలను కైవసం చేసుకుంది. కర్ణాటక ఫలితాలు కాంగ్రెస్‌కు అతిపెద్ద షాక్ అనే చెప్పవచ్చు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్, ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రం ఘోరంగా ఓడిపోయింది. నాలుగు ఎమ్మెల్యే స్థానాలు కోల్పోయింది. దీంతో బెంగళూర్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో జేడీఎస్ అభ్యర్థి ఏపీ రంగనాథ్, కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్సీ పుట్టన్నపై విజయం సాధించారు. గతంలో కాంగ్రెస్ ఆధీనంలో ఉన్న ఈ స్థానం ఇప్పుడు ఎన్డీయే కూటమిలో చేరింది. మిగిలిన నార్త్ ఈస్ట్ టీచర్స్, వెస్ట్ గ్రాడ్యుయేట్స్, సౌత్ ఈస్ట్ గ్రాడ్యుయేట్స్ సీట్లను బీజేపీ కైవసం చేసుకుంది.కర్ణాటకతో పాటు యూపీ, బీహార్, మహారాష్ట్రల్లో కూడా కాంగ్రెస్ ఒక్కటంటే ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. యూపీలో 11 ఎమ్మెల్సీ స్థానాలు ఉంటే బీజేపీ, సమాజ్‌వాదీ(ఎస్పీ) మధ్య పోటీ నెలకొంది. మీరట్, బరేలీమొరాదాబాద్, లక్నో స్థానాలను బీజేపీ నిలబెట్టుకుంది. వారణాసి టీచర్స్, ఆగ్రా టీచర్స్ స్థానాల్లో ఎస్పీ విజయం సాధించింది.

వీసా లక్ష డాలర్ల ఫీజుపై విచారణ నిలిపివేయాలని కోరిన ట్రంప్ సర్కార్

వాషింగ్టన్, అక్టోబరు 28: అమెరికాలో హెచ్1బీ వీసా దరఖాస్తులపై ట్రంప్ ప్రభుత్వం విధించిన లక్ష డాలర్ల భారీ రుసుమును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ కీలక దశకు చేరుకుంది. ఈ కేసులో సమ్మరీ జడ్జిమెంట్ ద్వారా సత్వరమే తుది తీర్పు వెలువరించాలని పిటిషనర్లు కాలిఫోర్నియా ఫెడరల్ కోర్టును కోరారు. అయితే, అప్పీల్ కోర్టు నుంచి నిర్ణయం వెలువడే వరకు ఈ విచారణను నిలిపివేయాలని ప్రభుత్వం వాదిస్తోంది. ప్రస్తుతం ఈ న్యాయపోరాటం గ్లోబల్ నర్స్ ఫోర్స్ వర్సెస్ ట్రంప్ పేరిట కొనసాగుతోంది. ఈనెల 20న కోర్టుకు సమర్పించిన సంయుక్త నివేదికలో, హెచ్1బీ వీసాల ప్రాసెసింగ్‌కు లక్ష డాలర్లు వసూలు చేయాలన్న నిబంధన చట్టవిరుద్ధమని పిటిషనర్లు వాదించారు. మరోవైపు, ఈ కేసులో సెప్టెంబర్ 30న వెలువడిన మధ్యంతర ఉత్తర్వులను సవాలు చేస్తూ ఈనెల 9న తాము నైన్త్ సర్క్యూట్ అప్పీల్ కోర్టును ఆశ్రయించామని ప్రభుత్వం పేర్కొంది. అక్కడ తీర్పు వెలువడకుండా జిల్లా కోర్టులో విచారణను కొనసాగించడం వల్ల ప్రయోజనం ఉండదని స్పష్టం చేసింది. ఈ స్టే పిటిషన్‌పై 2027 జనవరి 14న విచారణ జరగనుంది. ఈ కేసుకు సంబంధించిన పరిపాలనాపరమైన రికార్డులను నవంబర్ 3వ తేదీలోగా తమకు అందజేయాలని పిటిషనర్లు కోరుతున్నారు. ఈ వివాదాస్పద రుసుమును అధ్యక్షుడు ట్రంప్ 2025 సెప్టెంబర్‌లో ప్రోక్లమేషన్ 10973 ద్వారా ప్రవేశపెట్టగా, 2026 సెప్టెంబర్‌లో ప్రోక్లమేషన్ 11069 ద్వారా దాన్ని పొడిగించారు. అధ్యక్షుడి ఉత్తర్వులు చట్టపరిధిని మించి ఉన్నాయా, ప్రభుత్వ విభాగాలు నిబంధనలను ఉల్లంఘించాయా అనే అంశాలపై న్యాయపోరాటం సాగుతోంది. పిటిషనర్ల తరఫున జస్టిస్ యాక్షన్ సెంటర్, డెమోక్రసీ ఫార్వర్డ్ వంటి సంస్థలు వాదనలు వినిపిస్తున్నాయి.

సంక్షిప్త వార్తలు

కెప్టెన్ స్మిత్‌మచ్చర్‌కు యుఎఇ అత్యున్నత పురస్కారం!



అబుదాబి, అక్టోబరు 28: విమానంలో అత్యవసర పరిస్థితిని ఎదుర్కొని, అసామాన్య ధైర్యసాహసాలతో ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్, ఫ్లైదుబాయ్ సిబ్బందిని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం అత్యున్నత పురస్కారంతో గౌరవించింది. విపత్కర పరిస్థితుల్లో వారి వృత్తి నైపుణ్యానికి గుర్తింపుగా ఫస్ట్ క్లాస్ ఆర్డర్ ఆఫ్ జాయెద్ పురస్కారాన్ని ప్రదానం చేసింది. యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ తరఫున దుబాయ్ క్రౌన్ ప్రిన్స్ షేక్ హమ్దాన్ బిన్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ ఈ పురస్కారాలను అందజేశారు.

కాంగ్రెస్‌కు దీటుగా బిజెపి ప్రజాస్వామ్య పరిరక్షణ ర్యాలీ




న్యూఢిల్లీ, అక్టోబరు 28: భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ నేతృత్వంలో బుధవారం ఢిల్లీలో భారీ పాదయాత్ర జరగనుంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, అరాచకాన్ని అంతం చేయండి అనే నినాదంతో చాందినీ చౌక్ వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ పాదయాత్రలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు హర్ష్ మల్హోత్రా, ఎంపీలు మరియు ఇతర సీనియర్ నాయకులు పాల్గొంటారని పార్టీ ఎక్స్ వేదికగా ప్రకటించింది. ఈ ప్రచారంలో భాగంగా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో కూడా పాదయాత్రలు కొనసాగుతున్నాయి.

మైనర్‌ల రేప్‌కేసులో 70 యేళ్ల వ్యక్తికి జీవితకాల శిక్ష

భోపాల్, అక్టోబరు 28: మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చెందిన మాజీ న్యూస్‌పేపర్ ఓనర్, 70 ఏళ్ల ప్యారే మియాకు స్థానిక పోక్సో కోర్టు శిక్ష ఖరారు చేసింది. అయిదుగురు మైనర్ అమ్మాయిలను రేప్ చేసిన కేసులో అతనికి వేర్వేరుగా 10 జీవితకాల శిక్షలను విధించింది. అతనికి 77.64 లక్షల జరిమానా కూడా విధించింది. మంగళవారం ఈ కేసులో తీర్పును వెలువరించారు. పోక్సో, ఐపీసీ చట్టాల కింద శిక్షను ఖరారు చేశారు. మరణించే వరకు ఎనిమిది శిక్షలు, రెండు సార్లు జీవిత ఖైదు శిక్షలు పడ్డాయి. అన్ని శిక్షలను ఒకేసారి అమలు చేయనున్నారు.

ఎంపి నుంచి కేంద్ర మంత్రి హార్‌దీప్‌సింగ్‌పూరికి రాజ్యసభ సీటు



న్యూఢిల్లీ, అక్టోబరు 28: కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి ని మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థిగా బీజేపీ నామినేట్ చేసింది. బీజేపీ నేత ఎల్ మురుగన్ అక్టోబర్‌లో సీటు ఖాళీ చేయడంతో హర్దీప్ పురిని పోటీలోకి దించుతున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ క్యాబినెట్‌లో హర్దీప్ పురి సభ్యుడిగా ఉన్నారు. పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వశాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఎల్ మురుగన్ రాజ్యసభకు రాజీనామా చేశారు. దీంతో కేబినెట్‌లో మార్పులు జరిగే అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు వినిపించాయి.

మెర్సిడిస్ హిట్ అండ్ రన్‌కేసులో నగర కమిషనర్ బదలీ!

కొచ్చి, అక్టోబరు 28: కేరళలోని కొచ్చి సిటీ పోలీసు కమీషనర్ కాళిరాజ్ మహేశ్ కుమార్‌ను బదిలీ చేశారు. మరో నలుగురు పోలీసుల్ని సస్పెండ్ చేశారు. చారనల్లూరులో జరిగిన మెర్సిడీజ్ కారు ప్రమాదంలో దర్యాప్తు లోపాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో కేరళ సర్కారు కొచ్చి సిటీ కమీషనర్‌ను బదిలీ చేసింది. జిల్లా అదనపు జడ్జికి చెందిన 17 ఏళ్ల కుమారుడు మెర్సిడీజ్ కారును డ్రైవ్ చేస్తూ 55 ఏళ్ల స్కూటర్ రైడర్‌ను ఢీకొట్టాడు.ఆ ప్రమాదంలో రైడర్ మృతిచెందాడు. అయితే ఈ కేసు విచారణలో కొచ్చి పోలీసు కమీషనర్ నిర్లక్ష్యం వహించినట్లు ప్రభుత్వం పేర్కొన్నది.

ఆటంకాలు సృష్టించినా ఢిల్లీలో నిరసన గళం వినిపిద్దాం

జూమ్ మీటింగ్‌లో పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త: ప్రజాస్వామిక వ్యవస్థను అపహాస్యం చేస్తున్న బిజెపి ప్రభుత్వంను ఎండగట్టేందుకు ఎన్ని ఆటంకాలు ఎదురైనా తెలంగాణ నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఢిల్లీకి చేరుకోవాలని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం గాంధీభవన్‌లో డిసిసి అధ్యక్షులు, ఫ్రంటల్ చైర్మన్ లతో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఆ జూమ్ మీటింగ్ లో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి మల్లు రవి తదితరులు పాల్గొన్నారు. మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ నవంబరు 1న ఢిల్లీలో జరగబోయే నిరసన కార్యక్రమానికి ప్రత్యేక రైళ్లలో వెళదామని ప్రణాళిక చేస్తే 5రోజులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నిన్న రైల్వేశాఖ మన దరఖాస్తును తిరస్కరించిందనీ ఆవేదన చెందారు. రైళ్ల అనుమతి నిరాకరణలో కేంద్ర ప్రభుత్వ కుట్ర ఉందనీ ఆరోపించారు. ఏదీ ఏమైనా ఢిల్లీ మీటింగ్‌కు తెలంగాణ నుంచి భారీగా తరలి వెళ్ళాలనీ ఆయన సూచించారు. అందుకోసం అవసరమయిన బస్‌లను ఏర్పాటు చేస్తున్నామనీ తెలిపారు.బస్ ప్రయాణం ద్వారా వచ్చే వారికి సౌకర్యాలు అన్ని పిసిసి ఏర్పాటు చేస్తుందనీ తెలిపారు. అందుకోసం ఎంపి మల్లు రవి తో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకాటి శ్రీహరి, ఎంపిలు బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి లతో కమిటీ వేశామనీ వివరించారు. బస్ ప్రయాణం 30 గంటలకుపైగా ఉండడం వల్ల యువకులు వస్తే బాగుంటుందనీ చెప్పారు. బస్ లలో ఎలాంటి ఇబ్బందులు కాకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాము. ఎన్ని అడ్డంకులు వచ్చినా కూడా ఢిల్లీకి వెళ్లి తీరుతామనీ చెప్పారు. నిరసన విజయవంతం చేస్తామనీ అన్నారు. ఢిల్లీలో జరగబోయే వోట్ బచావో, దేశ్ బచావో కార్యక్రమంలో తెలంగాణ నుంచి పెద్దఎత్తున పాల్గొంటారనీ మహేష్ కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తంచేశారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో బుధవారం శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ ప్రతినిధులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేసిన దృశ్యం

సిఎం రేవంత్‌రెడ్డితో శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త: తెలంగాణలో సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిచింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ ప్రతినిధులు కలిసి ధన్యవాదాలు తెలిపారు. వచ్చే నెల 4న ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే సదర్ ఉత్సవాలకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా సిఎంను కలిసిన వారిలో శ్రీ కృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, యాదాద్రి బోర్డు సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, ఇతర నాయకులు ఉన్నారు.

పేదల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం తగదు

ఆదిలాబాద్ రిమ్స్‌ను సందర్శించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త: పేదల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం తగదని ఆసుపత్రి డాక్టర్లు క్రమం తప్పకుండా రావాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ హితవు చెప్పారు.ఆదిలాబాద్ రిమ్స్ ను ఎమ్మెల్యే పాయల్ శంకర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రశుతి,ఒపి విభాగం తదితర వార్డులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కొందరు వైద్యులు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, అలాంటి వారికి వేతనాలు ఎలా ఇస్తున్నారని డాక్టర్ రాథోడ్ జైసింగ్‌ను ఆయన ప్రశ్నించారు. మరికొంత మంది ఉదయం 9 గంటలకు వచ్చి బయోమెట్రిక్ హాజరు వేసుకొని 11 గంటలకే తిరుగు ముఖం పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఎస్సై విజయ్‌ను విచారిస్తున్న ఎసిబి అధికారులు

లంచం డిమాండ్ చేసిన బంజారాహిల్స్ ఎస్సై అరెస్ట్

చీటింగ్ కేసులో నిందితుడి నుంచి డబ్బు అడిగినట్లు ఆరోపణలు

హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 28, ప్రభాతవార్త: చీటింగ్ కేసులో నిందితుడి నుంచి లంచం డిమాండ్ చేశారంటూ వచ్చిన ఫిర్యాదుతో బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్సై ఐ విజయ్‌ను ఏసీబీ అధికారులు బుధవారం అరెస్టు చేశారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో ఏసీబీ డీఎస్పీ గంగాసాని శ్రీధర్ ఇందుకు సంబంధించి మీడియాకు వివరాలు వెల్లడించారు. రియల్ ఎస్టేట్ సంస్థకు సంబంధించి ఒక సంస్థ నిర్వాహకుడు పై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో పలు కేసులు నమోదయ్యాయి. తాజాగా నమోదైన కేసులో నిందితుడిని రూ.10 లక్షలు ఇవ్వాలని విజయ్ డిమాండ్ చేశారు. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించే ముందు ఎస్సై రూ.10 లక్షలు డిమాండ్ చేశాడు. అంత మొత్తం ఇచ్చుకోలేనని, రూ.10 వేలు ఇవ్వగలనని బాధితుడు చెప్పడంతో అతడిని లాకప్‌లో ఉంచి అక్టోబర్ 3న కోర్టులో హాజరుపరిచారు.

ఈ కేసులో మేజిస్ట్రేట్ రిమాండ్‌ను తిరస్కరించి వెనక్కి పంపించారు. అనంతరం అక్టోబర్ 13న బాధితుడిని మళ్లీ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన ఎస్సై పాత కేసుల విషయాన్ని ప్రస్తావిం చాడు. వాటిలో ఒక కేసుకు సంబంధించి ఇచ్చిన నోటీసుకు నిందితుడు అక్టోబర్ 15న సమాధానం ఇచ్చేందుకు వచ్చాడు. సమాచారం స్వీకరిం సమయంలో ఎస్సై మరోసారి డబ్బులు డిమాండ్ చేశాడు. తొలుత రూ.2 లక్షలు ఇవ్వాలని కోరగా, చివరకు రూ.లక్ష ఇవ్వడానికి బాధితుడు అంగీకరించాడు. దీంతో బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఎస్సై డబ్బులు తీసుకొనప్పటికి అందుకు సంబంధించిన ఆడియో రికార్డింగ్ లను ఏసీబీ అధికారులు అప్పటికే నమోదు చేశారు.

బాధితుడి ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ అధికారులు బుధవారం కేసు నమోదుచేసి ఎస్సై విజయ్‌ను అదుపు లోకి తీసుకుని అరెస్టు చేశారు. సంబంధిత కేసుల ఫైళ్లను పరిశీలించడంతో పాటు, ఈ వ్యవహారంలో ఇతర అధికారుల పాత్ర ఏమైనా ఉందా అనే కోణంలోనూ విచారణ జరుపుతామని గంగాసాని శ్రీధర్ తెలిపారు. తదుపరి చర్యల్లో భాగంగా ఎస్ఐని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు వివరించారు. పోలీస్ స్టేషన్లో రికార్డ్ అయిన పలు సీసీ ఫుటేజ్ లను ఏసీబీ అధికారులు సేకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏసీబీ అధికారులు ఈ సోదాలు, విచారణ చేపట్టారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌తో నిజామాబాద్ కొత్వాల్ భేటీ

హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త: జాతీయ యస్.టి కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్‌ను నిజామాబాద్ జిల్లా పోలీసు క మిషనర్ సాయి చైతన్య బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నిజామాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన జాటోతు హుస్సేన్‌ను కమిషనర్ పట్టణంలోని ఐ.డి.ఓ.సి భవన్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హుస్సేన్‌కు కమిషనర్ సాయి చైతన్య గౌరవ పూర్వకంగా పూల మొ క్కను అందజేశారు. వీరిద్దరు పలు అంశాలపై కొద్దిసేపు చర్చించారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే ఊరుకోం

రైస్ మిల్లర్లను హెచ్చరించిన స్టీఫెన్ రవీంద్ర

హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త: రాష్ట్రంలో బియ్యం ధరలు అమాంతం పెరగకుండా, సామాన్యులకు అందుబాటులో ఉండేలా తెలంగాణ ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టిందనీ కృత్రిమంగా కొరత సృష్టిస్తే ఎంతటివారినైనా కటకటలవెనక్కి పంపుతామని పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లోని సివిల్ సప్లై భవన్‌లో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ నేతృత్వంలో మిర్యాలగూడ, నిజామాబాద్, నల్గొండకు చెందిన ప్రముఖ రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులతో ఈ సమావేశం నిర్వహించారు.


మార్కెట్లో బియ్యం కొరత లేకుండా చూడాలని, వినియోగదారులకు అందే ధరలను అదుపులో ఉంచాలని ఈ సందర్భంగా వారికి స్పష్టం చేశారు.ప్రస్తుతం మార్కెట్లో ఉన్న బియ్యం నిల్వలన్నీ గత సీజన్‌కు చెందినవే కాబట్టి, ధరలను అమాంతం పెంచడానికి వీల్లేదని అధికారులు వ్యాపారులకు తేల్చిచెప్పారు. కృత్రిమ కొరత సృష్టించినా, అక్రమంగా బియ్యాన్ని గోదాముల్లో దాచిపెట్టినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని గట్టిగా హెచ్చరించారు. వ్యాపారుల లాభాపేక్ష వల్ల సామాన్య ప్రజలు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమని అధికారులు స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం ఎవరినీ ఉపేక్షించేది లేదని తెలిపారు.ధరలను అదుపులో ఉంచడంతో పాటు ప్రభుత్వానికి అన్ని విధాలా సహకరించాలని మిల్లర్లకు అధికారులు సూచించారు. పరిస్థితిని బట్టి మార్కెట్లో ప్రభుత్వం ప్రత్యేక కౌంటర్లు తెరిచి బియ్యం విక్రయిస్తుందని, అప్పుడు ఆ కౌంటర్లకు ఎలాంటి అంతరాయం లేకుండా బియ్యం సరఫరా చేయాలని అధికారులు స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు మార్కెట్‌ను పర్యవేక్షిస్తూ, ప్రజల సంక్షేమం కోసం పౌర సరఫరాల శాఖ చిత్తశుద్ధితో పనిచేస్తోందని అధికారులు వెల్లడించారు. పారదర్శకతతో పాటు, సామాన్యులకు అందుబాటులో ఉండే ధరల ద్వారా ప్రజలందరికీ ఆహారం అందేలా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

నక్సలిజం నిర్మూలనకు అభివృద్ధే కీలకం

శాంతిభద్రతలకు సమష్టి కృషి అవసరం

రాష్ట్ర భద్రతా సలహాదారు, మాజీ డిజిపి బి.శివధర్‌రెడ్డి

హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 28, ప్రభాతవార్త: నక్సలిజం ప్రభావాన్ని పూర్తిగా తగ్గించి శాశ్వత శాంతిని నెలకొల్పాలంటే భద్రతా చర్యలతోపాటు అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలని తెలంగాణ రాష్ట్ర భద్రతా సలహాదారు, మాజీ డీజీపీ బి. శివధర్‌రెడ్డి అన్నారు. ప్రముఖ అంతర్గత భద్రతా నిపుణుడు డాక్టర్ పి.వి. రమణ రచించిన ఇండియాస్ మావోయిస్ట్స్: గ్లింప్సెస్ ఇంటు రెడ్ ఇన్‌సర్జెన్సీ పుస్తకాన్ని బుధవారం బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ ఆడిటోరియంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ ద్వారకా తిరుమలరావు, డీజీపీ (శాంతిభద్రతలు) మహేష్ ఎం. భగవత్, డీజీపీ (ఆపరేషన్స్) అనిల్‌కుమార్, హైదరాబాద్ సీపీ వి.సి. సజ్జనర్, తెలంగాణ టుడే సంపాదకుడు కె. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విభాగాలు, పోలీసు బలగాల సమష్టి కృషితో నక్సలిజం ప్రభావం తగ్గిందన్నారు. రాజ్యాంగ హక్కులు, సామాజిక న్యాయంపై అంబేద్కర్ భావజాలం ప్రజల్లో చైతన్యాన్ని పెంచిందని పేర్కొన్నారు. ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ నక్సలిజం మళ్లీ విస్తరించకుండా నిరంతర నిఘా కొనసాగించాలని, కీలక అటవీ ప్రాంతాల్లో భద్రతా స్థావరాలను కొన సాగించాలని విధానాలపై సమగ్ర పరిశోధనతో పుస్తకాన్ని రూపొందించినట్లు తెలిపారు. 2004 నుంచి నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, భద్రతా అధికారులు, పరిశోధకులు, లొంగిపోయిన మావోయిస్టులను ఇంటర్వ్యూ చేసినట్లు చెప్పారు. నక్సలిజానికి శాశ్వత పరిష్కారం కోసం



పుస్తకావిష్కరణలో పాల్గొన్న శివధర్‌రెడ్డి, ద్వారకాతిరుమలరావు, మహేష్ భగవత్, అనీల్‌కుమార్, సజ్జనార్, శ్రీనివాస్‌రెడ్డి, రమణ తదితరులు

సూచిం చారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఉపాధి, అభివృద్ధి కార్యక్రమాలను వేగవం తం చేయాలని పిలుపు నిచ్చారు. రచయిత డాక్టర్ పి.వి. రమణ మాట్లా డుతూ మావో యిస్టు పార్టీ నిర్మాణం, పట్టణ నెట్‌వర్క్‌లు, మహిళా కేడర్, ఆయుధ దాడులు, శాంతి చర్చలు, లొంగు బాటు ప్రభుత్వాలు, పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. లొంగిపోయిన వారికి పునరావాసం, స్థానిక యువతకు ఉపాధి, గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్య సదుపాయాల విస్తరణకు ప్రాధాన్యమివ్వాలన్నారు.

తాండూరు కందులకు అంతర్జాతీయ గుర్తింపు

ఆస్ట్రేలియాకు తొలి ఎగుమతి

హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త : భౌగోళిక గుర్తింపు (జీఐ) పొందిన తాండూరు కందులు తొలిసారిగా ఆస్ట్రేలియాకు ఎగుమతి అవుతున్నాయి. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని వ్యవసాయ, ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి ప్రాధికార సంస్థ (అపెడా) సహకారంతో ఈ ఎగుమతి సాధ్యమైంది. హైదరాబాద్ అపెడా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్.పి. నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ బుధవారం హైదరాబాద్ నుంచి వర్చువల్ విధానంలో సరుకును ప్రారంభించారు. ఈ సరుకులో 2.5 మెట్రిక్ టన్నుల జీఐ ట్యాగ్ తాండూరు కందులు ఉన్నాయి. కాగా తెలంగాణ నుంచి జీఐ గుర్తింపు పొందిన మొట్టమొదటి వ్యవసాయ ఉత్పత్తి తాండూరు కందులే. తాండూరు, బషీరాబాద్, పెద్దేముల్, యాలాల మండలాల్లోని వర్షాధార భూముల్లో ప్రధానంగా ఈ పంటను సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని సారవంతమైన లోతైన నల్లరేగడి నేలలు, అటాపుల్గైట్ బంకమట్టి ఖనిజ నిక్షేపాలు, విస్తారమైన సున్నపురాయి నిక్షేపాల వల్లే తాండూరు కందులకు ప్రత్యేక లక్షణాలు వచ్చాయి. తాండూరు కందుల్లో 22 నుంచి 24 శాతం మాంసకృత్తులు (ప్రోటీన్) ఉంటాయి. ఇది ధాన్యాల్లోని ప్రోటీన్ కంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువ. రుచి, వంటకు అనుకూలత, ఎక్కువ కాలం నిల్వ ఉండే గుణం వీటి ప్రత్యేకత. జీఐ గుర్తింపు వల్ల ఈ ఉత్పత్తికి మరింత ప్రాచుర్యం, మార్కెట్‌లో గుర్తింపు లభించడంతో పాటు దేశ, విదేశీ మార్కెట్లలో అధిక విలువ పొందే అవకాశం ఉంటుంది. ఆస్ట్రేలియాకు జరుగుతున్న ఈ ఎగుమతి, ఈ విశిష్ట వ్యవసాయ ఉత్పత్తికి కొత్త విదేశీ మార్కెట్లను అన్వేషించే దిశగా కీలక అడుగు. దీని ద్వారా రైతులకు, ఉత్పత్తిదారులకు, ఎగుమతిదారులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయి. తెలంగాణకు చెందిన జీఐ ఉత్పత్తులు, ఇతర ప్రత్యేక వ్యవసాయ ఉత్పత్తుల కోసం అంతర్జాతీయ మార్కెట్లను అన్వేషించే ప్రయత్నాలు మరింత ముమ్మరం అవుతాయని అపెడా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్.పి. నాయుడు అన్నారు. వ్యవసాయ విలువ గొలుసులోని రైతులు, ఎగుమతిదారులు, ఇతర భాగస్వాములకు ఎగుమతి అవకాశాలు బలపడతాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హైదరాబాద్‌లోని ప్రాంతీయ అథారిటీ అదనపు విదేశీ వాణిజ్య డైరెక్టర్ జనరల్ డాక్టర్ సంపత్ కుమార్ (ఐటీఎస్)తో పాటు, ఇతర అపెడా అధికారులు పాల్గొన్నారు.

వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలకు తాగునీటి కొరత తీరాలి

ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు

పూర్ణాహుతితో ముగిసిన వరుణ సమేత వనదుర్గ మహారుద్ర యాగం

హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త: రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, భూగర్భ జలాలు పెరిగి ప్రజలకు తాగునీటి కొరత తీరడంతోపాటు రైతులకు మేలు జరగాలనే సంకల్పంతో అంబర్‌పేట శ్రీ మహంకాళి దేవాలయంలో నిర్వహించిన శ్రీ వరుణ సమేత శ్రీ వనదుర్గ మహారుద్ర యాగం బుధవారం పూర్ణాహుతితో ముగిసింది. మాజీ ఎంపీ, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు ఆధ్వర్యంలో, బ్రహ్మశ్రీ అనంతాచార్యుల నేతృత్వంలో మూడు రోజులపాటు ఈ యాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వి. హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి భూగర్భ జలాలు పెరగాలని, ప్రతి ఒక్కరికీ తాగునీరు అందుబాటులోకి రావాలనే ఆశయంతో ఈ యాగానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రజలకు తాగునీరు, ఆహారానికి కొరత లేకుండా చూడాలని, రైతులకు మేలు జరగాలని, రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. వర్షాభావ పరిస్థితులు తొలగి, ఎల్‌నినో ప్రభావం తగ్గి



అంబర్‌పేట మహంకాళి ఆలయంలో వరుణ సమేత వనదుర్గ మహారుద్ర యాగం చేస్తున్న ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు

సమృద్ధిగా వర్షాలు కురవాలనే సంకల్పంతో యాగాన్ని నిర్వహించినట్లు వివరించారు. యాగం ముగింపు సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు గడువును మరో నాలుగు వారాలు పొడిగించాలి

సిఇఒకు పులిపాటి రాజేశ్‌కుమార్ వినతిపత్రం

హైదరాబాద్, అక్టోబరు 28,ప్రభాతవార్త: శాసన మండలి లోని ఖాళీ అవుతున్న రెండు పట్టభద్రుల నియోజకవర్గాలకు జరిగే ఎన్నికలల్లో ఓటర్ల నమోదు గడువు పెంచాలని మహబూబ్ నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్- ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్ర ఓటర్ల నమోదు ప్రక్రియను మరింత సులభతరం చేయాలని కోరుతూ, తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డిని కలిసిన టిపిసిసి ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ పులిపాటి రాజేష్ కుమార్, ఎస్ఐఆర్ రాష్ట్ర కోఆర్డినేటర్ గంప వేణుగోపాల్ కోరారు. ఈ సందర్భంగా వారు సుదర్శన్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. నవంబర్ 6వ తేదీ గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుకు చివరి తేదీగా ఉన్న నేపథ్యంలో, అనేక మంది అర్హులైన పట్టభద్రులు అవగాహన లోపం, అవసరమైన పత్రాల సేకరణలో ఇబ్బందులు, ధృవీకరణ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యల కారణంగా గడువులోగా నమోదు చేసుకోలేకపోయే అవకాశం ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు గడువును కనీసం మరో నాలుగు వారాలు పొడిగించాలని కోరారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా

కలలకు ఊపిరి పోయండి.. మత్తుకు కాదు

2029 నాటికి నషా ముక్త్ తెలంగాణే

లక్ష్యం : గవర్నర్ శివప్రతాప్ శుక్లా

హైదరాబాద్ (తార్నాక), అక్టోబరు 28, ప్రభాతవార్త : యువత మాదకద్రవ్యాల మత్తులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని గవర్నర్ శివప్రతాప్ శుక్ల పిలుపునిచ్చారు. 2029 నాటికి తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బుధవారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రెడ్‌క్రాస్ సొసైటీ, ఓ.యూ ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా నిర్వహించిన నషా ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశ సమయంలోనే విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించాలని ప్రభుత్వానికి సూచించినట్లు తెలిపారు.మాదకద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తుతోపాటు కుటుంబాలను దెబ్బతీస్తుందన్నారు. వ్యసనానికి గురైన వారిని దూరం పెట్టకుండా, వైద్యం, కౌన్సెలింగ్ ద్వారా తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావాలని సూచించారు. నవంబరు 14 నుంచి జనవరి 12 వరకు 60 రోజులపాటు విద్యాసంస్థల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఈ ఉద్యమాన్ని విస్తరించాలని పిలుపునిచ్చారు.తెలంగాణలో రెడ్‌క్రాస్ సభ్యత్వం 1.28 లక్షలు దాటిందని, యువతలో సేవాభావం, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు సంస్థలు సమన్వయంతో పనిచేయాలని గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిశోర్ అన్నారు. కార్యక్రమంలో ఓయూ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, రెడ్‌క్రాస్, ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు. గవర్నర్ మాదకద్రవ్య వ్యతిరేక పోస్టర్లు, స్టిక్కర్లను ఆవిష్కరించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఠాగూర్ ఆడిటోరియం నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు అవగాహన ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో గవర్నర్ సంయుక్త కార్యదర్శి కొమందూరు శశికిరణ్, తెలంగాణ ప్రధాన కార్యదర్శి శ్రీరాములుతో పాటు పలువురు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త: నిజామాబాద్ జిల్లాలో ఒక వ్యక్తిని హత్య చేసిన నిందితు డికి జీవిత ఖైదుతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ సెషన్స్ కోర్టు బుధవారం తీర్పు ఇచ్చింది. వివరాలు ఇలావున్నాయి. 2024 జూన్ ఆరవ తేదీన ఉదయం ఆరు గ ంటలకు కొత్తపేట మల్కాపూర్ గ్రామ నివాసి తాటిపాముల శివప్రసాద్ గౌడ్ గుడికి వెళుతుండగా మార్గమధ్యన నర్సాగౌడ్ అనే వ్యక్తి ఎదురు వ చ్చాడు. వీరిమధ్య గొడవ జరిగింది. ఈ సమయంలో నర్సాగౌడ్‌ను శివప్రసాద్ గౌడ్ కర్రతో కొట్టాడు. దీంతో ఆగ్రహం చెందిన నర్సా గౌడ్ అదే రోజు మధ్యాహ్నం శివప్రసాద్ గౌడ్ ఇంటికి వెళ్లి అతన్ని ఇష్టం వచ్చినట్లు కొట్టాడు. ఈ దాడిలో శివప్రసాద్ గౌడ్ తీవ్రంగా గాయపడగా అతన్ని వెంటనే ఆసుపత్రిలో చేర్పించారు.

రెండు రోజుల తరువాత అతను మరణించాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేబట్టి నింది తుడు నర్సాగౌడ్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు. అనంతరం అతనిపై ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణ రెండేళ్లకు పైగా జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ జరిగింది. దీనిపై సెషన్స్ కోర్టు న్యాయమూర్తి భారత లక్ష్మీ తీర్పు చెబుతూ నిందితుడు నర్సాగౌడ్‌కు జీవిత ఖైదుతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధించారు. ఈ కేసులో పిపిగా రాజేశ్వరరావు వ్యవహరించారు. హత్య కేసులో నిందితుడికి జీవిత ఖై దు పడేలా చేసిన పోలీసు సిబ్బందిని పోలీసు కమిషనర్ సాయి చైతన్య అభినందించారు.



ప్రసంగిస్తున్న తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

జాతీయ కులగణనలో ఒబిసి కాలమ్ చేర్చాలి

తమిళనాడు తరహాలో అసెంబ్లీలో తీర్మానం చేయాలి

సముచిత వాటా దక్కాలంటే బిసిల జనాభా లెక్క తేలాలి

టిఆర్ఎస్ బిసి డిక్లరేషన్ సభలో కల్వకుంట్ల కవిత

హైదరాబాద్ (చిక్కడపల్లి) అక్టోబరు 28, ప్రభాతవార్త : త్వరలో చేపట్టనున్న జాతీయ కులగణనలో బీసీ, ఓబీసీల కోసం ప్రత్యేక కాలమ్‌తో పాటు డ్రాప్ డౌన్ బాక్స్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత కేంద్రాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్ లో నిర్వహించిన ఖిటి ఆర్ ఎస్ బిసి డిక్లరేషన్ సభఖిలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఓబీసీ కాలమ్ ఏర్పాటుపై తమిళనాడు ప్రభుత్వం మాదిరిగానే తెలంగాణ ప్రభుత్వం కూడా వెంటనే శాసనసభ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి తీర్మానం ఆమోదించాలని కవిత కోరారు. ఒకవేళ ప్రభుత్వం ఈ తీర్మానం చేయకపోతే రాష్ట్రంలో కులగణనను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ విషయంలో పార్టీలకతీతంగా తెలంగాణ ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తామని ఆమె స్పష్టం చేశారు. మనం మన రాబోయే తరాలకు ఇచ్చే అత్యంత విలువైన ఆస్తి రిజర్వేషన్లు సాధించి పెట్టడమే. ఆస్తి ఉంటే అది రెండు తరాలకు మాత్రమే ఉపయోగపడుతుంది, కానీ రిజర్వేషన్లు దక్కితే తరతరాలకు మేలు జరుగుతుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్లను పూర్తిగా ఎత్తివేసే కుట్ర చేస్తోంది. ఈ కుట్రను తిప్పికొట్టేందుకు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలన్నీ ఐక్యమై పోరాడాల్సిన అవసరం ఉంది. బీసీల హక్కుల కోసం పోరాడిన రామ్ మనోహర్ లోహియా, కాన్షీరాం, కర్పూరీ ఠాకూర్, ములాయం సింగ్ యాదవ్‌లతో పాటు ప్రాణాలర్పించిన జగదేవ్ ప్రసాద్ కుశ్వా సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలోనే ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఖిసామాజిక తెలంగాణఖి కోసం దిశానిర్దేశం చేశారని గుర్తుచేశారు. దేశంలో ప్రతి ఏటా సుమారు ..50 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెడుతుంటే, అందులో బీసీ సంక్షేమానికి కనీసం ..2,000 కోట్లు కూడా ఖర్చు చేయడం లేదని కవిత విమర్శించారు. బీసీల ఖచ్చితమైన జనాభా గణాంకాలు బయటకు వస్తేనే, జనాభా ప్రాతిపదికన చట్టసభల్లోనూ, ఉద్యోగాల్లోనూ తగిన వాటా దక్కుతుందన్నారు. గతంలో మహిళా రిజర్వేషన్ బిల్లు సాధన కోసం ఢిల్లీ వేదికగా పోరాటం చేసినట్లే, ఇప్పుడు ఓబీసీ కులగణనలో ప్రత్యేక కాలమ్ సాధించే వరకు ఢిల్లీలో పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఆంధ్రా సరిహద్దు జిల్లాలపై అర్నాబ్ ప్రభావం



చేతికందివచ్చిన పంటపై రైతుల్లో ఆందోళన

నేడు కూడా భారీ వర్షాల హెచ్చరిక

హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను అర్నాబ్ ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిశాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ సరిహద్దు జిల్లాల్లో భారీగా వర్షాలు కురవడంతో రైతాంగంలో తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు, వర్షాలు పడ్డాయి. రాష్ట్రంలోని ఖమ్మం, కొత్తగూడెం, ములుగు, సూర్యాపేట, నల్గొండ వంటి తూర్పు, దక్షి ణ జిల్లాల్లో మధ్యాహ్నం నాటికి 10 మిమీ మరియు 21.3 మిమీ మధ్య వర్షపాతం నమోదైంది. ఉదయం 9 గంటల తర్వాత ఖమ్మం జిల్లాలోని పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. భారత వాతావరణ శాఖ నివేదికల ప్రకారం రాష్ట్రంలోని 8 జిల్లాల్లో ప్రధానంగా వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో ఎక్కువ వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా ఆంధ్రా సరిహద్దుకు దగ్గరగా ఉన్న తూర్పు తెలంగాణ జిల్లాలైన ఖమ్మం, కొత్తగూడెం తదితర జిల్లాల్లో వర్షం తీవ్రత ఎక్కువగా ఉంది. అలాగే సూర్యాపేట, నల్గొండ, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఈ మోస్తరు వర్షాలు పడ్డాయి. వర్షం కారణంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు స్వల్ప ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు చాలా రోజుల తర్వాత వర్షం కురుస్తుండటంతో జిల్లా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పంటలు చేతికొస్తున్న తరుణంలో వర్షంతో రైతుల్లో ఆందోళన కాగా పంటలుచేతికొచ్చే సమయంలో వర్షాలు కురుస్తుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. రాష్ట్రంలో ప్రస్తుతం వానాకాలం సాగుకు సంబంధించి ప్రధాన పంటలైన పత్తి, వరి ప్రస్తుతం కీలక దశలో ఉన్నాయి. పలు చోట్ల వరి కోతలు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న రైతులు వర్షం తీవ్రత పెరిగితే పంటకు నష్టం వాటిల్లుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాల్లో భారీ వర్షాలు కురిస్తే ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. పత్తి రైతుల పరిస్థితి కూడా ఇంచుమించు ఇదే విధంగా ఉంది. పత్తి ఏరుకునే సమయంలో వర్షాలు కురిస్తే పంట నాణ్యత దెబ్బతినడంతోపాటు దిగుబడిపైనా ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పంటలకు చివరి తడి అవసరమైన రైతులకు ఈ వర్షం కొంత ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంది. వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు ఎదుర్కొన్న పంటలకు తగినంత నీరు అందితే మేలు జరుగుతుందని భావిస్తున్నారు. దీంతో ఒకవైపు వర్షం పంటలకు ఉపయోగపడుతుందనే ఆశ ఉన్నప్పటికీ, మరోవైపు కోతకు సిద్ధంగా ఉన్న పంటలు దెబ్బతింటాయేమోననే ఆందోళన నెలకొంది. నేడు రాష్ట్రంలో అధి భారీ వర్షాలు అర్నబ్ తుపాను ప్రభావంతో గురువారం కూడా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

పిఎస్ఆర్ యువ నేస్తం పేరిట ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ప్రారంభం

లక్షలాది నిరుద్యోగులకు మంత్రి పొంగులేటి జన్మదిన కానుక

గతంలో 2,300 మందికి శిక్షణ.. 462 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు

హైదరాబాద్,అక్టోబరు28,ప్రభాతవార్త: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పీఎస్ఆర్ యువ నేస్తం పేరిట ఆన్‌లైన్‌లో ఎన్ని లక్షల మందికైనా ఉచిత శిక్షణ అందించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ప్రతిష్ఠాత్మక ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈరోజు నుంచి ఏడాది పాటు ఈ ఉచిత శిక్షణ ఉంటుందని అవసరమైతే ఈ శిక్షణా కాలాన్ని పొడిగిస్తామని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా బుధవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతీ యువకులకు నాణ్యమైన శిక్షణ అందించి, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన అవకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. గత 30 ఏళ్లుగా ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ ఎంతోమంది ప్రతిభావంతులను తీర్చిదిద్దిందని, ఐఏఎస్ వంటి ఉన్నతస్థాయి ఉద్యోగాలు సాధించేందుకు కూడా అభ్యర్థులకు మార్గనిర్దేశం చేసిందని తెలిపారు. 2013లో రాజకీయాల్లోకి ప్రవేశించి, 2014లో ఎంపీగా ఎన్నికైన అనంతరం 2016లో ఖమ్మం ప్రాంతంలో నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మంత్రి గుర్తుచేశారు. అప్పట్లో సుమారు 2,300 మంది నిరుద్యోగులకు ఆఫ్‌లైన్‌లో శిక్షణ అందించడంతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించినట్లు చెప్పారు. ఆ శిక్షణ పొందిన వారిలో 462 మంది వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు తమ కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేసిన సందర్భాలు తనను ఎంతగానో కదిలించాయని, వారి ఆనందాన్ని చూసి తన కళ్లలో నీళ్లు తిరిగాయని మంత్రి పేర్కొన్నారు. గతంలో ఒక ప్రాంతానికి పరిమితమైన శిక్షణను ఇప్పుడు ఆన్‌లైన్ విధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు.

బిసి కార్పొరేషన్లు, ఫెడరేషన్ల కేటాయింపులేవి?

విడుదలకు నోచని రూ.2,593 కోట్లు బడ్జెట్

హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త బీసీ సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న కార్పొరేషన్లు, ఫెడరేషన్లకు ప్రస్తుత 2026–27 సంవత్సరానికి గాను బడ్జెట్‌లో కేటాయించిన దాదాపు 2,592.93 కోట్లను విడుదల చేయకపోవడం పట్ల బీసీ కమిషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైదరాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో బుధవారం ఛైర్మన్ జి. నిరంజన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. బడ్జెట్‌లో కేటాయించిన నిధులను విడుదల చేయకపోవడం వల్ల వాటిని బీసీల అభ్యున్నతికి ఖర్చు చేయలేకపోవడం శోచనీమని అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆయా కార్పొరేషన్ల ఛైర్మన్లు ఎటువంటి పనులు చేపట్టకుండానే రెండు సంవత్సరాల పదవీ కాలం ముగియడం శోచనీయమని ఈ సమావేశం అభిప్రాయపడింది. రాష్ట్రంలోని కామారెడ్డి, మెదక్ మరియు సంగారెడ్డి జిల్లాలలో ఉన్న లొద్ద కులస్థుల సామాజిక, ఆర్థిక, విద్య మరియు జీవన స్థితిగతులను సెస్ ద్వారా అధ్యయనం చేయించాలని నిర్ణయించిన నేపథ్యంలో దీనికి సంబంధించిన విధివిధానాల గురించి చర్చలు జరిపింది. ముఖ్యంగా సాంప్రదాయ కులవృత్తుల ఆధునీకీకరణ విషయంలో ఆయా కులస్థులు, మేధావుల నుండి సలహాలు, సూచనలు ఆహ్వానించాలని నిర్ణయించింది. మరోపక్క ముదిరాజ్ కులస్థులు కోరుతున్న బిసిడి గ్రూప్ నుండి బిసిఎ గ్రూప్‌కు మార్పు విషయాన్ని ప్రస్తావనకు వచ్చింది. ముదిరాజ్ కులాన్ని బిసిడి నుండి బిసిఎ గ్రూప్‌నకు మార్చడం వల్ల ప్రభావితమయ్యే ఎ గ్రూప్‌లోని 57 కులాలు, డి గ్రూప్‌లోని 34 కులాల గురించి కూడా అధ్యయనం చేసిన తర్వాతే గ్రూప్ మార్పు గురించి ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంటుందని వెల్లడించింది.

చలనచిత్ర విద్య విస్తరణ

ఆప్టెక్, ఎఫ్‌టిఐఐ మధ్య

అవగాహన ఒప్పందం

హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త : దేశవ్యాప్తంగా ఫిల్మ్ విద్య, సృజనాత్మక నైపుణ్యాలను విస్తరించడానికి ప్రయత్నాలు జరుగు తున్నాయి. ఇందుకు అనుగుణంగా వృత్తి విద్యా శిక్షణ, ప్రపంచవ్యాప్త అభ్యాస పరిష్కారాలలో అగ్రగామి అయిన ఆప్టెక్ లిమిటెడ్, దేశవ్యాప్తంగా నాణ్యమైన చలనచిత్ర విద్య మరియు సృజనాత్మక నైపుణ్యాల విస్తరణకు ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియాతో హైదరాబాద్‌లో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ సహకారం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ఆప్టెక్ నెట్‌వర్క్ ద్వారా వర్క్‌షాప్‌లు, మైక్రోక్రెడెన్షియల్స్, ప్రత్యేక సర్టిఫికేషన్‌లను సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఫిల్మ్‌మేకింగ్ ప్రోగ్రామ్ అందించ బడతాయి. ఈ భాగస్వామ్యం, అకడమిక్ నైపుణ్యాన్ని, గొప్ప సినిమా వారసత్వాన్ని, మీడియా ఎంటర్‌టైన్‌మెంట్, సృజనాత్మక వృత్తులు, ఎకోసిస్టమ్ రంగాలను ఒకచోట చేర్చుతుంది. దీనికి తోడు, పాఠ్యప్రణాళిక అభివృద్ధిలో ఆప్టెక్‌కు ఉన్న నైపుణ్యం మరియు సుస్థిరమైన, విస్తృతమైన శిక్షణా నెట్‌వర్క్ కూడా దీనికి తోడవుతాయి.

రెడ్కో ఎండిగా జితేశ్ బాధ్యతలు స్వీకరణ

హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త తెలంగాణ సాంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో) వైస్‌ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా జితేశ్ పాటిల్ బాధ్యతలు స్వీకరించారు. ఐఏఎస్‌ల బదిలీలు, అదనపు బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసిన అదే రోజునే హైదరాబాద్‌లోని సాంప్రదాయేతర ఇంధనవనరుల సంస్థ కార్యాలయంలో ఈ బాధ్యతలను చేపట్టారు. కాగా ప్రస్తుతం జితేష్ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండిగా వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు తాజాగా రెడ్కో ఎండిగా పూర్తి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది.

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు మరమ్మతులు చేపట్టాం


కృష్ణా జలాల వినియోగంపై బిఆర్ఎస్ మాటలు అవాస్తవం: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్,అక్టోబరు28,ప్రభాతవార్త: కృష్ణా జలాల వినియోగంపై బీఆర్ఎస్ మాటలు అవాస్తవం. అఖిలపక్ష భేటీలో కృష్ణా జలాల వినియోగంపై వాస్తవాలు వెల్లడించా అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు శ్రీశైలం నుంచి తెలంగాణ 127.57 టీఎంసీలు వాడుకుంది. ఇప్పటివరకు శ్రీశైలం నుంచి ఏపీ 72.237 టీఎంసీలు వాడుకుంది. నాగార్జునసాగర్‌లో తెలంగాణ వినియోగం 41.908 టీఎంసీలు. నాగార్జున సాగర్‌లో ఏపీ 17.207 టీఎంసీలు వాడుకున్నది అని వివరించారు. 'మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు మరమ్మతులు చేపట్టాం. కేంద్ర జల్‌శక్తి సాంకేతిక కమిటీ మార్గదర్శకాల ప్రకారమే మరమ్మతులు' అని పేర్కొన్నారు. 'మరమ్మతులు పూర్తయ్యేవరకు గేట్లు దించొద్దని ఎన్‌డీఎస్‌ఏ చెప్పింది. మేడిగడ్డ గేట్లు దించకుండా నీరు ఎత్తిపోసి నిల్వ చేయడం సాధ్యం కాదు' అని చెప్పారు. మేడిగడ్డ కుంగడానికి లోపభూయిష్టమైన డిజైన్, నిర్మాణమే కారణం. అన్నారం, సుందిళ్లను కూడా వినియోగించవద్దని ఎన్‌డీఎస్‌ఏ చెప్పింది' అని చెప్పారు. మేడిగడ్డ కూలిపోవడంతో ప్రాణహిత వరద నిల్వ చేయలేకపోతున్నాం. ప్రాణహిత వరద నిల్వ చేయలేకపోవడంతో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది' అని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

రాష్ట్ర సర్కార్‌కు ఆర్థిక ఉపశమనం

- తాత్కాలిక రుణ పరిమితి మరోసారి పెంపు
- రూ.2,407 కోట్ల నుండి రూ.2,733 కోట్లకు చేరిక
- జనవరిలో రూ.2,300 కోట్ల నుండి రూ.2,407 కోట్లకు పెంపుదల
- ఎక్కువగా అడ్వాన్స్‌లపైనే నెట్టుకొస్తున్న తెలంగాణ ఖజానా
- ఆదాయ, వ్యయాల మధ్య అంతరం తగ్గించే యత్నం

హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త తెలంగాణ ప్రభుత్వ ఖజానాకు వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ లిమిట్‌ను మరోసారి పెంచుతూ రిజర్వ్ బ్యాంకు కీలక నిర్ణయం తీసుకుంది. స్వల్పకాలిక నగదు నిర్వహణలో ఇబ్బందులు పడుతున్న తెలంగాణ ప్రభుత్వానికి పెద్ద ఉపశమనం కల్పిస్తూ వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ (డబ్ల్యూఎంఎ), తాత్కాలిక రుణం పరిమితిని రూ.2,733 కోట్లకు పెంచింది. దీంతో ఇప్పటి వరకూ ఉన్న తాత్కాలిక రుణ పరిమితి రూ.2,407 కోట్ల ఉండగా, అది రూ.2,733 కోట్లకు పెరిగింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించిన సమాచారం ప్రకారం ఈ ఏడాది జనవరి మొదటి వారంలో తాత్కాలిక రుణ పరిమితిని పెంచింది. జనవరిలో ఈ పరిమితి రూ.2,300 కోట్లు ఉండగా, దానికి రూ.107 కోట్లను అదనంగా పెంచి రూ.2,407 కోట్లు చేసింది. తాజాగా ఇప్పుడు మళ్లీ రూ.326 కోట్లు పెంచి వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ లిమిట్‌ను రూ.2,733 కోట్లకు పెంపుదల చేసింది. దీనివల్ల ఆదాయాలు మరియు చెల్లింపుల మధ్య తాత్కాలిక వ్యత్యాసం ఉన్న సమయాల్లో తెలంగాణ ఖజానా నుండి తక్షణ ఖర్చుల అవసరాలను తీర్చగల సామర్థ్యం బలపడుతుంది. ఆర్థిక శాఖ అధికారవర్గాల సమాచారం ఆదాయం మరియు వ్యయం మధ్య స్వల్పకాలిక అంతరాలను పూడ్చడానికి రాష్ట్రం రిజర్వ్ బ్యాంక్ నుండి తీసుకునే అడ్వాన్స్‌లపై ఎక్కువగా ఆధారపడుతోంది. గత కొన్ని సంవత్సరాలుగా తెలంగాణ వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ రుణాలకు సంబంధించినలో పరిమితి గణనీయమైన వృద్ధిని సాధించింది. 2014లో ఈ పరిమితి రూ.550 కోట్లుగా ఉండగా, రాష్ట్ర ఆదాయ ప్రొఫైల్, మూలధన వ్యయం ఆధారంగా 2016లో దీనిని రూ.1,080 కోట్లకు రిజర్వ్ బ్యాంక్ పెంచింది. ఇది దాదాపు 96.4 శాతం పెరుగుదలను సూచిస్తుంది. 2020లో దీనిని మరింతగా రూ. 1,728 కోట్లకు, ఆ తర్వాత 2026లో ప్రస్తుత స్థాయి అయిన రూ.2,407 కోట్లకు చేరుకుంది. ఇప్పుడది రూ.2,733 కోట్లకు పెరుగుదల చోటు చేసుకుంది. కాగా 2022–23 నుండి 2024–25 మధ్య కాలంలో రాష్ట్ర సర్దుబాటు చేసిన రాబడి వసూళ్ల ఆధారంగా, తెలంగాణ డబ్ల్యూఎంఎ పరిమితిని రూ. 2,407 కోట్ల నుండి రూ. 2,733 కోట్లకు, అంటే 13.5 శాతం మేర పెంచాలని రిజర్వ్ బ్యాంక్ వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్ సలహా కమిటీ సిఫార్సు చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రెవెన్యూ వసూళ్లు రూ.1,59,350 కోట్లు, 2023-24లో రూ.1,69,293 కోట్లు, 2024-25లో రూ.1,67,804 కోట్లుగా ఉన్నాయని సలహా కమిటీ లెక్కించింది. ప్రకృతి వైపరీత్యాల ఖర్చుల సర్దుబాటు తర్వాత, సగటు రాబడి రసీదులను పరిగణనలోకి తీసుకోగా రూ.1,65,662 కోట్లుగా తేల్చింది.



రైళ్లలో రాత్రి 11నుంచి ఉదయం 5 వరకూ మొబైల్ చార్జింగ్ బంద్

న్యూఢిల్లీ, అక్టోబరు 28: రైలులో ప్రయాణించే వారికి ముఖ్యమైన సమాచారం. రైళ్లలోని కోచ్‌లలో రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు మొబైల్ ఛార్జింగ్ పాయింట్లను నిలిపివేయాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని రైల్వే బోర్డు ఆదేశించింది. ఈ ఆరు గంటల సమయంలో ఛార్జింగ్ పాయింట్లు పనిచేయకుండా చూడాలని, నిబంధన అమలులో ఎలాంటి మినహాయింపులు ఉండ కూడదని సూచించినట్లు సమాచారం. ఈనెల 26న జారీ చేసిన సూచనల్లో అన్ని జోనల్ రైల్వేలు ఈ నిబంధనను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని బోర్డు పేర్కొన్నది. రైలులో ఛార్జింగ్ సమయంలో ఓ ప్రయాణికుడి పవర్ బ్యాంక్ పేలి, దాని నుంచి పొగ వచ్చిన ఘటన నేపథ్యంలో రైల్వే శాఖ భద్రతా చర్యలను కఠినతరం చేసినట్లు సమాచారం.

ఎఐ బాటలో సాగండి



బుధవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో జరిగిన ఎఐ సాక్షమ్ ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి

ప్రభుత్వ ఉద్యోగులకు డి.సిఎం భట్టి సూచన

ప్రజలకు మరింత చురుగ్గా, వేగంగా సేవలందించాలి

ఆదా అయ్యే సమయం తిరిగి ప్రజలకు అందాలి

'ఎఐ సాక్షమ్' నప్రారంభోత్సవంలో డి.సిఎం భట్టి

హైదరాబాద్,అక్టోబరు28,ప్రభాతవార్త: మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ కృత్రిమ మేధస్సు (ఏఐ)పై అవగాహన పెంపొందించుకుని, తమ రోజువారీ విధుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రణాళికా శాఖ, టీజీ మ్యాథ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న ఏఐ శిక్షణను సద్వినియోగం చేసుకుని, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఏఐ వినియోగం వల్ల ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు వేగవంతం కావడంతోపాటు, సామాన్య ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కారం కావాలి. కార్యాలయాల్లో ఆదా అయ్యే సమయం ప్రజలకు మెరుగైన సేవల రూపంలో తిరిగి అందాలి. ప్రజల జీవితాల్లో కనిపించే సానుకూల మార్పే ఏఐ వినియోగానికి అసలైన గీటురాయి అని స్పష్టం చేశారు. బుధవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో ప్రణాళికా శాఖ సహకారంతో టీజీ మ్యాథ్ చేపట్టిన 'ఏఐ సాక్షమ్' కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి ప్రారంభించి ప్రసంగించారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాలను పెంపొందించి, పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. సాంకేతికతలో వస్తున్న మార్పులను ఉద్యోగులు ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని, శిక్షణ ద్వారా నేర్చుకున్న నైపుణ్యాలను ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ఉపయోగించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రోజువారీగా నిర్వహించే పనులను మరింత వేగంగా, సమర్థంగా పూర్తి చేసేందుకు ఏఐ సాధనాలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులను గుర్తించడం, నివేదికలను రూపొందించడం, సమాచారాన్ని విశ్లేషించడం, ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరాలు అందించడం వంటి పనుల్లో ఏఐ ద్వారా సమయం ఆదా చేయవచ్చన్నారు. శిక్షణలో ఉద్యోగులు చురుగ్గా పాల్గొని, తమ విధులకు అనుగుణంగా ఏఐ సాధనాలను ఉపయోగించే పద్ధతులను నేర్చుకోవాలని కోరారు. ఒక రైతు దరఖాస్తు త్వరగా పరిష్కారం కావడం, పింఛనుదారుడికి తనకు అందాల్సిన ప్రయోజనాలపై స్పష్టమైన సమాచారం లభించడం, ఒక పౌరుడు తన పని కోసం పదేపదే ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం తగ్గడం వంటి మార్పులు సాంకేతికత వినియోగం ద్వారా సాధ్యపడాలని పేర్కొన్నారు.

డిజిటల్ దోపిడీ కేసులు ఒకే చోటికి విలీనంపై సుప్రీం ఫైర్


బాధితులకు సత్వర న్యాయంకోసమే సుప్రీం బెంచ్

న్యూఢిల్లీ, అక్టోబరు 28: దేశవ్యాప్తంగా పెరుగుతున్న సైబర్ నేరాలు, ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్ మోసాలపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర స్థాయిలో స్పందించింది. ఇలాంటి ఆన్‌లైన్ నేరాలను డిజిటల్ దోపిడీగా ధర్మాసనం అభివర్ణించింది. నిందితుల సౌలభ్యం కోసం వేర్వేరు రాష్ట్రాల్లో నమోదైన కేసులను ఒకచోటికి విలీనం చేయడానికి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మల్య బాగ్చి, జస్టిస్ వి.మోహన త్రిసభ్య ధర్మాసనం నిరాకరించింది. దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో తమపై నమోదైన 35 క్రిమినల్ కేసులను ఒకచోటికి క్లబ్ చేయాలని కోరుతూ గౌరబ్ కుమార్ సాహా, నిధి భండారి అనే నిందితులు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. నిందితుల సౌలభ్యం కోసం నష్టపోయిన బాధితులు, దర్యాప్తు సంస్థల హక్కులను కాలరాయలేమని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది.

ప్రస్తుతం ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, తెలంగాణ, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో ఈ 35 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. సీనియర్ సిటిజన్లే టార్గెట్‌గా డిజిటల్ అరెస్ట్ పేరిట సాగుతున్న సైబర్ నేరాలపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి నేరాలకు పాల్పడేవారికి ఎలాంటి న్యాయపరమైన వెసులుబాటు ఇవ్వబోమని స్పష్టం చేశారు.

హెచ్‌సిఎకు కొత్త పాలక మండలిని ఎన్నుకోవాలి

సింగిల్ మ్యాన్ కమిటీకి హెచ్‌సిఎ సభ్యులు విజ్ఞప్తి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న హెచ్‌సిఏ సభ్యులు, మాజీ క్రికెటర్లు అర్షద్ ఆయూబ్, శివలాల్‌యాదవ్ తదితరులు

హైదరాబాద్, అక్టోబరు 28,ప్రభాతవార్త: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) ప్రస్తుత కమిటీ పదవీకాలం ముగియడంతో హెచ్‌సిఎ సభ్యులు, మాజీ టెస్ట్ క్రికెటర్లు అర్షద్ అయూబ్, శివలాల్ యాదవ్, జాన్ మనోజ్ ప్రత్యేక సర్వసభ్య సమావేశం (ఎస్‌జిఎం) వార్షిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించేందుకు తెలంగాణ హైకోర్టు నియమించిన సింగిల్ సభ్యుడిని అనుమతి కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ పదవీకాలం ముగియడంతో సంఘం సజావుగా సాగాలంటే కొత్త పాలకవర్గం ఏర్పాటు తప్పనిసరి అని హెచ్‌సీఏ వ్యవహారాలను పర్యవేక్షి స్తున్న రిటైర్డ్ న్యాయమూర్తి నవీన్‌రావుకు తమ విజ్ఞప్తిని సమర్పించినట్లు తెలిపారు. హెచ్‌సిఏకి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకోవాలంటే ఎస్‌జిఎం, ఎజిఎం నిర్వహించడం చాలా అవసరమని వారు నొక్కి చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా, 2022 ఉత్తర్వుల ప్రకారం అసోసియేషన్ రాజ్యాంగంలో కొన్ని సవరణలు చేయాల్సి ఉంటుందని కౌన్సిలర్ల సంఖ్య పెంపు, సెలెక్టర్లకు అవసరమైన అర్హత ప్రమాణాలు వంటి అంశాలను కూడా ఎస్‌జిఎంలో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. వాస్తవానికి ఏజీఎం జూన్ 21వ తేదీన జరగాల్సి ఉండగా అందుకు సంబంధించిన ప్రాథమిక ప్రక్రియలు పూర్తికాకపోవడంతో నిర్వహించలేకపోయామన్నారు.


విద్యుత్ పంపిణీలో సవాళ్లు, సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆవిష్కరణలు

జైపూర్‌లో డిస్ట్రిబ్యూషన్ యుటిలిటీ మీట్ తీర్మానం

హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త విద్యుత్ పంపిణీ రంగంలో ఎదురవుతున్న సవాళ్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆవిష్కరణలు, ఉత్తమ విధానాలపై చర్చించేందుకు రెండు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి సదస్సు బుధవారంతో ముగిసింది. రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహించిన 10వ డిస్ట్రిబ్యూషన్ యుటిలిటీ మీట్ అండ్ ఎగ్జిబిషన్–2026లో తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. జైపూర్ విద్యుత్ వితరణ్ నిగమ్ లిమిటెడ్, ఆల్ ఇండియా డిస్కామ్స్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన ఈ సదస్సులో దేశవ్యాప్తంగా విద్యుత్ పంపిణీ సంస్థల ఉన్నతాధికారులు, విధాన నిర్ణేతలు, విద్యుత్ నియంత్రణ సంస్థల ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు, పరిశ్రమల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని విద్యుత్ పంపిణీ రంగ భవిష్యత్ అవసరాలపై చర్చించారు. ఈ సదస్సులో విద్యుత్ పంపిణీ సంస్థల ఆర్థిక బలోపేతం, మూలధన మార్కెట్లకు సిద్ధం కావడం, అధునాతన డేటా విశ్లేషణ, స్మార్ట్ మీటర్ల డేటా నిర్వహణ, కృత్రిమ మేధస్సు ఆధారిత డేటా సెంటర్లు, ఎలక్ట్రిక్ వాహనాల వల్ల పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా పంపిణీ వ్యవస్థలను సిద్ధం చేయడం వంటి కీలక అంశాలపై పలు తీర్మానాలు చేశారు.

అదేవిధంగా, పంపిణీ నెట్‌వర్క్‌ల సామర్థ్యాన్ని పెంచే పరిష్కారాలు, వాతావరణ మార్పులు మరియు ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే విద్యుత్ వ్యవస్థల అభివృద్ధి, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, సైబర్ భద్రత, విద్యుత్ పంపిణీ వ్యవస్థల డిజిటలైజేషన్ వంటి అంశాలకు ప్రాధాన్యత నిచ్చారు. ఈ సదస్సు వివిధ విద్యుత్ పంపిణీ సంస్థల మధ్య అనుభవాలు, సాంకేతిక పరి జ్ఞానం, ఉత్తమ నిర్వహణ విధానాలను పరస్పరం పంచుకునేందుకు మంచి అవకాశాన్ని కల్పించింది.

హాంగ్ దిశగా ఇజ్రాయెల్



నెతన్యాహు వ్యతిరేక పవనాలు

ప్రతిపక్ష కూటమికి స్వల్ప ఆధిక్యత

టెల్ అవీవ్, అక్టోబరు 28: ఇజ్రాయెల్లో 2026 ఎన్నికలకు సంబంధించిన ప్రాథమిక ఎగ్జిట్ పోల్స్‌లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ లభించే సూచనలు కనిపించ లేదు. ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుకు చెందిన లికుడ్ పార్టీ అతిపెద్ద ఏకైక పార్టీగా అవతరించే అవకాశం ఉండగా, గాడి ఐసెన్కోట్ నేతృత్వంలోని ప్రతిపక్ష కూటమి అంచనా స్థానాల్లో స్వల్ప ఆధిక్యత సాధించినట్లు ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. 120 మంది సభ్యులున్న ఇజ్రాయెల్ పార్లమెంట్ (నెసెట్)లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన 61 స్థానాల మెజారిటీకి ఇరు పక్షాలూ దూరంగానే ఉన్నాయి. అరబ్ నేతృత్వంలోని పార్టీలు కూడా ఈ ఎన్నికల్లో గణనీయమైన స్థానాలు సాధించే అవకాశం ఉందని అంచనాలు సూచిస్తున్నాయి. వివిధ ఎగ్జిట్ పోల్స్ ప్రకారం, ఈ పార్టీలకు 16 నుంచి 18 స్థానాలు దక్కవచ్చని తెలుస్తోంది. దీంతో తదుపరి ప్రభుత్వ ఏర్పాటులో ఈ పార్టీల మద్దతు కీలకంగా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం వెలువడిన ఫలితాలు ప్రాథమిక అంచనాలు మాత్రమే. కేంద్ర ఎన్నికల కమిటీ ఓట్ల లెక్కింపును ప్రారంభించింది. తుది అధికారిక ఫలితాల్లో ఈ అంచనాలు మారే అవకాశం ఉంది. ఛానల్ 12 ఎగ్జిట్ పోల్ అంచనాల ప్రకారం, ప్రతిపక్ష కూటమికి 52 స్థానాలు, నెతన్యాహు కూటమికి 50 స్థానాలు లభించవచ్చు. అరబ్ నేతృత్వంలోని పార్టీలు మొత్తం 18 స్థానాలు సాధించే అవకాశం ఉంది. ప్రభుత్వ ఏర్పాటుపై జరిగే చర్చల్లో ఈ పార్టీల పాత్ర కీలకం కానుంది. నెతన్యాహు నేతృత్వంలోని లికుడ్ పార్టీ 24 స్థానాలతో అతిపెద్ద ఏకైక పార్టీగా నిలవవచ్చని అంచనా.

రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది:

కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ రావు ధ్వజం

హైదరాబాద్,అక్టోబరు28,ప్రభాతవార్త: మూసీ నది ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకాకుండా బీఆర్ఎస్ నేతలను గృహనిర్బంధం చేశారని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పాలన సాగిస్తూ, ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. వాలంతరిలో మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ జరగాల్సి ఉంది. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి సిద్ధమైన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆమె కుమారుడు కార్తీక్ రెడ్డిలను పోలీసులు శ్రీనగర్ కాలనీలోని వారి నివాసంలో గృహ నిర్బంధం చేశారు. తెల్లవారుజాము నుంచే వారి ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించి, బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఈ ఘటనపై హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. "కరవుతో రైతులు అల్లాడుతుంటే ఆదుకోవడం చేతకాని ప్రభుత్వం, రూ. 1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన పేరుతో కమిషన్ల కోసం ప్రాజెక్టులు చేపడుతోంది" అని ఆరోపించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ, ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్నించారు.

మూసీ ప్రక్షాళన ముసుగులో జరుగుతున్న దోపిడీ యత్నాలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందని, కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా అరెస్టులను ఖండించారు. ఇది అప్రజాస్వామిక చర్య అని,

మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు అండగా నిలుస్తున్నందుకే తమను అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు.

గృహ నిర్బంధంలో ఉన్న బీఆర్ఎస్ నేతలను తక్షణమే విడుదల చేయాలని పార్టీ తరపున డిమాండ్ చేశారు.

ఎపికి సాయం చేసేందుకు ముందుకొచ్చిన తెలంగాణ

- ఎపి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్ చేసిన డిప్యూటీ సిఎం భట్టి
- విద్యుత్ పునరుద్ధరణ పనులకు సిబ్బంది, సామగ్రి పంపుతామని హామీ
- టిఎస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి గొట్టిపాటి

హైదరాబాద్,అక్టోబరు28,ప్రభాతవార్త: అర్నబ్ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఏపీలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు, ముఖ్యంగా విద్యుత్ పునరుద్ధరణ పనులకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తుపాను తీవ్రత, ఏపీలో జరిగిన నష్టం గురించి భట్టి విక్రమార్క ఆరా తీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో నష్టాన్ని తగ్గించడానికి, వీలైనంత త్వరగా పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి చేపడుతున్న చర్యలను మంత్రి గొట్టిపాటి ఆయనకు వివరించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, ప్రజల భద్రత కోసం తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి తెలిపారు. ఈ కష్టకాలంలో ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం అవసరమైతే సిబ్బందిని, అవసరమైన సామగ్రిని పంపడానికి సిద్ధమన్నారు.

బిఆర్ఎస్‌కు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత ఉందా?

కేంద్రంలో నిరసనలకు ఆటంకం కల్పిస్తున్న వారే రాష్ట్రంలో పాదయాత్రలు చేస్తున్నారు

ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్,అక్టోబరు28,ప్రభాతవార్త: ప్రజాస్వామ్యం, నిరసన తెలిపే హక్కుల గురించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు గతంలో తమ పాలనలో అనుసరించిన విధానాలను ఒకసారి గుర్తు చేసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ప్రధాన ప్రతిపక్షంగా చెప్పుకునే బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్న తీరు, వారి భాష, హావభావాలు బాధాకరంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. గతంలో నిరసనలు, ధర్నాలకు అవకాశం లేకుండా ఇందిరాపార్క్‌లో ధర్నా చౌక్‌ను ఎత్తివేసిన వారే ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సచివాలయంలో బుధవారం మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధర్నాచౌక్‌ను పునరుద్ధరించి, ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసేందుకు అవకాశం కల్పించిందని తెలిపారు. గతంలో నిరసన తెలిపిన వారిని అణచివేయడం, నోరు మూయించే ప్రయత్నాలు చేయడం వంటి చర్యలకు పాల్పడినవారు ఇప్పుడు తమపై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించుకోవాలని హితవు పలికారు. నవంబర్ 2న హైదరాబాద్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పాదయాత్రపై మంత్రి స్పందిస్తూ కేంద్రంలో నిరసనలకు ఆటంకాలు కల్పిస్తూ, తెలంగాణలో పాదయాత్రలు చేపట్టాలని బీజేపీ నాయకులు భావించడం ఏమిటని ప్రశ్నించారు.

ఫిఫా ప్రపంచ కప్‌లో భారత్ ఓటమి



హోండురాస్ చేతిలో 1-2 తేడాతో పరాజయం

బాకు: హోవ్‌సాన్ కాంపిటీషన్ కాంప్లెక్స్‌లో బుధవారం జరిగిన ఫీఫా అండర్15 ప్రపంచ కప్ టైర్ సి రౌండ్ ఆఫ్ 32లో భారత్, హోండురాస్ చేతిలో 1-2 తేడాతో ఓటమి చవిచూసింది. మ్యాచ్ ప్రారంభ దశలో ఇరు జట్లు కొద్దిసేపు బంతిని తమ ఆధీనంలో ఉంచుకున్నప్పటికీ, హోండురాస్ క్రమంగా హై ప్రెస్‌తో భారత్ యొక్క ఆటను అడ్డుకుంది. తొలి అర్ధభాగంలో రొనన్‌దేవ్ అహీబామ్, నారా మీటీ లౌషంబామ్‌ల ద్వారా భారత్ రెండు మంచి అవకాశాలను సృష్టించుకుంది. నాలుగో నిమిషంలో, రొనన్‌దేవ్ షాట్ ప్రయత్నించగా, బంతి క్రాస్‌బార్ పైనుంచి వెళ్లిపోగా, 15వ నిమిషంలో నారా కొట్టిన ఫ్రీకిక్ కూడా తృటిలో లక్ష్యాన్ని చేరలేదు. గోల్ కీపర్ చేసిన పొరపాటును సద్వినియోగం చేసుకున్న హోండురాస్ (18వ నిమిషంలో) ప్రతిష్టంభనను బద్దలు కొట్టింది. భారత గోల్ కీపర్ జెనిట్ నింగ్తౌజామ్ తప్పుగా ఇచ్చిన పాస్‌ను డానియో ఫ్లోర్స్ అడ్డుకుని గోల్ చేసి సెంట్రల్ అమెరికన్లను ఆధిక్యంలోకి తీసుకువచ్చాడు. విరామం తర్వాత హోండురాస్ భారత రక్షణ శ్రేణిపై ఒత్తిడి కొనసాగించింది. రొనన్‌దేవ్ (31వ) స్కోరును సమం చేయడంతో భారత్ పట్టుదల ఫలించింది. ఆర్. లాల్‌రెమ్‌రువాట్‌ఫెలా రొనన్‌దేవ్‌కు బంతిని అందించి దాడిని ప్రారంభించాడు. పునరాగమనాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంతో భారత్ రెండో గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించింది. హోండురాస్ (37వ) మళ్లీ ఆధిక్యం సాధించడంతో, చేజారిన అవకాశాలకు భారత్ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. జోస్యూ లినారెస్ బైలైన్ పంపిన బంతిని అలెజాండ్రో అమేయా గోల్‌గా మలిచాడు. ఆఖరి క్షణాల్లో స్కోరును సమం చేయడానికి భారత్ చివరి ప్రయత్నం చేసింది. నారా దూరం నుండి కొట్టిన షాట్ ఆశాజనకంగా కనిపించినప్పటికీ, బంతి క్రాస్‌బార్‌ను తాకింది. దీంతో బ్లూ కోల్ట్స్ జట్టు డ్రా సాధించే అవకాశాన్ని తృటిలో కోల్పోయింది.

ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్: ఆదిత్యకు స్వర్ణం, మేఘూకు రజతం



మాంటెనెగ్రో: 2026 ప్రపంచ బాక్సింగ్ అండర్19 ఛాంపియన్‌షిప్‌లో ఆదిత్య పురుషుల 55 కేజీల ఛాంపియన్‌గా నిలవగా, భారత్ ఒక స్వర్ణం, ఒక రజతం, రెండు కాంస్య పతకాలను కైవసం చేసుకుంది. ఆసియా అండర్19 రజత పతక విజేత అయిన ఆదిత్య, తొలి రౌండ్‌లో స్వల్ప తేడాతో ఓడిపోయినప్పటికీ పుంజుకుని, మాంటెనెగ్రోలోని బుద్వాలో బుధవారం జరిగిన తుది పోరులో రష్యాకు చెందిన ఇస్లాం మగోమెడోవ్‌ను 4-1 తేడాతో ఓడించాడు. వరల్డ్ బాక్సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీకి ఇది రెండవ ఎడిషన్ కావడంతో, అతను ఇప్పుడు వరల్డ్ బాక్సింగ్ U19 టైటిల్ గెలుచుకున్న రెండవ భారతీయ పురుష బాక్సర్ అయ్యాడు. ఆ తర్వాత, మహిళల 80 కేజీల ఫైనల్‌లో రష్యాకు చెందిన ఎకటెరినా ఫ్రోలోవా చేతిలో మేఘూ షియోకండ్ ఏకగ్రీవ నిర్ణయంతో ఓడిపోవడంతో, రెండో స్వర్ణం గెలుచుకునే భారత్ అవకాశాలు దెబ్బతిన్నాయి. దీంతో రజత పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అంతకుముందు హర్షిక (మహిళల 65 కేజీలు) మరియు ప్రాచీ టోకాస్ (మహిళల 80+ కేజీలు) తమ తమ సెమీఫైనల్ బౌట్‌లలో ఓడిపోవడంతో భారత్ రెండు కాంస్య పతకాలను గెలుచుకుంది. రష్యా, ఉజ్బెకిస్తాన్, చైనా వంటి దేశాలు చేరడంతో పోటీ స్థాయి పెరగడంతో, గత ఎడిషన్‌లో 17 పతకాలు గెలుచుకున్న భారత్, ఈసారి కేవలం 4 పతకాలే గెలుచుకుంది.





న్యూజిలాండ్‌తో నాలుగో టి20లో..

కిషన్ ఎంట్రీతో వైభవ్‌పై వేటు!

క్లీన్ స్వీప్‌పై కన్నేసిన టీమిండియా.. తుది జట్టులో స్వల్ప మార్పులు

అక్లాండ్ (న్యూజిలాండ్): న్యూజిలాండ్ గడ్డపై వరుస విజయాలతో జోరు మీదున్న టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్దమైంది. అక్లాండ్ వేదికగా ఈ నెల 30న జరగనున్న నాలుగో టీ20లో ఆతిథ్య న్యూజిలాండ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఇప్పటికే ఐదు టీ20ల సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకున్న భారత్ క్లీన్ స్వీప్‌పై కన్నేసింది. మరోవైపు వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైన న్యూజిలాండ్ కనీసం చివరి రెండు మ్యాచ్‌లైనా గెలిచి పరువు కాపాడుకోవాలని భావిస్తోంది. మూడో టీ20లో విధ్వంసకర బ్యాటింగ్‌తో ఏకపక్ష విజయాన్ని అందుకుంది. అయితే నాలుగో టీ20కి టీమిండియా కాంబినేషన్‌లో స్వల్ప మార్పులు జరిగే అవకాశం ఉంది. గాయంతో గత రెండు మ్యాచ్‌లకు దూరంగా ఉన్న ఇషాన్ కిషన్ నాలుగో టీ20తో రీఎంట్రీ ఇచ్చే అవకాశం ఉంది. అదే జరిగితే వైభవ్ సూర్యవంశీపై వేటు పడుతుంది. ఇషాన్ కిషన్ గైర్హాజరీలో వరుసగా రెండు మ్యాచ్‌లు ఆడిన వైభవ్, మూడో టీ20లో విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. కానీ ఇషాన్ కిషన్ రీ ఎంట్రీతో అతను తుది జట్టు నుంచి తప్పుకోవాల్సి పరిస్థితి ఏర్పడింది. సిరీస్ గెలిచిన నేపథ్యంలో వైభవ్‌ను ఆడించాలనుకుంటే సంజూ శాంసన్‌కు రెస్ట్ ఇవ్వవచ్చు. మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ, అక్షర్ పటేల్, నమన్ ధీర్, నితీష్ కుమార్ రెడ్డి మిడిలార్డర్‌లో ఆడనుండగా, భువనేశ్వర్ కుమార్, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. ఈ మ్యాచ్‌కు కూడా టీమిండియా స్పెషలిస్ట్ స్పిన్నర్ లేకుండానే ఆడే అవకాశం ఉంది. న్యూజిలాండ్‌తో నాలుగో టీ20 ఆడే భారత అంచనా జట్టులో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, వైభవ్ సూర్యవంశీ/ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ, నితీష్ కుమార్, నమన్ ధీర్, అక్షర్ పటేల్, భువనేశ్వర్ కుమార్, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్ ఉన్నారు.

జింబాబ్వే ఓటమి... 3-0తో సిరీస్‌ను

క్లీన్ స్వీప్ చేసిన భారత్



వడోదర: వడోదరలో బుధవారం జరిగిన మూడవ మరియు చివరి మ్యాచ్‌లో, షఫాలీ వర్మ 26 బంతుల్లో అర్ధశతకం సాధించి, వన్డేలలో భారత మహిళా బ్యాటర్ చేసిన రెండవ అత్యంత వేగవంతమైన అర్ధశతకాన్ని సమం చేసింది. ఆమెతో పాటు, ప్రతీకా రావల్ కూడా రాణించడంతో భారత్ జింబాబ్వేపై ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించి, సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. 132 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, భారత్ 17 ఓవర్లలో 133/2 స్కోరును సాధించింది. ఓపెనర్ యస్తిక భాటియా రెండో బంతికే డకౌట్ కావడంతో భారత ఇన్నింగ్స్ పేలవంగా ప్రారంభమైంది. ప్రతీక, హర్లీన్ డియోల్ కొంతసేపు ఆడిన తర్వాత, హర్లీన్ 19 బంతుల్లో 19 పరుగులు చేసి అవుటయ్యింది. షఫాలీ, ప్రతీకతో కలిసి బ్యాటింగ్ పునఃప్రారంభించగా, ఈ ఓపెనింగ్ జోడీ తమ విధ్వంసంతో ఛేజింగ్‌పై పట్టు సాధించి, తొలి వికెట్ నష్టాన్ని భరించేందుకు జింబాబ్వేకు సమయం ఇవ్వలేదు. ఆ తర్వాత, నిలకడగా అర్ధశతకం సాధించిన ప్రతీక, షఫాలీకి తోడుగా భారత్ తరఫున మ్యాచ్‌ను స్టైల్‌గా ముగించింది. ప్రతీక 59 నాటౌట్‌తో సిరీస్‌లో తన అద్భుతమైన స్కోరును కొనసాగించగా, షఫాలీ మెరుపు ఇన్నింగ్స్‌తో 33 ఓవర్లు మిగిలి ఉండగానే విజయాన్ని ఖాయం చేసింది. మొదట బ్యాటింగ్ ఎంచుకున్న జింబాబ్వే 39.5 ఓవర్లలో 131 పరుగులకే ఆలౌట్ అయింది. వైష్ణవి ఐదు వికెట్లు చేసి 5-39తో ముగించగా, ఆ తర్వాత సయాలీ సత్ఘరే (2-11) మరియు క్రాంతి గౌడ్ (2-23) చెరో రెండు వికెట్లు తీసి జింబాబ్వే బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చారు. మోడెస్టర్ ముపాచిక్వా 37 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, జోసెఫిన్ న్కోమో 35, చీడ్జా ధురురు 20 పరుగులు చేశారు. పవర్ ప్లేలో మూడు వికెట్లు కోల్పోయిన తర్వాత అతిథి జట్టు తిరిగి గాడిలో పడలేక నిరాశాజనకమైన స్కోరుకే ఆలౌట్ అయ్యింది. ఈ ఫలితంతో భారత్‌కు ఈ పర్యటన విజయవంతంగా ముగిసింది. వారు టీ20ఐ సిరీస్‌ను కూడా గెలుచుకుని, 50 ఓవర్ల ఫార్మాట్‌లో తమ విజయ పరంపరను కొనసాగించారు. జింబాబ్వే ఏ ఫార్మాట్‌లోనూ విజయం సాధించకుండానే ఈ పర్యటనను ముగించింది.



మహిళల ప్రీమియర్ లీగ్-27 వేలం

అత్యధికంగా మోలినెక్స్‌కు రూ.1.10 కోట్లు

కిరణ్: రూ.75 లక్షలు, కమలని: రూ.40 లక్షలు

కొచ్చి: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2027 వేలం ప్రారంభ దశలో ఆస్ట్రేలియా కెప్టెన్ సోఫీ మోలినెక్స్‌ను యూపీ వారియర్స్ బుధవారం ఇక్కడ రూ. 1.10 కోట్లకు దక్కించు కోవడంతో ఆమె అతిపెద్ద కొనుగోలుగా నిలిచింది. గుజరాత్ జెయింట్స్ యువ భారత వికెట్ కీపర్‌బ్యాటర్ జి. కమలినీని ఆమె కనీస ధర అయిన రూ. 40 లక్షలకు దక్కించుకుంది. వేలానికి ముందు ముంబై ఇండియన్స్ చేత విడుదల చేయబడి, 2027 అండర్19 మహిళల టీ20 ప్రపంచ కప్ జట్టులో చోటు దక్కించుకోలేకపోవడంతో భారీ పారితోషికం అందుకుంటుందని విస్తృతంగా అంచనా వేయబడిన కమలినీ, మరే ఇతర ఫ్రాంచైజీ ఆమె కోసం బిడ్ వేయకపోవడంతో ఎలాంటి హడావిడి లేకుండా గుజరాత్ జైయింట్స్‌కు వెళ్లింది. బిబి ఐర్లాండ్‌కు చెందిన సీమ్‌బౌలింగ్ ఆల్‌రౌండర్ ఓర్లా ప్రెండర్‌గాస్ట్‌ను కూడా రూ.30 లక్షలకు దక్కించుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్ భారత బ్యాటర్ కిరణ్ నవగిరేను రూ.75 లక్షలకు దక్కించుకోవడం ద్వారా ఈ వేలంలో తమ మొదటి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. భారత ఆఫ్‌స్పిన్ బౌలింగ్ ఆల్ రౌండర్ స్నేహ్ రాణా, ఆస్ట్రేలియా హార్డ్‌హిట్టింగ్ ఆల్‌రౌండర్ గ్రేస్ హారిస్‌లను కూడా చెరో రూ.30 లక్షల బేస్ ధరకు తీసుకువచ్చింది. తొలి రౌండ్లలో మరికొందరు కూడా అమ్ముడు పోలేదు. భారత్ తరఫున రెండు టీ20లు ఆడిన, వేలంలోకి వచ్చిన తొలి క్రీడాకారిణి అయిన రాఘవీ బిస్ట్‌కు, ఆమె కనీస ధర అయిన రూ.30 లక్షలకు కూడా ఎలాంటి బిడ్‌లు రాలేదు. అలాగే ప్రస్తుతం జింబాబ్వేతో సిరీస్ కోసం భారత వన్డే జట్టులో భాగంగా ఉన్న భారీ షాట్లు కొట్టే మిడిల్‌ఆర్డర్ బ్యాటర్ తేజల్ హసబ్నిస్ కూడా అమ్ముడుపోలేదు.
అలాగే, గుజరాత్ జైయింట్స్ తరఫున ఒక టీ20, ఒక డబ్ల్యూపీఎల్ మ్యాచ్ ఆడిన ఆయుషి సోని కూడా అమ్ముడు పోలేదు. శ్రీలంక కెప్టెన్ చమరి అథపట్టు అమ్ముడుపోలేదు. వేలంలో ఉన్న ఇద్దరు ఇంగ్లీష్ క్రీడాకారిణులలో ఒకరైన ఇంగ్లండ్ బ్యాటర్ సోఫియా డంక్లీ, తన కనీస ధర అయిన రూ. 50 లక్షలకు కూడా అమ్ముడు కాలేకపోయింది.

మార్కెట్లలో జియో జోష్

21.36% ప్రీమియంతో ట్రేడింగ్



ముంబయి, అక్టోబరు 28: భారత క్యాపిటల్ మార్కెట్లలో నేడు ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. దేశంలోనే అతిపెద్ద పబ్లిక్ ఆఫరింగ్‌గా రికార్డు సృష్టించిన జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్, స్టాక్ మార్కెట్లలో ఘనంగా లిస్ట్ అయింది. ముఖేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ అయిన జియో, రూ. 30,213 కోట్ల భారీ ఐపిఒ తర్వాత బిఎస్ఇ, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎన్ఎస్ఇలలో ట్రేడింగ్‌ను ప్రారంభించింది. బిఎస్ఇ, ఎన్ఎస్ఇలలో ఒక్కో షేరు రూ. 1,359 వద్ద లిస్ట్ అయ్యాయి. ఇది ఒక్కో షేరు ఐపిఒ ధర అయిన రూ. 1,119 కంటే 21.36 శాతం ప్రీమియంను సూచిస్తుంది. ఈ ఇష్యూ కోసం సుమారు రూ. 7.3 లక్షల కోట్ల విలువైన బిడ్లు దాఖలవడం విశేషం. ఫలితంగా ఈ ఐపిఒ మొత్తం 22.19 రెట్లు ఓవర్‌సబ్‌స్క్రయిబ్ అయింది. భారత స్టాక్ మార్కెట్ చరిత్రలో అత్యంత ఆసక్తిగా గమనించిన పబ్లిక్ ఆఫరింగ్‌లలో ఒకటిగా ఇది నిలిచింది. ఈ లిస్టింగ్‌తో ఇప్పటివరకు ప్రైవేట్ రంగంలో ఉన్న జియో ప్లాట్‌ఫామ్స్ పబ్లిక్ ట్రేడెడ్ కంపెనీగా రూపాంతరం చెందింది. తద్వారా సంస్థ వృద్ధిలో నేరుగా పాలుపంచుకునే అవకాశాన్ని సాధారణ ఇన్వెస్టర్లకు కల్పించింది. ఈ పబ్లిక్ ఇష్యూ ఈనెల 21న ప్రారంభమై 23న ముగిసింది. ఒక్కో షేరుకు రూ. 1,065 నుంచి రూ. 1,119 మధ్య ధరల శ్రేణిని నిర్ణయించగా, అధిక డిమాండ్ కారణంగా గరిష్ఠ ధర అయిన రూ. 1,119 వద్ద షేర్లను కేటాయించారు. షేర్లు రూ. 1,359 వద్ద లిస్ట్ అయ్యాయి. ఈ ఐపిఒ విజయవంతం కావడంలో సంస్థాగత పెట్టుబడిదారులు కీలక పాత్ర పోషించారు. వారి కోసం కేటాయించిన కోటా 70.55 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయింది. అదే సమయంలో సంస్థాగతేతర పెట్టుబడిదారుల కోటా 14 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల కోటా 2.72 రెట్లు సబ్‌స్క్రిప్షన్‌ను నమోదు చేసింది. టెలికాం, డిజిటల్ సేవల రంగంలో ఉన్న వ్యాపారాలపై పెట్టుబడిదారులకు ఉన్న బలమైన విశ్వాసాన్ని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.


4 నెలల కనిష్టానికి పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధిరేటు

సెప్టెంబరులో 6.7శాతానికి చేరిక




న్యూఢిల్లీ, అక్టోబరు 28: భారతదేశ పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి రేటు సెప్టెంబరులో నాలుగు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయి 6.7 శాతంగా నమోదైంది. అన్ని ప్రధాన రంగాల్లోనూ వృద్ధి మందగించడం ఇందుకు ప్రధాన కారణమని కేంద్ర అర్థగణాంక పథకనిర్వహణ శాఖమోస్పీ వెల్లడించింది. నెలలో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ వృద్ధి 5 శాతంగా నమోదైన తర్వాత ఇదే అత్యల్ప వృద్ధి రేటు. ఆగస్టు నెల పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి అంచనాను గతంలో ప్రకటించిన 8 శాతం నుంచి 7.8 శాతానికి సవరించారు. గత యేడాది సెప్టెంబర్‌లో పారిశ్రామిక ఉత్పత్తి 6.1 శాతం వృద్ధి సాధించింది. నాలుగు ప్రధాన రంగాల్లో మూడు రంగాలు తయారీ, విద్యుత్, గ్యాస్ సరఫరా, నీటి సరఫరా మరియు వ్యర్థాల నిర్వహణ ఆగస్టుతో పోలిస్తే సెప్టెంబర్‌లో మందగించాయి. మైనింగ్, క్వారీయింగ్ రంగాల్లో సంకోచం మరింత తీవ్రం కావడంతో మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీపై ప్రతికూల ప్రభావం పడింది. పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో సుమారు 76 శాతం వాటా కలిగిన తయారీ రంగ వృద్ధి ఆగస్టులో సవరించిన 8.6 శాతం నుంచి సెప్టెంబరులో 7.6 శాతానికి తగ్గింది. మే నెలలో తయారీ రంగం 5.2 శాతం వృద్ధి సాధించిన తర్వాత సెప్టెంబరులో నమోదైన వృద్ధే అత్యల్పం. దీంతో వరుసగా మూడు నెలల పాటు 8 శాతానికి మించి నమోదైన వృద్ధికి తెరపడింది. తయారీ రంగంలోని రెండు అంకెల స్థాయి వర్గీకరణలో ఉన్న 23 పారిశ్రామిక విభాగాల్లో 17 విభాగాలు సెప్టెంబర్‌లో సానుకూల వృద్ధిని నమోదు చేశాయి. వీటిలో ఎనిమిది ఉపవిభాగాలు రెండంకెల వృద్ధిని సాధించాయి. విద్యుత్ పరికరాల తయారీ 33.9 శాతం, మోటారు వాహనాలు, ట్రైలర్లు, సెమీ ట్రైలర్ల తయారీ 19 శాతం, రబ్బరు మరియు ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీ 19.9 శాతం వృద్ధి చెందాయి. పారిశ్రామిక వృద్ధికి ఈ మూడు విభాగాలు అత్యధికంగా దోహదపడ్డాయని మోస్పీ పేర్కొంది. ఆరు పారిశ్రామిక విభాగాలు ప్రతికూల వృద్ధిని నమోదు చేశాయి. వీటిలో కలప మరియు కలప ఉత్పత్తులు 10.5 శాతం, ఔషధ ఉత్పత్తులు 8.9 శాతం, దుస్తుల తయారీ 5.2 శాతం చొప్పున క్షీణించాయి. విద్యుత్, గ్యాస్ సరఫరా రంగం 11.2 శాతం వృద్ధితో ప్రధాన రంగాల్లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన రంగంగా నిలిచింది. అయితే, ఆగస్టులో సవరించిన 12.3 శాతంతో పోలిస్తే సెప్టెంబర్‌లో వృద్ధి తగ్గింది. పునరుత్పాదకేతర వనరుల నుంచి విద్యుత్ ఉత్పత్తి 16.5 శాతం పెరిగింది. గ్యాస్ సరఫరా 6.7 శాతం క్షీణించింది. నీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, వ్యర్థాల నిర్వహణ రంగం సెప్టెంబర్‌లో 5.8 శాతం వృద్ధి సాధించింది. ఆగస్టులో నమోదైన 6.3 శాతంతో పోలిస్తే ఇది తక్కువ. మే నెలలో నమోదైన 5.5 శాతం తర్వాత ఇదే అత్యల్పవృద్ధి. మైనింగ్, క్వారీయింగ్ రంగం సెప్టెంబర్‌లో 6.2 శాతం క్షీణించింది. సెప్టెంబరు 2023లో నమోదైన 17 శాతం క్షీణత తర్వాత ఇదే అత్యంత తీవ్రమైన పతనం. ఈ రంగంలో వరుసగా మూడో నెల కూడా ప్రతికూల వృద్ధి నమోదైంది. మూలధన వస్తువుల వృద్ధి ఆగస్టులోని 15.9 శాతం నుంచి సెప్టెంబరులో 10.4 శాతానికి తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగానికి ఇదే అత్యల్ప వృద్ధిరేటు. వినియోగదారు డ్యూరబుల్స్ వృద్ధికూడా దాదాపు సగానికి తగ్గి 10.5 శాతం నుంచి 6 శాతానికి చేరింది. ఏప్రిల్ తర్వాత ఈ విభాగంలో నమోదైన అత్యల్ప వృద్ధిఇదే. పండుగల సీజన్ ప్రారంభమైనప్పటికీ ఈ పరిస్థితి నెలకొనడం గమనార్హం.

అదానీ పోర్ట్స్ నికర లాభం 16.5 వృద్ధి




న్యూఢిల్లీ, అక్టోబరు 28: అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ ఆదానిసెజ్ సెప్టెంబర్ త్రైమాసికం ఏకీకృత నికర లాభంలో 16.5 శాతం వృద్ధిని నమోదు చేసింది. పోర్టులు, లాజిస్టిక్స్, మెరైన్ వ్యాపారాల్లో వృద్ధి ఇందుకు దోహదపడింది. గత యేడాది ఇదే త్రైమాసికంలో రూ.3,109 కోట్లుగా ఉన్న నికర లాభం ఈసారి రూ.3,622 కోట్లకు చేరింది. ఆదాయం 23.7 శాతం పెరిగి రూ.11,340 కోట్లకు చేరుకోగా, ఎబిడిటా 22.6 శాతం వృద్ధితో రూ.6,806 కోట్లుగా నమోదైంది. ఎబిడిటా మార్జిన్ 60 శాతంగా ఉంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఆదాయ అంచనాను మరో రూ.1,000 కోట్లుపెంచి రూ.44,000-46,000 కోట్లకు కంపెనీ చేర్చింది. ఎబిడిటాఅంచనాను కూడా రూ.1,000 కోట్లు పెంచి రూ.26,000-27,000 కోట్లుగా నిర్ణయించింది. క్యాపెక్స్ అంచనాను గతంలో ప్రకటించిన రూ.12,000-14,000 కోట్ల నుంచి రూ.15,000-17,000 కోట్లకు పెంచింది. కంపెనీకి అతిపెద్ద వ్యాపార విభాగమైన దేశీయ పోర్టుల ఆదాయం వార్షిక ప్రాతిపదికన 13 శాతం పెరిగి రూ.7,177 కోట్లకు చేరింది. ఈ విభాగం ఎబిడిటా 11 శాతం వృద్ధితో రూ.5,201 కోట్లుగా నమోదైంది. త్రైమాసికంలో దేశీయ పోర్టుల ద్వారా 118 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకురవాణాజరిగింది. సరుకు రవాణాలో ఎపిసెజ్ మార్కెట్‌వాటా 27.3 శాతంగా, కంటైనర్ల విభాగంలో 44.4 శాతంగా ఉంది. అంతర్జాతీయ పోర్టుల వ్యాపారంలో రాబ డులు 71శాతం పెరిగి రూ.1,839 కోట్లకు చేరగా, ఎబిడిటా మూడు రెట్లకు పైగా పెరిగి రూ.878 కోట్లుగా నమోదైంది. 2026-27 ఆర్థిక సంవ త్సరం తొలి ఆరునెలల్లో ఎపిసెజ్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 21 శాతంపెరిగి రూ.22,161 కోట్లకు చేరింది. ఎబిడిటా కూడా 21 శాతం వృద్ధితో రూ.13,347 కోట్లుగా నమోదైంది. నికర లాభం 14 శాతం పెరిగి రూ.7,332 కోట్లకు చేరుకుంది. ఈ ఆరు నెలల కాలంలో కంపెనీ కార్యకలాపాల ద్వారా రూ.13,327 కోట్ల నగదు సమీకరణలుచేసింది.

ఆరు కంపెనీల బోర్డుల నుంచి వైదొలుగుతున్న నోయెల్ టాటా



ముంబయి, అక్టోబరు 28: పారిశ్రామికదిగ్గజం టాటా గ్రూప్‌లో ఒక కీలక నాయకత్వ మార్పు జరగనుంది. టాటా ట్రస్ట్స్ చైర్మన్‌గా ఉన్న నోయెల్ టాటా, గ్రూప్‌లోని ఆరు ప్రధాన కంపెనీల బోర్డుల నుంచి వైదొలగనున్నారు. నవంబరు 12న ఆయనకు 70 యేళ్లు నిండుతున్న సందర్భంగా, గ్రూప్ పదవీ విరమణ విధానాలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పరిణామం ఉప్పు నుంచి సాఫ్ట్‌వేర్ వరకు విస్తరించిన టాటా సామ్రాజ్యంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా భావిస్తున్నారు. ప్రస్తుతం నోయెల్ టాటా ట్రెంట్, వోల్టాస్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్, టాటా ఇంటర్నేషనల్ వంటి కంపెనీలకు నాన్‌ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. వీటితో పాటు గ్రూప్‌లోని మరో రెండు దిగ్గజ సంస్థలైన టాటా స్టీల్, టైటాన్ కంపెనీలకు వైస్‌చైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇప్పుడు ఈ ఆరు కంపెనీల బోర్డుల నుంచి ఆయన తప్పుకోనున్నారు. ఈ పరిణామంతో ఈ కీలక కంపెనీలలో నాయకత్వ మార్పులు అనివార్యమయ్యాయి. ఈ ఆరు ఆపరేటింగ్ కంపెనీల బోర్డుల నుంచి తప్పుకుంటున్నప్పటికీ, టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్ బోర్డులో మాత్రం ఆయన కొనసాగుతారు. టాటా ట్రస్ట్స్ తరఫున నామినీ డైరెక్టర్‌గా ఆయన తన సేవలను కొనసాగించనున్నారు. టాటా సన్స్‌లో టాటా ట్రస్ట్స్‌కు దాదాపు 66 శాతం వాటా ఉన్నందున, గ్రూప్ పాలనాపరమైన నిర్ణయాలలో నోయెల్ టాటా పాత్ర, ఆయన ప్రభావం యథాతథంగా కొనసాగుతుంది. అంతేగాక ట్రెంట్, టెస్కోల జాయింట్ వెంచర్ అయిన ట్రెంట్ హైపర్‌మార్కెట్ లిమిటెడ్ (స్టార్ బజార్) బోర్డులో కూడా ఆయన ఉంటారు. టాటా గ్రూప్ అనుసరిస్తున్న పటిష్ఠమైన కార్పొరేట్ పాలన నియమావళికి నోయెల్ టాటా పదవీ విరమణ ఒక నిదర్శనంగా నిలుస్తోంది. గ్రూప్ నిబంధనల ప్రకారం.. నాన్‌ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లకు 70 ఏళ్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లకు 65 యేళ్ల పదవీ విరమణ వయసుగా నిర్దేశించారు. ప్రమోటర్ల కుటుంబానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ, ఈ నిబంధనలను కచ్చితంగా పాటించడం గ్రూప్ సంస్థాగత క్రమశిక్షణను తెలియజేస్తోందని నిపుణులు చెపుతున్నారు. నోయెల్ టాటా నిష్క్రమణతో ఆయన స్థానంలో కొత్త నాయకత్వాన్ని ఎంపిక చేయాల్సిన అవసరం ఏర్పడింది. ముఖ్యంగా ట్రెంట్, వోల్టాస్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ వంటి సంస్థలకు కొత్త చైర్మన్‌లను, టాటా స్టీల్, టైటాన్ కంపెనీలకు కొత్త వైస్ చైర్మన్‌లను నియమించాల్సి ఉంటుంది.

నష్టాల్లోనే ముగిసిన సెన్సెక్స్ నిఫ్టీ



ముంబయి, అక్టోబరు 28: దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. దీంతో వరుసగా రెండో ట్రేడింగ్ సెషన్‌లోనూ సూచీలు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు అధిక స్థాయిలో కొనసాగడం, భారీ వెయిటేజీ కలిగిన షేర్లలో అమ్మకాల ఒత్తిడి మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. మరోవైపు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై తీసుకోనున్న నిర్ణయం వెలువడనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. వడ్డీ రేట్ల భవిష్యత్ దిశ, ప్రపంచ మార్కెట్లపై వాటి ప్రభావం ఎలా ఉండనుందనే అంశాలపై స్పష్టత కోసం మార్కెట్ వర్గాలు ఎదురుచూశాయి. నిఫ్టీ 22,700 పాయింట్ల దిగువన స్థిరపడింది. ఆయిల్ అండ్ గ్యాస్, ఐటీ షేర్లు నష్టాల్లో ముగియగా, ఆటోమొబైల్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాల షేర్లు లాభపడ్డాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 352.64 పాయింటు క్షీణించి 73,246.03 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 50.90 పాయింట్లు తగ్గి 22,698.85 వద్ద స్థిరపడింది. వరుసగా రెండు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 0.49 శాతం, నిఫ్టీ 0.24 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీ సూచీని ఎక్కువగా కిందకు లాగిన షేర్లలో ఇన్ఫోసిస్ 3.43 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 3.19 శాతం, భారతి ఎయిర్‌టెల్ 1.55 శాతం చొప్పున పడిపోయాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాల్లో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.51 శాతం పెరగగా, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.37 శాతం లాభపడింది. బిఎస్ఇలో మొత్తం 2,245 షేర్లు లాభాల్లో ముగియగా, 2,079 షేర్లు నష్టపోయాయి. మరో 241 షేర్లలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర పెరిగింది. డిసెంబరు 2026 సెటిల్‌మెంట్‌కు సంబంధించిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 1.24 డాలర్లు పెరిగి 115.12 డాలర్లకు చేరింది. భారత్‌లో పదేళ్ల కాలపరిమితి కలిగిన బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ రాబడి కూడా పెరిగింది. గత సెషన్‌లో 7.435 శాతంగా ఉన్న ఈ రాబడి బుధవారం 7.442 శాతానికి చేరింది. విదేశీ మారక మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలహీనపడింది. గత ట్రేడింగ్ సెషన్‌లో 95.2725 వద్ద ముగిసిన పాక్షికంగా కన్వర్టబుల్ రూపాయి, బుధవారం 95.0750 స్థాయిలో ట్రేడవుతూ కనిపించింది. ఎంసిఎక్స్‌లో డిసెంబరు 4, 2026 సెటిల్‌మెంట్‌కు సంబంధించిన బంగారం ఫ్యూచర్స్ ధర 0.10 శాతం తగ్గి రూ.1,44,000కు చేరింది. లార్సెన్ అండ్ టూబ్రో3.72 శాతం పెరిగింది. వేదాంత 3.30 శాతం లాభపడింది.సింజీన్ ఇంటర్నేషనల్: 12.19 శాతం దూసుకెళ్లింది. బజాజ్ ఆటో 0.91 శాతం పెరిగింది. పిజి ఎలక్ట్రోప్లాస్ట్ 7.16 శాతం ఎగబాకింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Superior Printers (P) Ltd. and published at Plot No.4-40/1, Alugunuru, 'X' Roads, Karimnagar-505527. Ph:2223355,2277034, 35, FAX: 2277036; Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. RNI No.APTEL/2001/07563.